వెబ్, డిజిటల్ & ప్రింటింగ్ న్యూస్ పేపర్

THE MOST Sensational TELUGU DAILY IN TELUGU STATES

www.kakatiyadaily@gmail.com



ఎడిటర్ ఇన్ చీఫ్ బెనర్జీనాథ్ చౌదరి

POSTAL REGD.NO.AP/VJ/GTR/58/2005

RNI.REGD.No.APTEL/2003/14530

"ప్రజాపక్షం- ప్రత్యక్షర సాక్ష్యం"

Estd: 2003

# కాకతీయ®

దినపత్రిక

08-03-2026 | ఆదివారం | గుంటూరు | రూ - 1-00 | పేజీలు : 8 | సంపుటి - 22 | సంచిక - 307

Epaper: kakatiyadaily.com | facebook: Kakatiya Daily | twitter.com: kakatiya | instragram.com : Kakatiya Daily

Editor In Chief Benarji Naddh 7729995277, 9989320577

Published From : GUNTUR, KHAMMAM, ANANTAPUR & KAKINADA

కాకతీయ ఈపేపర్ కొరకు kakatiyadaily.com లాగ్ అవ్వండి. 7729995277 వాట్సప్‌కు జాయిన్ అవ్వండి.

Legal affairs
All Legal Affairs About kakatiya Should be filed in Guntur Courts only

## ప్రభావం లేదంటూనే.. 'బండ' బాదుడు!



**ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా చేస్తున్న యుద్ధం కారణంగా.. చమురు సరఫరా చైన్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో కీలకమైన హెర్మూజ్ జలసంధిని ఇరాన్ తన నియంత్రణలోకి తీసుకోవడం.. నౌకల రవాణాపై ఆంక్షలు విధించడంతో చమురు సహా గ్యాస్ రవాణాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచ దేశాలపై చమురు ఉత్పత్తులకు సంబంధించి ప్రభావం పడుతోంది.**

అయితే.. భారత్ మాత్రం లేదు.. కాదు.. అంటూ ఇరాన్ ప్రభావాన్ని తక్కువ చేసి చూపుతోంది. "మనపై పెద్దగా ప్రభావం లేదు. ఇదిపశ్చిమ దేశాల గొడవ" అంటూ.. కేంద్ర హోం శాఖ కూడా పేర్కొంది. ఇక, విదేశాంగ, రక్షణ శాఖలు కూడా.. మన దేశంపై ప్రభావం లేదని చెప్పాయి. కానీ, మరోవైపు.. స్టాక్ మార్కెట్ల పరిస్థితి దారుణంగా మారింది. భారీ పతనంతో ముందుకుసాగుతున్నాయి. ఇదేసమయంలో డాలర్ మారకం విలువ కూడా పడిపోతోంది. ఇన్ని జరుగుతున్నప్పటికీ. కేంద్ర ప్రభుత్వం ఏమీ జరగదని.. ఎవరూ ఆందోళన చెందొద్దని కూడా చెప్పే సింది. కానీ, దొడ్డిదారిలోరాత్రికి రాత్రి(శుక్రవారం) గృహ వినియోగం సహా.. కమర్షియల్ వినియోగ గ్యాస్ సిలిండర్లపై బండ బాదుడు బాదేయడం గమనార్హం. అంతేకాదు.. రాత్రినుంచే ఇవి అమల్లోకి కూడా వచ్చేశాయి. గతంలో సిలిండర్ 20-30 మధ్యలో పెంచేందుకే ప్రభుత్వాలు వెనుక ముందు ఆడేవి. ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొనాల్సి ఉంటుందని ఆలోచన చేసేవి.కానీ, తాజాగా భారీ మొత్తంలో బండ బాదుడు బాదేశారు. మరి పైకి ఏమీ లేదని చెబుతున్నప్పుడు.. ఇలా బండ బాదుడుఎందుకన్నది విపక్షాల ప్రశ్న.

**ఇలా పెరిగాయి..** 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ పై 60 రూపాయలు పెంచారు. దీంతో డొమెస్టిక్ సిలిండర్ ధర 905 రూపాయల నుంచి ?965కు చేరింది. 19 కిలోల కమర్షియల్ సిలిండర్ పై ఏకంగా 115 పెంచారు. ఈ క్రమంలో కమర్షియల్ సిలిండర్ ధర 1,961 నుంచి 2,076 రూపాలకు చేరింది.



# మోడీ మంత్రి వర్గంలోకి జనసేన..

**కేంద్రంలో నరేంద్ర మోడీ మంత్రివర్గం విస్తరణకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. అన్నీ కుదిరితే తొందరలోనే మంత్రి వర్గాన్ని విస్తరించాలని ప్రధాని చూస్తున్నారు అని వార్తలు వస్తున్నారు. ఇప్పటికే బీహార్ సీఎం గా ఉన్న నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్తున్నారు. ఆయన వెయిటింగ్ సెంట్రల్ మినిస్టర్ గా ప్రచారంలో ఉంది. ఇక ఏపీ నుంచి కూడా కేంద్ర మంత్రివర్గంలో మరో బెర్త్ కన్ ఫర్మ్ అవుతుందని అంటున్నారు. ఆ చాన్స్ కచ్చితంగా జనసేనకే అని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.**

### ముగ్గురు కేంద్ర మంత్రులు

ఇదిలా ఉంటే ప్రస్తుతం ఏపీ నుంచి ముగ్గురు కేంద్ర మంత్రులు ఉన్నారు. అందులో రెండు టీడీపీకి ఉన్నాయి. టీడీపీకి ఒక కేబినెట్ ఒక సహాయ మంత్రి పదవి దక్కింది. మరో సహాయ మంత్రి పదవి బీజేపీకి ఇచ్చారు. ఇక కూటమిలో కీలక మిత్రుడుగా ఉన్న జనసేనకు ఒక కేంద్ర మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంది అని అంటున్నారు. 2024 జూన్ 9న ఏర్పాటు అయిన మోడీ మంత్రివర్గంలో దాదాపుగా మిత్రులు అందరికీ కేంద్ర బెర్తులు దక్కాయి. ఒక ఎంపీ ఉన్న వారికి కూడా మంత్రి పదవి ఇచ్చారు. అలాంటిది జనసేనకు మొదటి విడతలోనే ఇవ్వాలి. కానీ జనసేన అప్పుడు కోరుకోలేదని చెబుతారు. అయితే ఈసారి మాత్రం జనసేనకు కేంద్ర మంత్రి పదవి పక్కా అని వార్తలు వస్తున్నాయి.

### ఎవరా లక్కీ మినిస్టర్

ఇక జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. మచిలీ పట్నం నుంచి వల్లభనేని బాలశౌరి ఒకరు, ఆయన మూడు సార్లు ఎంపీగా గెలిచిన సీనియర్ మోస్ట్ లీడర్. ఆయన బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు, పైగా

02



## నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన పారిశ్రామికవేత్త రఘురామచౌదరి

- జనసేనలో చేరిన పూతలపట్టుకు చెందిన సిద్ధార్థ్ ఆగ్రో ప్రాసెసింగ్ యజమాని
- పవన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్న చౌదరి
- అందరినీ సమన్వయం చేసుకుని పార్టీని బలోపేతం చేస్తానని వెల్లడి

చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సిద్ధార్థ్ ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ అధినేత గుర్రం రఘురామచౌదరి అధికారికంగా జనసేన పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు కొణిదెల నాగబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్ళూరి ఆయనకు జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఐటీ కో-ఆర్డినేటర్ ఉయ్యాల శ్రీనివాస్, చిరంజీవి యువత

02

## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్
- ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్
- రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని,

02



## ఫామ్‌లో లేకున్నా అభిషేక్‌కే ఛాన్స్.. ఫైనల్లో రిస్క్ చేస్తున్న టీమిండియా?



- టీ20 వరల్డ్ కప్ ఫైనల్ ముందు అభిషేక్ శర్మ ఫామ్ పై ఆందోళన
- గత ఆరు మ్యాచుల్లో దారుణంగా విఫలమైన యువ ఓపెనర్
- అనారోగ్యం, ప్రత్యర్థుల వ్యూహాలతో ఇబ్బంది పడుతున్న అభిషేక్
- విన్నింగ్ కాంబినేషన్ మార్చకూడదని భావిస్తున్న టీమ్ మేనేజ్‌మెంట్
- ఫైనల్లోనూ అభిషేక్‌కే అవకాశం ఇవ్వాలని నిర్ణయం

02



## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- **చంద్రబాబు జనాభా విధానంపై వైఎస్ షర్మిల వ్యంగ్యం**
- **ఉన్న పిల్లలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు ఎందుకని ప్రశ్న**
- **నిరుద్యోగులు ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటున్నారని ఆవేదన**
- **రాష్ట్ర అప్పులు 12 లక్షల కోట్లకు చేరాయని మండిపాటు**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జనాభా నియంత్రణ ఎత్తివేత, ఎక్కువ మంది పిల్లలను కనడంపై అసెంబ్లీలో చేసిన ప్రకటన పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగ్యంగా స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.

02

## ఇరాన్ ఉద్రిక్తతలు... పెట్రోల్, డీజిల్ ధరలపై క్లారిటీ ఇచ్చిన కేంద్రం

- పెట్రోల్ డీజిల్ ధరలు పెరగవని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వ వర్గాలు
- దేశంలో మెరుగుపడిన ఇంధన నిల్వలు మరియు సరఫరా వ్యవస్థ
- విపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని ఖండన
- వంటగ్యాస్ మినహా మిగిలిన ఇంధన ధరలు స్థిరమేనని వెల్లడి
- హార్ముజ్ జలసంధిపై తగ్గిన ఆధారపడటం



వాహనదారులకు ఊరటనిచ్చే వార్త ఇది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. ప్రస్తుతం భారత్‌లో ఇంధన నిల్వలు మెరుగుపడుతున్నాయని, పరిస్థితి మరింత స్థిరంగా మారుతోందని, అందువల్ల ధరల పెంపు ఉండదని వెల్లడించాయి. ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేశాయి. అయితే, ధరలు పెరగవన్న హామీ కేవలం పెట్రోల్, డీజిల్ విషయంలోనేనని, ఎల్‌పీజీ (వంటగ్యాస్) విషయంలో కాదని స్పష్టత ఇచ్చారు. గడిచిన 12 ఏళ్లలో ఎల్‌పీజీ సిలిండర్ ధర సుమారు రూ.110 మేర పెరిగిందని అధికారులు గుర్తుచేశారు. ప్రస్తుతం ఎల్‌పీజీ ఉత్పత్తికి ప్రాధాన్యతనిస్తూ, సరఫరా మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మరోవైపు, ముడి చమురు దిగుమతుల కోసం సమస్యాత్మక మార్గాలపై ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకుంది. హోర్ముజ్ జలసంధి కాకుండా ఇతర మార్గాల ద్వారా చమురు దిగుమతులను పెంచుకున్నట్లు అధికారులు తెలిపారు. "గతంలో 60 శాతం ముడి చమురు

02

## లస్కర్లకు గుడ్ న్యూస్.. వేతనాలు పెంచిన ప్రభుత్వం

- ఏపీలో జలవనరుల శాఖ లస్కర్ల వేతనాల పెంపు
- రోజువారీ వేతనాన్ని రూ. 350 నుంచి రూ. 550కి పెంచిన ప్రభుత్వం
- లస్కర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు సర్కార్
- పెంచిన వేతనాలు తక్షణమే అమలు చేయాలని ఉత్తర్వులు

## ఏపీ హైకోర్టుకు తొలి మహిళా సీజే .. చరిత్ర సృష్టించనున్న లీసా గిల్

- పంజాబ్, హర్యానా హైకోర్టు నుంచి ఆమె బదిలీకి కేంద్రం ఆమోదం
- ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్‌లో పదవీ విరమణ
- ముందుగా న్యాయమూర్తిగా చేరి, ఆ తర్వాత సీజేగా బాధ్యతలు స్వీకరించనున్న లీసా గిల్



## అన్నయ్య చిరంజీవికి అభినందనలు తెలిపిన పవన్ కల్యాణ్

- మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు దక్కడంపై సంతోషం
- అన్నయ్య ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడిన వైనం
- కమల్ హాసన్, జయసుధ సహా అవార్డు గ్రహీతలందరికీ అభినందనలు



2
08 ఆదివారం
మార్చి
2026
కాకతీయ ప్రాంతీయమ్

# అమ్మాయి పెళ్లికి తులం బంగారం, ప్రతి మహిళకు రూ.2,500 ఆర్థిక సాయం: విజయ్ హామీల వర్షం

**నవజాత శిశువుకు బంగారు ఉంగరం ఇస్తామని హామీ**

**ప్రభుత్వ ఉద్యోగులు మినహా, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం**

**ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రూ.15 వేల ఆర్థిక సాయం**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ హామీల వర్షం కురిపించారు. మహిళల కోసం అనేక వాగ్దానాలు చేశారు. తమిళనాడులో తాము అధికారంలోకి వస్తే నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, యువతులకు పెళ్లి కోసం తులం బంగారం, పట్టుచీర, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి ఆరు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీల వర్షం కురిపించారు. నవజాత శిశువులకు బంగారు ఉంగరం ఇస్తామని విజయ్ తెలిపారు. మహిళలకు అన్ని రకాల ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు మినహా, 60 సంవత్సరాల వయస్సు వరకు మహిళలందరికీ నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామని విజయ్ వెల్లడించారు. అన్నపూరణి సూపర్ సిక్స్ పథకం కింద ఈ ఆరు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని అన్నారు. కామరాజర్ కల్వి ఉరుతి తిట్టం పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సంవత్సరానికి రూ.15,000 అందిస్తామని అన్నారు. మామల్లపురంలో టీవీకే ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విజయ్ ఈ హామీలు ఇచ్చారు.

## నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన పారిశ్రామికవేత్త రఘురామచౌదరి

**మొదటిపేజీ తరువాయి**

అధ్యక్షుడు పూల ప్రభాకర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామచౌదరి మాట్లాడుతూ... పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, పార్టీ విధివిధానాలకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంతో పాటు చిత్తూరు పార్లమెంటు స్థానం పరిధిలో జనసేనను బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ శ్రమిస్తానని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా మామిడి గుజ్జు (మ్యాంగో పల్ప్) పరిశ్రమ ద్వారా జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులకు అండగా నిలుస్తున్న రఘురామచౌదరి, ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై స్థానిక రైతులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రఘురామచౌదరి వంటి బలమైన ఆర్థిక నేపథ్యం, సామాజిక వర్గ మద్దతు ఉన్న నేత చేరికతో చిత్తూరు జిల్లాలో జనసేన మరింత పుంజుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

**మొదటిపేజీ తరువాయి**

గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు. మద్యం వ్యాపారం ద్వారా ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

## ఫామ్‌లో లేకున్నా అభిషేక్‌కే ఛాన్స్.. ఫైనల్లో రిస్క్ చేస్తున్న టీమిండియా?

**మొదటిపేజీ తరువాయి**

టీ20 ప్రపంచకప్ ఫైనల్ సమరానికి ముందు టీమిండియాను ఒక కీలక సమస్య వేధిస్తోంది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ వరుస వైఫల్యాలు జట్టు యాజమాన్యానికి తలనొప్పిగా మారాయి. అయితే, ఫామ్‌తో సంబంధం లేకుండా ఆదివారం అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరగనున్న తుదిపోరులోనూ అతడికే అవకాశం ఇవ్వాలని జట్టు యాజమాన్యం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. విన్నింగ్ కాంబినేషన్ ను మార్చేందుకు సుముఖంగా లేకపోవడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ టోర్నమెంట్ ఆరంభంలో అంచనాలు వేరేగా ఉన్నాయి. అభిషేక్ శర్మ జట్టుకు కీలకంగా మారతాడని, సంజూ శాంసన్ ప్రదర్శనపైనే సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ, టోర్నీ కీలక దశకు చేరుకునేసరికి పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. సంజూ శాంసన్ నిలకడైన ప్రదర్శనతో విమర్శలకు సమాధానం చెప్పగా, అభిషేక్ శర్మ ఫామ్ పూర్తిగా పక్కదారి పట్టింది. గత ఆరు మ్యాచుల్లో 0, 0, 0, 15, 10, 9 పరుగులతో దారుణంగా విఫలమయ్యాడు. జింబాబ్వేపై చేసిన అర్ధశతకం మినహా ఈ టోర్నీలో చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఒక్కటీ లేదు. అభిషేక్ ఫామ్ కోల్పోవడానికి శారీరక ఇబ్బందులు కూడా ఒక కారణం. లీగ్ దశ తర్వాత కడుపు ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రి పాలైన అభిషేక్, గణనీయంగా బరువు తగ్గడంతో తన లయను కోల్పోయాడు. ఇదే సమయంలో ప్రత్యర్థి జట్లు కూడా అతడి బలహీనతలను పసిగట్టాయి. పవర్‌ప్లేలో పేస్ బౌలింగ్‌ను ఇష్టపడే అభిషేక్‌కు స్పిన్నర్లను ప్రయోగించి కట్టడి చేస్తున్నాయి. ఆఫ్ స్పిన్నర్లు, స్లో లెఫ్ట్ ఆర్మ్ బౌలర్లతో అతడిని పరుగులు చేయకుండా నిలువరిస్తున్నాయి. పేస్ లేని బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతూ, షాట్లకు తొందరపడి వికెట్ సమర్పించుకుంటున్నాడు. అతడి స్థానంలో రింకూ సింగ్‌ను తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, అది జట్టు కూర్పును దెబ్బతీస్తుందని యాజమాన్యం భావిస్తోంది. ఓపెనర్‌గా కాకుండా రింకూను తీసుకుంటే, అతను 7 లేదా 8వ స్థానంలో బ్యాటింగ్‌కు రావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అభిషేక్ దూకుడైన ఆటతీరుపై నమ్మకం ఉంచి, ఫైనల్లోనూ అతడికే మద్దతుగా నిలవాలని టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయించుకున్నట్టు స్పష్టమవుతోంది. "అభిషేక్‌పై జీజీ భాయ్ (గంభీర్), సూర్య లకు చాలా నమ్మకం ఉంది. మేం మా ఆటగాళ్లందరినీ జాగ్రత్తగా చూసుకుంటాం" అని సెమీస్ అనంతరం సంజూ శాంసన్ చెప్పిన మాటలు ఈ వాదనకు బలం చేకూరుస్తున్నాయి.

## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

"చంద్రబాబు పాపులేషన్ పాలసీ హాస్యాస్పదం. ఉన్న బిడ్డలకే దిక్కులేదు... ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా? మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా? ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు అమలు కాలేదు. మీరు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవు. ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారు. మాఫియాలు చేసుకుంటూ, రాష్ట్రాన్ని దోచుకుంటూ... బిడ్డలను కనమని చెబితే ఎలా చంద్రబాబు గారూ?" అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

## ఇరాన్ ఉద్రిక్తతలు... పెట్రోల్, డీజిల్ ధరలపై క్లారిటీ ఇచ్చిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**

దిగుమతులు ఇతర మార్గాల ద్వారా వచ్చేవని, ఇప్పుడు ఆ వాటా 70 శాతానికి పెరిగింది" అని వివరించారు. హోర్ముజ్ జలసంధి ద్వారా కూడా మొదటి కార్గో రవాణా ప్రారంభమైందని, సరఫరా వ్యవస్థ గాడిలో పడుతోందని పేర్కొన్నారు. ఇంధన సరఫరా, ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు.

## దుబాయ్‌లో చవకగా బంగారం... ముఖ్య కారణం ఇదే!

సాధారణంగా పండుగలు లేదా ప్రత్యేక సందర్భాల్లో ఎలక్ట్రానిక్స్, వస్త్రాలపై ఆఫర్లు ఉండటం సహజం. కానీ, ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ యుద్ధ వాతావరణం కారణంగా దుబాయ్‌లో బంగారంపై అనూహ్యమైన డిస్కౌంట్లు లభిస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా రవాణా వ్యవస్థ స్తంభించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 5,147 డాలర్ల వద్ద ఉండగా, దుబాయ్‌లో మాత్రం దీనికంటే దాదాపు 30 డాలర్లు (సుమారు రూ.2,700కు పైగా) తక్కువకే విక్రయిస్తున్నారు. ప్రధానంగా బులియన్ వ్యాపారులు, సంస్థలకు ఈ తగ్గింపు వర్తిస్తోంది.

**రాయితీ వెనుక ఉన్న అసలు కారణాలు..** ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో విమాన సర్వీసులు అరకొరగా నడుస్తున్నాయి. సాధారణంగా ప్రయాణికుల విమానాల్లోని కార్గో విభాగంలో బంగారాన్ని సురక్షితంగా తరలిస్తుంటారు. అయితే, యుద్ధం కారణంగా యూఏఈ గగనతలం మీదుగా వెళ్లే విమానాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. సౌదీ అరేబియా, ఒమన్ మార్గాల ద్వారా వెళ్లాల్సి వస్తున్నా, వ్యాపారులు ఆ మార్గాలపై ఆసక్తి చూపడం లేదు. మరోవైపు, సరుకు రవాణాలో అనిశ్చితి నెలకొనడం, డెలివరీ ఖర్చులు మరియు బీమా ప్రీమియంలు విపరీతంగా పెరిగిపోవడంతో కొనుగోలుదారులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో స్టాక్ తమ వద్దే ఉండిపోతే నష్టాలు వస్తాయన్న భయంతో, దుబాయ్ వ్యాపారులు అంతర్జాతీయ రేటు కంటే తక్కువకే బంగారాన్ని వదిలించుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. శుక్రవారం నాటికి కూడా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలు దుబాయ్‌లోనే ఉండిపోయినట్లు సమాచారం.

# డేరా చీఫ్‌కు క్లీన్ చిట్.. కానీ జైలులోనే ఉండక తప్పదు: ఎందుకంటే?



రాజకీయాలు, ఆధ్యాత్మికత, వివాదాలు.. ఈ మూడింటి కలయిక అంటే మనకు వెంటనే గుర్తొచ్చే పేరు 'డేరా బాబా'. డేరా సచ్చా సౌదా చీఫ్ గు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు తాజాగా పంజాబ్-హర్యానా హైకోర్టులో ఒక పెద్ద విజయం దక్కింది. గత రెండు దశాబ్దాలుగా ఆయనను వెంటాడుతున్న ఒక కీలక కేసులో కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసలు ఆ కేసు ఏంటి? కోర్టు తీర్పులో ఏముంది? అనే విషయాలను మనం ఒకసారి లోతుగా గమనిస్తే ఆశ్చర్యపోవాల్సిందే.

**జర్నలిస్టు హత్య కేసులో విముక్తి!**

సుమారు 20 ఏళ్ల క్రితం రామచందర్ ఛత్రపతి అనే జర్నలిస్టు దారుణంగా హత్యకు గురయ్యారు. డేరా ఆశ్రమంలో జరిగే అకృత్యాలను ఆయన తన పత్రికలో బయటపెట్టారనే కారణంతోనే ఈ హత్య జరిగిందని అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన కింది కోర్టు, 2019లో డేరా బాబాను దోషిగా నిర్ధారిస్తూ 'యావజ్జీవ కారాగార శిక్ష' విధించింది. అప్పటి నుండి ఆయన జైలులోనే ఉంటున్నారు. అయితే, ఈ తీర్పును సవాలు చేస్తూ డేరా బాబా హైకోర్టును ఆశ్రయించగా, తాజాగా ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. సాక్ష్యాధారాలు సరిగ్గా లేవనే కారణంతో కింది కోర్టు విధించిన శిక్షను హైకోర్టు రద్దు చేసింది.

**అయినా జైలులోనే ఎందుకు?**

హత్య కేసులో నిర్దోషిగా బయటపడ్డారు కదా, మరి డేరా బాబా బయటకు వచ్చేస్తారా? అంటే దానికి సమాధానం 'లేదు' అనే చెప్పాలి. ఎందుకంటే ఆయన కేవలం ఈ ఒక్క కేసులోనే శిక్ష అనుభవించడం లేదు. 2017లో మహిళలపై అత్యాచారం చేసిన కేసులో ఆయన దోషిగా తేలారు. ఆ కేసులో ఆయనకు సుదీర్ఘ కాలం శిక్ష పడింది. కాబట్టి, హత్య కేసులో ఊరట లభించినా, అత్యాచారం కేసులో శిక్ష అనుభవిస్తున్న కారణంగా ఆయన జైలులోనే ఉండాల్సి వస్తుంది.

**పెరోల్స్ పర్వం.. ఒక రికార్డు!**

డేరా బాబా గురించి మనం మాట్లాడుకునేటప్పుడు అందరినీ ఆశ్చర్యపరిచే మరో విషయం ఆయన 'పెరోల్స్'. సాధారణంగా జైలులో ఉన్న ఖైదీలకు పెరోల్ దొరకడం అంటే చాలా పెద్ద ప్రక్రియ. కానీ డేరా బాబా విషయంలో మాత్రం ఇది చాలా సులభంగా జరిగిపోతుంటుంది. 2017లో జైలుకు వెళ్లినప్పటి నుండి ఇప్పటివరకు ఆయన దాదాపు 15 సార్లు పెరోల్‌పై బయటకు వచ్చి వెళ్లారు. అంటే సగటున ఏడాదికి రెండు మూడు సార్లు ఆయన బయట కనిపిస్తున్నారన్నమాట. ఇది ఒకరకంగా రికార్డు అనే చెప్పాలి. ఎన్నికల సమయంలో లేదా ఇతర కీలక సందర్భాల్లో ఆయనకు పెరోల్ లభించడంపై ప్రతిపక్షాలు ఎప్పుడూ విమర్శలు చేస్తూనే ఉంటాయి.

**న్యాయం ఎటువైపు?**

ఒక జర్నలిస్టు ప్రాణాలు కోల్పోయి 20 ఏళ్లు గడిచాక, ప్రధాన నిందితుడు నిర్దోషిగా బయటపడటం అనేది చర్చనీయాంశమే. న్యాయస్థానాలు సాక్ష్యాధారాల మీద ఆధారపడి తీర్పులు ఇస్తాయి. అయితే, బాధిత కుటుంబం మాత్రం తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. మరోవైపు డేరా బాబా భక్తులు మాత్రం ఇది దేవుడి విజయం అని సంబరాలు చేసుకుంటున్నారు. ఒకే మనిషి చుట్టూ ఇన్ని రకాల అభిప్రాయాలు, ఇన్ని కేసులు ఉండటం డేరా బాబాకే సాధ్యం. డేరా బాబాకు లభించిన ఈ ఊరట ఆయన భవిష్యత్తు రాజకీయ, ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని ఎలా మారుస్తుందో చూడాలి. హత్య కేసులో క్లీన్ చిట్ రావడం ఆయనకు పెద్ద ప్లస్ పాయింట్. కానీ అత్యాచారం కేసులో పడిన మచ్చ మాత్రం అలాగే ఉంది. న్యాయ పోరాటం ఇక్కడితో ఆగుతుందా లేక ఛత్రపతి కుటుంబం సుప్రీంకోర్టుకు వెళ్తుందా అనేది కాలమే నిర్ణయించాలి. ఏదేమైనా, డేరా బాబా వార్తల్లో లేని రోజు అంటూ ఉండదు అనేదానికి ఈ తాజా తీర్పే నిదర్శనం!

# వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇండియన్ నగరాలు!



భారతదేశం ఆర్థికంగా దూసుకుపోవడమే కాదు, ఆకాశమే హద్దుగా మన నగరాలు రూపురేఖలు మార్చుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా స్కైస్క్రాపర్స్ నిర్మాణంలో మన భారతీయ నగరాలు అగ్రస్థానంలో నిలవడం విశేషం. దుబాయ్, షెంజెన్ వంటి ప్రపంచ ప్రసిద్ధ నగరాలను వెనక్కి నెట్టి ముంబై, హైదరాబాద్ వంటి నగరాలు టాప్ లిస్టులో చోటు సంపాదించాయి. అసలు ఏ నగరాల్లో ఈ భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది? మన దేశ భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ఇప్పుడు చూద్దాం..

**ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్న ముంబై, హైదరాబాద్:**

నిర్మాణ రంగంలో ప్రస్తుతం భారత్ ఒక సునామీలా దూసుకుపోతోంది. తాజా గ్లోబల్ లెక్కల ప్రకారం, ప్రపంచంలోనే అత్యధికంగా ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్న నగరాల్లో ముంబై మొదటి స్థానంలో నిలిచింది. ఇక ఇక్కడ ఏకంగా 200కు పైగా భారీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇక మన భాగ్యనగరం హైదరాబాద్ గురించి ఎంత చెప్పినా తక్కువే. 181 హైరైజ్ బిల్డింగ్స్‌తో ముంబై తర్వాత రెండో స్థానాన్ని ఆక్రమించి ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది. అంటే దుబాయ్ 38, షెంజెన్ 73 వంటి నగరాల కంటే మన హైదరాబాద్‌లోనే ఎక్కువ నిర్మాణాలు సాగుతుండటం మనందరికీ గర్వకారణం.

**టాప్ 5లో మూడు భారతీయ నగరాలే:**

ఈ జాబితాలో కేవలం ముంబై, హైదరాబాద్ మాత్రమే కాదు, మరికొన్ని భారతీయ నగరాలు కూడా సత్తా చాటుతున్నాయి. మూడో స్థానంలో 170 నిర్మాణాలతో గురుగ్రామ్ నిలవగా, ఐదో స్థానంలో 79 నిర్మాణాలతో థానే చోటు దక్కించుకుంది. ఇక అంటే ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న టాప్ 5 నగరాల్లో నాలుగు మన దేశానివే కావడం విశేషం. చైనాలోని షెంజెన్, గ్వాంగ్జౌ, ఉహాన్ వంటి నగరాల కంటే మన నగరాల్లోనే రియల్ ఎస్టేట్ మరియు మౌలిక సదుపాయాల కల్పన అత్యంత వేగంగా జరుగుతోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**మారుతున్న నగరాల స్వరూపం.. పెరగనున్న ఉపాధి:**

ఈ భారీ నిర్మాణాల వల్ల కేవలం భవనాలు మాత్రమే పెరగడం లేదు, వీటితో పాటు లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నవీ ముంబై 27 నిర్మాణాలు కూడా ఈ రేసులో గట్టి పోటీనిస్తోంది. ఇక టోక్యో, టొరంటో వంటి అంతర్జాతీయ నగరాలను కూడా మన నగరాలు దాటేయడం చూస్తుంటే, రాబోయే ఐదేళ్లలో మన నగరాల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఆధునిక సౌకర్యాలు, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ భవనాలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవడమే కాకుండా, ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించే కేంద్రాలుగా మారుతున్నాయి..

# సర్కారు బడి పిల్లలకు అదిరిపోయే మెనూ.. ఇక వారానికోసారి చేపల కూర!



తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకోబోతోంది. మధ్యాహ్న భోజన పథకం అంటే కేవలం ఆకలి తీర్చడమే కాదు, పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మెనూలో కీలక మార్పులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త మార్పుల్లో భాగంగా ఇకపై విద్యార్థులకు వారానికి ఒకరోజు రుచికరమైన చేపలను అందించే అవకాశం ఉంది.

**చికెన్ స్థానంలో!**

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వారానికి ఒకసారి చికెన్ అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, విద్యార్థుల ఆరోగ్యానికి మరింత బూస్ట్ ఇవ్వాలనే ఉద్దేశంతో, చికెన్ స్థానంలో లేదా దానికి అదనంగా వారానికి ఒక రోజు చేపలను చేర్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. చేపల్లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి, అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్లు పిల్లల శారీరక దృఢత్వానికే కాకుండా, వారి మానసిక ఎదుగుదలకు, జ్ఞాపకశక్తి పెరగడానికి ఎంతో తోడ్పడతాయని వైద్య నిపుణులు చెబుతుంటారు. అందుకే ఈ మార్పును తీసుకురావాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది.

**99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా..**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ కొత్త మెనూను అమలు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీనిపై ఇప్పటికే విద్యాశాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ప్రతి విద్యార్థికి సరైన పౌష్టికాహారం అందేలా చూడడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. వారం చికెన్, మరో వారం చేపలు అందించేలా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

**అధికారుల పరిశీలన, అమలు**

కేవలం చేపలు ఇవ్వడమే కాకుండా, వాటిని పాఠశాలల్లో ఎలా వండి పెట్టాలి? ముళ్లు లేని చేపలను ఎలా సేకరించాలి? ఏ రకమైన చేపలు పిల్లలకు సురక్షితంగా ఉంటాయి? వంటి విషయాలపై అధికారులు క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నారు. పిల్లలు భయం లేకుండా, ఇష్టంగా తినేలా ఈ మెనూను రూపొందించబోతున్నారు. స్థానికంగా లభించే తాజా చేపలను సేకరించడం ద్వారా అటు మత్స్యకారులకు ఉపాధి, ఇటు పిల్లలకు ఆరోగ్యం చేకూర్చాలనేది ప్రభుత్వ వ్యూహం.

**గ్రామీణ విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు ఎక్కువగా పోషకాహార లోపంతో బాధపడుతుంటారు. బడిలో ఇచ్చే ఈ బలవర్ధకమైన భోజనం వారి ఆరోగ్య స్థితిగతులను పూర్తిగా మార్చేయగలదు. చేపల వినియోగం వల్ల పిల్లల్లో కంటి చూపు మెరుగుపడటంతో పాటు, రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఇది విద్యార్థులు బడికి వచ్చే శాతాన్ని పెంచడమే కాకుండా, వారు పాఠాలను మరింత శ్రద్ధగా వినేలా ప్రోత్సహిస్తుంది. సర్కారు బడి పిల్లలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడేలా వారిని శారీరక, మానసిక సిద్ధం చేయడమే ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న అసలు ఉద్దేశం. సర్కారు బడి పిల్లలకు ఇలాంటి బలవర్ధకమైన ఆహారం అందించడం వల్ల వారిలో చురుకుదనం పెరుగుతుంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ సాహసోపేత నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది. త్వరలోనే ఈ 'ఫిష్ మెనూ' పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే, బడి పిల్లల భోజనం మరింత రుచికరంగా, ఆరోగ్యకరంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు! మన పిల్లల భవిష్యత్తుకు ఇదొక గట్టి పునాది కాబోతోంది.

# మోడీ మంత్రి వర్గంలోకి జనసేన..

**మొదటిపేజీ తరువాయి**

అనుభవం ఉంది. దాంతో ఆయనకు చాన్స్ ఇస్తారా అన్న చర్చ అయితే బాగా వస్తోంది. ఇక జనసేనకు చెందిన మరో ఎంపీ కాకినాడ నుంచి గెలిచిన ఉదయ్ శ్రీనివాస్. ఆయన తొలిసారి గెలిచారు. అయితే ఇవ్వాలని అనుకుంటే ఆయనకు కూడా చాన్స్ ఉండొచ్చు అని అంటున్నారు. ఈ ఇద్దరూ కాకుండా జనసేనకు జూన్ లో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో ఒక సీటు కచ్చితంగా దక్కబోతోంది. దాంతో రాజ్యసభ ద్వారా జనసేన ఎంపీగా ఎవరు వస్తారు అన్నది అయితే తెలియదు. కానీ ప్రచారంలో ఉన్న పేరు అయితే లింగమనేని రమేష్ అని అంటున్నారు. ఒకవేళ ఆయన అయితే ఆయనకు కూడా కేంద్ర మంత్రి పదవికి అవకాశం ఉండొచ్చు అని అంటున్నారు.

**టీడీపీ కూడా రేసులో :** ఇక ఏపీలో రెండు కేంద్ర మంత్రి పదవులు ఉన్న టీడీపీకి మరో కేంద్ర మంత్రి పదవి ఇస్తారు అని ప్రచారం సాగుతోంది. ఈసారి కనుక చాన్స్ ఇస్తే దానిని సామాజిక ప్రాంతీయ కోణంలో నుంచి ఆలోచించి రాయలసీమకు ఇస్తారు అని అంటున్నారు. అలాగే మహిళా ఎంపీకి ఈ పదవి దక్కే చాన్స్ ఉందని అంటున్నారు. మరి ఏపీ నుంచి మిత్రులకు 18 మంది ఎంపీలు ఉన్నారు. ఇప్పటికి మూడు మంత్రి పదవులు ఇచ్చారు జనసేనకు ఇస్తే నాలుగు కేంద్ర మంత్రి పదవులు అవుతాయి. అలా కాకుండా అయిదవ కేంద్ర మంత్రి పదవి ఇస్తారా అన్నది అయితే ఒక చర్చ. చూడాలి మరి కేంద్రంలోని బీజేపీ పెద్దలు ఏ రకంగా నిర్ణయం తీసుకుంటారో.


**కాబోయే మంత్రిగా :** ఇక ఏపీ రాజకీయాలు తీసుకుంటే రెండేళ్ళ తరువాత కచ్చితంగా కూటమి ప్రభుత్వం కూడా మంత్రి వర్గాన్ని విస్తరిస్తుంది అని అంటున్నారు. దాంతో బీజేపీకి ఈసారి తప్పనిసరిగా రెండవ బెర్త్ దక్కుతుంది అని అంటున్నారు. ఈ లెక్క తీసుకుంటే బీజేపీ సీనియర్ నేత మాజీ ఏపీ ప్రెసిడెంట్ అయిన సోము వీర్రాజు పేరు బలంగా వినిపిస్తోంది. సోము వీర్రాజు ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారు, కేంద్ర పెద్దలతో మంచి రిలేషన్స్ ఉన్నాయి. ఆయన 2015 నుంచి 2021 దేఅకా తొలిసారి ఎమ్మెల్సీగా పనిచేశారు. ఇపుడు మళ్ళీ ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. ఇంతటి సీనియారిటీ ఉన్నా అధికార వైభోగాలు అయితే ఏనాడూ ఆయనకు దక్కలేదు,

**ఫైర్ బ్రాండ్ లీడర్ గా :** దాంతో సామాజిక ప్రాంతీయ సమీకరణలు అన్నీ కుదురుతున్న వేళ బీజేపీ ఆర్ఎస్ఎస్ పెద్దల ఆశీస్సులు ఉన్న క్రమంలో సోము వీర్రాజుకు మంత్రి పదవి దక్కడం ఖాయమని అంటున్నారు. బీజేపీలో ఫైర్ బ్రాండ్ లీడర్ గా ఉన్న సోముకు కనుక పదవి ఇస్తే కూటమిని మరింత గట్టిగా వెనకేసుకుని వచ్చే మంచి మిత్రుడు దొరుకుతారు అని కూడా అంటున్నారు. మొత్తం మీద చూస్తే రానున్న కాలంలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో అటు జనసేనకు కేంద్రంలో చాన్స్ వస్తే ఇటు ఏపీలో సోము వీర్రాజు మంత్రి అవుతారు అని గట్టిగా వినిపిస్తున్న మాటగా ఉంది.

## మమతా బెనర్జీ, బెంగాల్ ప్రభుత్వం తీరుపై ద్రౌపది ముర్ము అసహనం

పశ్చిమ బెంగాల్ పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ వైఫల్యం కనిపించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వలేదని, అలాగే రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు ముఖ్యమంత్రి లేదా మంత్రుల నుంచి అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. ఆదివాసీ సదస్సుకు తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉందని తెలిపారు. దీనికి ప్రభుత్వం అనుమతించకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఇంత చేసినప్పటికీ తనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఎలాంటి ద్వేషం లేదని, ఆమె తన సోదరితో సమానమని అన్నారు. కానీ ఆమె కోపంగా ఉండవచ్చని వ్యాఖ్యానించారు. బెంగాల్ గవర్నర్ ట్రాన్స్ ఫర్ అయినందున స్వాగతం పలకలేకపోయారని తనకు తెలుసని అన్నారు. తాను కూడా బెంగాల్ బిడ్డనే అని అన్నారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగురికి వెళ్లారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతికి ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు స్వాగతం పలకాలి. కానీ అధికారికంగా స్వాగతం పలకడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. అంతర్జాతీయ సంతాల్ సదస్సును బిధాన్ నగర్‌లో నిర్వహించాల్సి ఉండగా, అధికారులు సిలిగురిలోని గోసాయిన్?పూర్‌కు మార్చారని ద్రౌపది ముర్ము తెలిపారు. సంతాల్ సదస్సుకు పెద్ద ఎత్తున సంతాల్ ఆదివాసీలు తరలి వస్తుండటం తాను చూశానని, కానీ వారిని కొంతమంది అడ్డుకున్నారని ఆరోపించారు. సంతాల్ జాతీయులు ఏకంకావడం, చదువుకోవడం, బలోపేతం కావడం వారికి ఇష్టం లేనట్లుగా ఉందని అన్నారు.

## 'కేరళ స్టోరీ' సినిమాను ఎవరూ చూడటం లేదన్న రాహుల్ గాంధీ... బీజేపీ ఎంపీ భార్య కౌంటర్



'ది కేరళ స్టోరీ-2' చిత్రాన్ని ఎవరూ చూడటం లేదని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. రాజకీయ లబ్ధి కోసం కొంతమంది ఈ చిత్రాన్ని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. నిజమైన కేరళ సంస్కృతి, సంప్రదాయాలు ఏమిటో ఈ దేశ ప్రజలందరికీ తెలుసని అన్నారు. కానీ సమాజంలో విద్వేషాలు పెంచడానికి, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకోవడానికి కొందరు వ్యక్తులు సినిమాలను, మీడియాను ఆయుధంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని, అలాంటి కార్యకలాపాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కూడా దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవతలి వారికి సమాధానం చెప్పడానికి కూడా అవకాశం ఇవ్వరని విమర్శించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ భార్య సురభి తివారీ స్పందించారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సురభి తివారీ తప్పుబట్టారు. ఇంట్లో కూర్చుని ఇలాంటి మాటలు మాట్లాడటం సరైన విధానం కాదని హితవు పలికారు. థియేటర్‌కు వెళ్లి సినిమా చూశాక, దానికి సంబంధించిన డాక్యుమెంట్లు, కేసులు చదివిన తర్వాత అది నిజమో కాదో ప్రజలే తేల్చుకుంటారని అన్నారు.

# బ్లూ స్పారో'తోనే ఖమేనీ అంతం.. ఆ క్షిపణి కథ ఇదీ



మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇజ్రాయెల్ అభివృద్ధి చేసిన అత్యాధునిక 'బ్లూ స్పారో' మిస్సైల్‌తో జరిగిన దాడిలో ఖమేనీ మృతి చెందినట్లు అంతర్జాతీయ భద్రతా వర్గాలు పేర్కొంటున్నాయి. సాంకేతికంగా అత్యంత క్లిష్టమైన ఈ దాడి మిడిల్ ఈస్ట్ యుద్ధ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. ఇరాన్ ను యుద్ధంలోకి దించింది. అమెరికా-ఇజ్రాయెల్ వ్యూహాత్మక సహకారంతో జరిగిన ఈ ఆపరేషన్‌లో ఖమేనీ కదలికలను చాలా కాలంగా నిఘా సంస్థలు గమనిస్తున్నట్లు సమాచారం. ఖమేనీ నివాస సముదాయం, భద్రతా వ్యవస్థలు, రక్షణ ఏర్పాట్లు వంటి వివరాలను మోసాద్, సీఐఏ, ఇజ్రాయెల్ సైబర్ యూనిట్ 8200 వంటి సంస్థలు దీర్ఘకాలంగా విశ్లేషించాయి. చివరకు సరైన సమయం కోసం ఎదురుచూసి భారీ దాడికి రూపకల్పన చేశాయి.

**బ్లూ స్పారో ప్రయోగం..** ఫిబ్రవరి 28 ఉదయం జరిగిన ఈ దాడిలో ఇజ్రాయెల్ యుద్ధవిమానాల నుంచి 'బ్లూ స్పారో' మిస్సైల్‌ను ప్రయోగించినట్లు సమాచారం. దాదాపు 1900 నుంచి 2000 కిలోల బరువు ఉన్న ఈ మిస్సైల్ సుమారు 2000 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను చేరుకోగలదు. సాధారణ బాలిస్టిక్ మిస్సైళ్లలా నేరుగా ప్రయాణించకుండా, ఇది ముందుగా వాయుమండల అంచులకు చేరి అక్కడి నుంచి అత్యంత వేగంతో లక్ష్యంపైకి నిటారుగా దూసుకొస్తుంది. ఈ మిస్సైల్ హైపర్‌సోనిక్ వేగం (మాక్--5కు పైగా)తో దూసుకొచ్చే కారణంగా రాడార్ వ్యవస్థలు గుర్తించేలోపే లక్ష్యాన్ని ధ్వంసం చేస్తుంది. మొదటగా ఇది ఇజ్రాయెల్ క్షిపణి రక్షణ వ్యవస్థలను పరీక్షించేందుకు రూపొందించబడింది. అయితే ప్రస్తుతం దీనిని దాడి ఆయుధంగా కూడా వినియోగిస్తున్నట్లు భద్రతా నిపుణులు చెబుతున్నారు.

**ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ** ఈ దాడిని "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" పేరుతో అమలు చేసినట్లు సమాచారం. దాడి సమయంలో ఒకేసారి 30కి పైగా మిస్సైళ్లు ప్రయోగించబడ్డాయని విశ్లేషకులు చెబుతున్నారు. బ్లూ స్పారోతో పాటు బ్లాక్ స్పారో, రాంపేజ్ వంటి ఇతర ఆయుధాలు కూడా వినియోగించినట్లు తెలుస్తోంది. ముందుగా సైబర్ దాడుల ద్వారా ఇరాన్ కమ్యూనికేషన్ వ్యవస్థలను దెబ్బతీశారని సమాచారం. దాడి సమయంలో ఖమేనీ నివాస సముదాయంలోని భూగర్భ బంకర్‌లు కూడా ధ్వంసమైనట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ ఘటనలో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, కీలక భద్రతా అధికారులు కూడా మరణించినట్లు సమాచారం.

**ఇరాన్ రక్షణ వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయి?**

ఇరాన్ వద్ద ఉన్న ఎస్--300, బుక్ వంటి రక్షణ వ్యవస్థలు ఈ దాడిని అడ్డుకోలేకపోయాయి. ఎందుకంటే బ్లూ స్పారో మిస్సైల్ సాధారణ మార్గంలో కాకుండా అంతరిక్ష సరిహద్దు వరకు వెళ్లి అక్కడి నుంచి నిటారుగా దూసుకొస్తుంది. ఈ ట్రాజెక్టరీ కారణంగా రాడార్ వ్యవస్థలు దాన్ని సమయానికి గుర్తించలేకపోయాయని రక్షణ నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ముందస్తు దాడుల్లో ఇరాన్ రాడార్ స్టేషన్లు, కమాండ్ సెంటర్లు దెబ్బతిన్నాయని కూడా సమాచారం. దీంతో రక్షణ వ్యవస్థలు పూర్తిగా స్పందించేలోపే ప్రధాన లక్ష్యం ధ్వంసమైంది.

**మిడిల్ ఈస్ట్‌లో కొత్త ఉద్రిక్తతలు**

ఖమేనీ మరణంతో ఇరాన్‌లో రాజకీయ అస్థిరత నెలకొంది. దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాపదినాలు ప్రకటించినట్లు సమాచారం. మరోవైపు ప్రతీకార దాడులుగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్ లక్ష్యాలపై ఇరాన్ మిస్సైల్ దాడులు ప్రారంభించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఘటనతో మిడిల్ ఈస్ట్‌లో యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అంతరిక్ష సరిహద్దు నుంచి దాడి చేసే ఈ తరహా సాంకేతికత భవిష్యత్ యుద్ధాల్లో కీలక పాత్ర పోషించవచ్చని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు: సజ్జల



వైసీపీ అధినేత జగన్ ను రాజకీయంగా ఎదుర్కోలేకే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంపై కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, కెమికల్స్ కలిపారంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని సజ్జల కొట్టిపారేశారు. వైసీపీ హయాంలోనే తిరుమలలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మార్కెట్‌లో హెరిటేజ్ నెయ్యి ధర కంటే ఇందాపూర్, అమూల్ నెయ్యి ధరలు తక్కువగా ఉన్నాయని... కేవలం కొన్ని సంస్థలకు లబ్ధి చేకూర్చడానికే నెయ్యి కాంట్రాక్టుల విషయంలో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నెయ్యి కాంట్రాక్టుల వెనుక భారీ ఆర్థిక కుంభకోణం దాగి ఉందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని సజ్జల డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసి స్వామివారి సొమ్మును దోచుకోవడమే ఈ విష ప్రచారం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి సంబంధించిన వీడియోల వివాదంపై సజ్జల స్పందిస్తూ... గతంలో తమ హయాంలో సినీ నటుడు పృథ్వీపై ఆరోపణలు రాగానే తక్షణమే రాజీనామా చేయించామని, కానీ ఇప్పుడు బీఆర్ నాయుడి విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ నాయుడు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసాలపై చంద్రబాబుకు విశ్వాసం లేదనే విషయం మరోసారి అర్థమయిందని అన్నారు.

## కిట్స్ అక్షర్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**త్రిపురాంతకం (గుంటూరు) మార్చి 07 కాకతీయ:** స్థానిక యనమదల గల కిట్స్ అక్షర్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులకు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డా. పర్వతనేని నాగ శ్రీ హరిత మం డి, డి యం.కిమ్స్ శిఖర హాస్పిటల్ విచ్చేసి మహిళలు అన్ని రంగాలలో పై చెయ్ సాధించాలని మరియు మానసికంగా దృడంగా ఉండాలి అని తెలిపారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర మరియు ఎక్కడైతే గైరవించబడతారో సమాజం బాగుంటుంది అని కళాశాల చైర్మన్ డా. కోయ సుబ్బారావు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని సెక్రటరీ శ్రీ కోయి శేఖర్ పేర్కొన్నారు. విద్య ద్వారా మహిళలు మరింత శక్తివంతంగా ఎదగాలని ప్రిన్సిపాల్ డా. రామ కోటయ్య ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు నిర్వహించి మహిళల గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, సెక్రటరీ, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు ( జి ఎస్ ఆర్) మరియు ప్రిన్సిపాల్ రామ కోటయ్య మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళ సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు

## ఏరియా వైద్యశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



**కందుకూరు,మార్చి 7, కాకతీయ:** స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం వైద్యశాల సూపరెండెంట్ డాక్టర్ ఇంద్రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ ఆమె మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడడంలో ముందుండాలని సూచించారు.మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.మహిళల హక్కులు,ఆరోగ్య పరిరక్షణ, సమానత్వం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరెడ్డి, వైద్యులు రమా ప్రియ, హరిచందన,ధర్మతేజ ప్రసాదు,శ్రీకాంత్,సిబ్బందిరమణమ్మ,సుజాత,పద్మావతి,అరుణ,నర్సింగ్ సిబ్బంది తదిదరులు పాల్గొన్నారు.

## ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలు నిధి పోర్టల్ లో నమోదు చేయాలి

### ఏపి టీచర్స్ గిల్డ్ డిమాండ్

**ఉలవపాడు(ఒంగోలు)మార్చి 7, కాకతీయ:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్చి నెల నుంచి పదవి విరమణ చేయు ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలను నిధి పోర్టల్ నందు నమోదు చేయాలని ఎపి టీచర్స్ గిల్డ్ నాయకులు డిమాండ్ చేశారు.మండల విద్యాశాఖ అధికారులు వారి కార్యాలయాలలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ ద్వారా ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సంబంధించి సర్వీస్, ఫ్యామిలీ వివరాలకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని ఆన్లైన్ ద్వారా నమోదు చేసి జీవో నెంబర్ 10 ద్వారా 14.2.2026 ప్రకారం మార్చి నుంచి పదవి విరమణ పొందే ఎయిడెడ్ ఉపాధ్యాయులకు డ్రాయింగ్ ఆఫీసర్ల ద్వారా వారి వివరాలను అమరావతి ఏజీ ఆఫీస్ కు పంపాలని కోరారు.సంబంధిత జీవో ను జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు సకాలంలో పంపే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారిణి సివి రేణుక ప్రొసీడింగ్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, ప్రభాకర్ రెడ్డి లు విజ్ఞప్తి చేశారు.

## కొత్తగా ఆలోచించే వారి కోసం 'క్రియేటివ్ సిటీ': సీఎం చంద్రబాబు ప్రకటన

"విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనాత్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన 'క్రియేటివ్ సిటీ'ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరుతాయని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 'సాంకేతికత - సుపరిపాలన - భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్'గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు.

**అవకాశాల గనిగా భారత్..** ప్రపంచవ్యాప్తంగా భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని, అనేక దేశాల అభివృద్ధిలో మనవారి పాత్ర మరువలేనిదని సీఎం కొనియాడారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలను వేగంగా అందిపుచ్చుకోవడం వల్లే భారత్ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం, వనరులు ఉన్నచోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, త్వరలోనే భారత్‌కు 'రివర్స్ మైగ్రేషన్' మొదలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 60 శాతం భారత్‌లోనే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు,మార్చి 7, కాకతీయ :** మండల పరిధిలోని చిన్న ఓగూరులోని సచివాలయం నందు మీ భూమి - మీ హక్కు కార్యక్రమంలో భాగంగా 333 మంది రైతులకు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు చేతుల మీదుగా పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాసు పుస్తకాల మీద జగన్ బొమ్మ తీసేసి,రాజముద్ర తీసుకొచ్చాం అని తెలిపారు.రీ సర్వేలో వచ్చిన తప్పులన్నిటికీ జగన్ చేతగానితనమే కారణమన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను పరుగులు పెట్టిస్తూ, నాలుగైదు నెలల్లో తప్పులన్నీ సరిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు.పాస్ పుస్తకాలలోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా పొలం స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. రెవెన్యూ శాఖలో చంద్రబాబు తీసు కొచ్చిన సంస్కరణలను ప్రజలు హర్షిస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతోందన్నారు.అన్నదాత సుఖీభవ కింద రెండుసార్లు నిధులు ఇచ్చా మన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం అమ్మితే ఏడాది వరకు నగదు కోసం రైతుల ఎదురు చూసేవాళ్ళు అని కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు.48 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతులకు చేరుతున్నాయన్నారు.30 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న నేతలు కందుకూరు మండలానికి తాగునీరు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు.నేను స్వయంగా చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి, జలజీవన్ మిషన్ ద్వారా 22 కోట్లు మంజూరు చేయించానాని చెప్పారు.టెండర్లు పూర్తయి పనులు కూడా మొదలయ్యాయన్నారు.మరో ఏడాదిలో రూరల్ గ్రామాలన్నిటికీ సురక్షిత తాగునీరు అందుతుందన్నారు.సబ్ కలెక్టర్ హిమవంశీ చక్కగా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు.రెవెన్యూ అధికారులు ఆయనలాగా బాధ్యతతో పనిచేయాలన్నారు.ఓగూరు చెరువు సమస్య గురించి స్థానిక రైతులు నా దృష్టికి తీసుకువచ్చారని,చెరువుకు నీరు వచ్చే కాలువలు అన్నింటినీ బాగు చేయించి, రైతులను తప్పక ఆదుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మురళి,సర్పంచ్ కొండమ్మ, ఎంపిటిసి అల్లం సుమతి, ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోగినేని వెంకటేశ్వర్లు,నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జి.వి.ఎస్.ఎమ్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



**ఉలవపాడు,మార్చి 7, కాకతీయ:** స్థానిక జి.వి.ఎస్.ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎల్ సుధారాణి అధ్యక్షతన,ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ డి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతీ సంవత్సరం మార్చి 8 తేదీన జరుపుతారన్నారు.ఈ దినోత్సవాన్ని మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారని తెలియజేశారు. మహిళలకు గౌరవం, గుర్తింపు,రాజకీయ,సామాజిక మరియు ఆర్థిక సాధికారత ను పొందాలని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసి డి ఎస్ సూపర్వైజర్ కే కామేశ్వరి హాజరయ్యారు.ఆమె మాట్లాడుతూ మహిళలు ఉన్నత స్థాయికి చేరాలంటే సరైన పరిశుభ్రతను,మంచి పోషకాహారం ఉన్నత విద్య మరియు ఉపాధి కలిగి కుటుంబాన్ని మరియు సమాజాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు.ఈ సందర్భంగా కళాశాలలో వ్యాసరచన మరియు వకృత్వ పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్‌లో 'వైజ్ టెక్ ఇండియా పిచ్చాథాన్-2026' ఆంధ్ర ఎడిషన్ ప్రారంభం




చేబ్రోలు, కాకతీయ మార్చి-7

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని విజ్ఞాన్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (టీబీఐ) ఆధ్వర్యంలో స్టార్టప్‌లు, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించేందుకు 'వైజ్ టెక్ ఇండియా పిచ్చాథాన్-2026 రెండవ సీజన్ ఆంధ్ర ఎడిషన్' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించినట్లు వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ ఆలోచనలు కలిగిన విద్యార్థులకు తమ వినూత్న ఆలోచనలను పెట్టుబడిదారులు, మెంటర్లు మరియు నిపుణుల ముందుంచే వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు.

విజ్ఞాన్స్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో ఎస్‌పీజేఐఎంఆర్ కు చెందిన వైజ్ టెక్ బృందం సహకారంతో ఈ పిచ్చాథాన్ నిర్వహించడం విశేషమన్నారు. దేశవ్యాప్తంగా యువతలో ఉన్న సృజనాత్మక ఆలోచనలను వెలికి తీసి వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. నేటి కాలంలో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా కొత్త వ్యాపార అవకాశాలు విస్తృతంగా పెరుగుతున్నాయని, యువతలో ఉన్న ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు పిచ్చాథాన్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

ఈ పిచ్చాథాన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నలుమూలల నుండి ఎంపికైన పది స్టార్టప్‌లు తమ వ్యాపార ఆలోచనలను నిపుణుల జ్యూరీ కమిటీ ముందు ప్రెజెంటేషన్ రూపంలో వివరించాయి. జ్యూరీ సభ్యులు స్టార్టప్‌లను ఆవిష్కరణ, సాధ్యత, విస్తరణ సామర్థ్యం మరియు సమాజంపై ప్రభావం వంటి ప్రమాణాల ఆధారంగా పరిశీలించారు. ఈ పోటీలో వెట్‌డియాగ్ జీనోమిక్స్ సంస్థ మొదటి బహుమతిని సాధించి రూ.30,000 నగదు బహుమతిని అందుకుంది. ఆంజియో మెడ్‌టెక్ రెండో బహుమతిగా రూ.20,000 గెలుచుకోగా, గ్రాసిప్ మూడో బహుమతిగా రూ.10,000 నగదు బహుమతిని అందుకుంది. విజేతలైన ఈ స్టార్టప్‌లు జాతీయ స్థాయిలో జరిగే తదుపరి దశకు ఎంపికై రూ.5 లక్షల బహుమతితో పాటు పెట్టుబడిదారుల నుండి నిధులు పొందే అవకాశాల కోసం పోటీ పడనున్నాయి. అలాగే వీరికి ప్రత్యేక యాక్సిలరేషన్ బూట్‌క్యాంప్‌లో పాల్గొనే అవకాశాన్ని కూడా కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌పీజేఐఎంఆర్ చెందిన డాక్టర్ సిద్ధార్థ్ జైన్ వ్యాపార నమూనా అభివృద్ధిపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. స్థిరమైన మరియు విస్తరించగలిగే వ్యాపార సంస్థలను ఎలా నిర్మించాలనే అంశంపై ఆయన విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ టీబీఐ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ దిరిశాల విజయరాము, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, స్టార్టప్ మెంటర్లు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు మరియు స్టార్టప్ రంగానికి చెందిన పలువురు నిపుణులు పాల్గొన్నారు. యువతలో పారిశ్రామిక భావన పెంపొందించి, కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇవ్వడంలో ఈ కార్యక్రమం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

# ఇతరులను ప్రేరేపించే శక్తి కలిగి ఉండాలి

- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ రిచా వర్మ
- విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

చేబ్రోలు, కాకతీయ మార్చి-7



నాయకత్వం అనేది కేవలం పదవులు పొందడం మాత్రమే కాకుండా బాధ్యత, విలువలు, నిర్ణయ సామర్థ్యం మరియు ఇతరులను ప్రేరేపించే శక్తి కలిగి ఉండడమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ రిచా వర్మ వివరించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది మహిళా దినోత్సవ వేడుకలను "గివ్ ఫర్ గెయిన్ - బలమైన, సమగ్ర భవిష్యత్తు కోసం మహిళల సాధికారత" అనే ఇతివృత్తంతో నిర్వహించారు. మహిళల విద్య, భద్రత, నాయకత్వ సామర్థ్యం, సంక్షేమం వంటి అంశాల్లో పెట్టుబడి పెట్టినప్పుడు సమాజం మొత్తం పురోగతి, అభివృద్ధి మరియు సౌభాగ్యాన్ని పొందుతుందని ఈ ఇతివృత్తం సారాంశమని తెలిపారు. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనమందరం కలిసి "సహాయం ఇవ్వాలి, గౌరవం ఇవ్వాలి, అవకాశాలు కల్పించాలి - అప్పుడు సమాజం బలపడుతుంది, జ్ఞానం పెరుగుతుంది, అభివృద్ధి సాధ్యమవుతుంది" అనే సంకల్పాన్ని చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ రిచా వర్మ మాట్లాడుతూ విద్యాసంస్థలు యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినులు తమ సామర్థ్యాలను గుర్తించి ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో మహిళలు ఎన్నో ప్రతిభలు, సామర్థ్యాలు కలిగి ఉన్నప్పటికీ నాయకత్వ స్థానాల్లో వారి ప్రాతినిధ్యం ఇంకా తక్కువగా ఉందని పేర్కొన్నారు. సామాజిక ఆంక్షలు, పాత పద్ధతి ఆలోచనలు, అవకాశాల లోపం వంటి అనేక అడ్డంకులు మహిళలు ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని అధిగమిస్తూ నేటి మహిళలు వివిధ రంగాల్లో అగ్రస్థానాలను చేరుకుంటున్నారని తెలిపారు. విద్య, ఆత్మవిశ్వాసం, పట్టుదల మహిళలను నాయకత్వ స్థానాలకు తీసుకెళ్లే ప్రధాన శక్తులని ఆమె పేర్కొన్నారు. మహిళలు నాయకత్వ బాధ్యతలు చేపట్టినప్పుడు సంస్థల్లో సృజనాత్మకత, సమానత్వం మరియు సహకార భావన పెరుగుతుందని ఆమె వివరించారు. మహిళల దృక్పథం సమస్యలను పరిష్కరించే విధానంలో కొత్త ఆలోచనలను తీసుకువస్తుందని తెలిపారు. అందువల్ల సంస్థలు మరియు సమాజం మహిళలకు నాయకత్వ అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన తెనాలిలోని హెల్త్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ జ్యోత్స్న వినుకొండ మాట్లాడుతూ సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళలు విద్య, వ్యాపారం, సాంకేతిక రంగం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. యువతులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ధేశించుకుని కష్టపడి పని చేస్తే ఏ అడ్డంకినైనా అధిగమించగలరని అన్నారు. సమాజంలో మహిళలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె తెలిపారు. కుటుంబాలు, విద్యాసంస్థలు మరియు సంస్థలు కలిసి మహిళల ప్రతిభను ప్రోత్సహించినప్పుడు సమాజం మరింత బలపడుతుందని చెప్పారు. మహిళల సాధికారత కేవలం మహిళలకే కాకుండా మొత్తం సమాజానికి ప్రయోజనం చేకూర్చే అంశమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్ కొర్రపాటి వాణిశ్రీ మాట్లాడుతూ మహిళల జీవితంలో పంచుకోవడం, సహనం, రాజీ పడటం, పరిస్థితులకు అనుగుణంగా మెలగడం వంటి విలువలు ఎంతో ముఖ్యమని తెలిపారు. కుటుంబం మరియు సమాజంలో సమతుల్యతను నిలబెట్టడంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని అలాగే మహిళలు తమలో ఉన్న జ్ఞానం, సాధికారత, ఆత్మవిశ్వాసం, బలం, ధైర్యం మరియు కట్టుబాటు వంటి లక్షణాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసుకుంటే ఏ రంగంలోనైనా విజయాలను సాధించగలరని పేర్కొన్నారు. మహిళలు తమ ప్రతిభను నమ్ముకుని ముందుకు సాగాలని, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం కలిగి ఉండాలని సూచించారు. కుటుంబం, విద్యాసంస్థలు మరియు సమాజం కలిసి మహిళలకు ప్రోత్సాహం అందించినప్పుడు వారు మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. మహిళల సాధికారత సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని ఆమె అభిప్రాయపడ్డారు. ధైర్యం, ఆత్మవిశ్వాసం, కృషి మరియు నైతిక విలువలతో ముందుకు సాగితే మహిళలు నాయకత్వంలో మరింత విజయాలను సాధించగలరని పేర్కొన్నారు. మహిళలు అడ్డంకులను అధిగమిస్తూ భవిష్యత్తును నిర్మించే శక్తిగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన అధ్యాపకులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో జాయింట్ డైరెక్టర్, సైంటిస్ట్ ఎఫ్ -- అనిత పూరి మోహింద్ర, పద్మశ్రీ, నారి శక్తి అవార్డీ, ప్రజ్వల ఫౌండర్ డాక్టర్ సునీత క్రిష్ణన్, విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

### 53 మందికి 31.73 లక్షలు పంపిణీ





**కందుకూరు,మార్చి 7, కాకతీయ:** ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే చంద్రబాబు ఆకాంక్ష అని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు.మొత్తం 53 మందికి 31.73 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తుంటే,వైసీపీ నేతలు పనికి మాలిన విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అవినీతి పరులు, దొంగలను పక్కన ఉంచుకున్నారు కాబట్టే, గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారని,ఆ పార్టీ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి ఇటీవల ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడారని ఎమ్మెల్యే అన్నారు.ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా ఇంకా బుద్ధి రాలేదన్నారు.ఇప్పటికీ రప్పా రప్పా అంటూ వెర్రి వేషాలు వేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు.గత ఎన్నికల్లో దారుణ ఓటమి పట్ల జగన్మోహన్ రెడ్డి పశ్చాత్తాపం ప్రకటించి,తప్పులు సరిదిద్దుకోవాల్సింది పోయి, రోజు రోజుకూ మరింత దిగజారిపోతున్నారని నాగేశ్వరరావు విమర్శించారు.కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ఎక్కువగా నిధులు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.అనారోగ్య ఖర్చులు,పేదవారికి ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు.దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి చెక్కులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం ద్వారా సహాయం అందుకున్న ప్రతి ఒక్కరూ, కూటమి ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా గుడ్లూరు మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు 9.38 లక్షల రూపాయలు,కందుకూరు మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు 5.29 లక్షల రూపాయలు,కందుకూరు పట్టణానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు 5.57 లక్షల రూపాయలు,ఉలవపాడు మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు 6.87 లక్షల రూపాయలు,వలేటివారిపాలెం మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు 4.60 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు,కందుకూరు రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, నాదెళ్ల వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## టి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**కందుకూరు,మార్చి 7, కాకతీయ:** టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు శనివారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ మాట్లాడుతూ టి ఆర్ ఆర్ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న ఎందరో మహిళలు అత్యున్నత స్థానాల్లో సేవలు అందిస్తున్నారని అన్నారు.ఉన్నత పదవులను సాధించి ఎన్నో రంగాలలో రాణిస్తున్నారన్నారు.ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియజేశారు.టి ఆర్ ఆర్ కళాశాలలో విద్యనభ్యసించిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ,బెంగళూరు నందు పనిచేస్తున్న ప్రొఫెసర్ గాలి మాధవి లత, చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన నిర్మించడంలో 17 సంవత్సరాల పాటు శ్రమించారని,వంతెన నిర్మాణంలో కీలక పాత్ర వహించిన ఘనత ఆమెది అని తెలిపారు.ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కందుకూరు మునిసిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష గారు మాట్లాడుతూ మహిళల పరిస్థితులు ఇంకా ఎన్నో విషయాల్లో మెరుగుపడవలసి ఉందన్నారు.మనం ఇంక ముందు మహిళా దినోత్సవాలు కాకుండా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి వచ్చి మహిళా సాధికారత వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.కళాశాల ఆంగ్ల అధ్యాపకులు మరియు ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాజగోపాల్ బాబు మాట్లాడుతూ వాలెంటీనా తెరిష్కోవా,మేడం క్యూరీ, ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి వంటి స్త్రీలను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందుకు నడవాలని ఉద్ఘాటించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు మరియు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ అయిన డాక్టర్ కె.వి. పద్మావతి మాట్లాడుతూ స్త్రీ,పురుష సమానత్వం ఇంటి నుండే మొదలవ్వాలని తెలియజేశారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ కొమ్మనబోయిన సుజాత మాట్లాడుతూ ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది అని గురజాడ వారన్న మాటను నిజం చేస్తూ స్త్రీల పరిస్థితులు కొంతవరకు మెరుగుపడినప్పటికిని ఇంకా ఎన్నో విషయాల్లో మార్పులు రావాల్సి ఉందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర ఏడుకొండలు,అకెడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వి.శ్రీహరి తదితర అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే తయారు చేయబడిన బొమ్మలను, హస్తకళాకృతులను ఎగ్జిబిషన్ గా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రదర్శనను ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ శ కొర్రపాటి అనూష ,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు తిలకించారు.ఈ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సాధికారత విభాగానికి షేక్ షానాజ్ బేగం మహిళా సాధికారత విభాగమని పేరు పెట్టడం జరిగింది.కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా సేవలందించిన షేక్ షానాజ్ బేగం 2025 ఆగస్టులో స్వర్గస్తులైనారు.

## ఇరాన్‌కు భారీ విజయం... అమెరికా 'థాడ్' క్షిపణి రక్షణ వ్యవస్థ ధ్వంసం


ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం రోజురోజుకీ తీవ్ర రూపం దాల్చుతోంది. ఈ ఉద్రిక్తతల నడుమ అమెరికాకు ఊహించని షాక్ తగిలింది. జోర్డాన్‌లో మోహరించిన అమెరికాకు చెందిన అత్యంత విలువైన మిసైల్ డిఫెన్స్ రాడార్ సిస్టమ్‌ను ఇరాన్ విజయవంతంగా ధ్వంసం చేసినట్లు వెల్లడైంది. జోర్డాన్‌లోని మువాఫ్ఫక్ సల్టి ఎయిర్ బేస్‌లో ఉన్న ఏఎన్/టీపీవై-2 రాడార్‌ను ఇరాన్ క్షిపణులు పూర్తిగా నాశనం చేశాయని వాణిజ్య శాటిలైట్ చిత్రాల ద్వారా బయటపడింది. సుమారు 300 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.2,500 కోట్లు) విలువైన ఈ రాడార్, అమెరికా 'థాడ్' (ఒనారాాణ) మిసైల్ డిఫెన్స్ సిస్టమ్‌లో అత్యంత కీలక భాగం. బాలిస్టిక్ క్షిపణులను ఎత్తులోనే గుర్తించి, వాటిని కూల్చివేయడానికి ఇది ఉపయోగపడుతుంది. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలోనే ఈ దాడి జరిగిందని అమెరికా అధికారులు కూడా ధృవీకరించారు. ఖరీదైన ఈ రాడార్ ధ్వంసం కావడంతో గల్ఫ్ ప్రాంతంలో అమెరికా, మిత్రదేశాల రక్షణ వలయంపై తీవ్ర ఒత్తిడి పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామంపై ఎఫ్‌డీడీ డిప్యూటీ డైరెక్టర్ ర్యాన్ బ్రాబ్స్ మాట్లాడుతూ.. "థాడ్ రాడార్‌పై దాడి ఇరాన్‌కు ఇప్పటివరకు లభించిన అతిపెద్ద విజయం" అని అభిప్రాయపడ్డారు. మరోవైపు, సీఎస్ఐఎస్ నిపుణుడు టామ్ కారకో స్పందిస్తూ.. అమెరికా ఆర్మీ వద్ద ఇలాంటి రాడార్లు కేవలం 8 మాత్రమే ఉన్నాయని, స్పేర్ రాడార్లు లేకపోవడంతో ఇది వ్యూహాత్మకంగా పెద్ద దెబ్బ అని విశ్లేషించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన పెంటాగాన్, వెంటనే ఆయుధాల ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు రక్షణ రంగ సంస్థలతో చర్చలు మొదలుపెట్టింది. ఇప్పటికే ఖతార్‌లోని మరో రాడార్ కూడా దెబ్బతిన్నట్లు వార్తలు వస్తుండటంతో అగ్రరాజ్యం అప్రమత్తమైంది.

## ఉత్తరాఖండ్ వరదలు.. ఇస్రో కీలక రిపోర్ట్



గతేడాది ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీలో సంభవించిన వరదలపై ఇస్రో కీలక నివేదిక ఇచ్చింది. ఈ ఆకస్మిక వరదలకు కారణం క్లౌడ్ బరస్ట్ కాదని తెలిపింది. ఆపై ప్రాంతంలో ఉన్న మంచుపర్వతం కరగడం వల్లే ఈ వరదలు సంభవించాయని పేర్కొంది. 2025 ఆగస్టులో ఉత్తరకాశీలోని ధారాలి ప్రాంతంలో ఆకస్మికంగా వరదలు సంభవించాయి. ఉన్నట్టుండి పెద్దఎత్తున వరదలు రావడంతో ఆ ప్రాంతమంతా మునిగిపోయింది. చాలా భవనాలు, వ్యాపార సముదాయాలు నీట మునిగాయి. అయితే దీనికి కారణం క్లౌడ్ బరస్ట్ లేదా నదులు ఉప్పొంగడం అని అంతా భావించారు. అయితే దీనిపై పరిశోధన జరిపిన ఇస్రో దీని కారణం క్లౌడ్ బరస్ట్ కాదని తేల్చింది. దీనికి సంబంధించిన ఉపగ్రహ చిత్రాలు పరిశీలించిన శాస్త్రవేత్తలు ఆసమయంలో ఆ ప్రాంతంలో ఎటువంటి వర్షాలు పడలేదని గుర్తించారు. అదే విధంగా ఆ పై భాగంలోని పర్వతాలలో ఎటువంటి నదులు లేవని ఇస్రో తేల్చింది. ఆ ప్రాంతానికి 5200 అడుగుల ఎత్తుల పర్వతాలలో మంచు పర్వతం కరగడం మూలంగానే ఆకస్మిక వరదలు సంభవించినట్లు తెలిపారు. సాధారణంగా ఈ మంచు పర్వతా లకు రక్షణగా ఉండే పొరలు గ్లోబల్ వార్మింగ్ మూలంగా కరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాలుష్య పరిస్థితుల దృష్ట్యా తరచు గా ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కనుక ఆ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

## పాకిస్తాన్‌లో పేలిన 'పెట్రో' ధరల బాంబు



ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్‌లో పెట్రో ధరల బాంబు పేలింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ సరఫరా చైన్‌లో తలెత్తిన ఆటంకాల నేపథ్యంలో పాకిస్తాన్ పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ శనివారం అర్ధరాత్రి కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ ధరలను లీటరుకు ఏకంగా 55 రూపాయల చొప్పున పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేశ చరిత్రలో ఇంతటి భారీ స్థాయిలో ధరలు పెరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

తాజా పెంపుతో పాకిస్తాన్‌లో పెట్రోల్ ధర లీటరుకు రూ. 266.17 నుంచి రూ. 321.17కు చేరింది. అంటే దాదాపు 17 శాతం మేరకు పెరిగింది. ఇక రవాణా రంగానికి కీలకమైన హైస్పీడ్ డీజిల్ ధర లీటరుకు రూ. 280.86 నుంచి ఏకంగా రూ. 335.86కు (20 శాతం పెంపు) ఎగబాకింది. పెరిగిన ఈ ధరలు తక్షణమే అమలులోకి వస్తాయని అధికారులు తెలిపారు. పెట్రోలియం శాఖ మంత్రి అలీ పర్వైజ్ మాలిక్, ఆర్థిక మంత్రి ముహమ్మద్ ఔరంగజేబుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.

అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతిచర్యగా ఇరాన్ జరిపిన ప్రతీకార దాడుల వల్ల గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి నెలకొందని వారు పేర్కొన్నారు. 'పొరుగు దేశంలో రాజుకున్న నిప్పు ఇప్పుడు ఆ ప్రాంతమంతా వ్యాపించింది. ఈ సంక్షోభం ఇంకా ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం' అని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న తీవ్ర హెచ్చుతగ్గుల దృష్ట్యా, ఇకపై ప్రతి వారం పెట్రో ధరలను సమీక్షించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. కాగా పాకిస్తాన్‌కు వచ్చే చమురు రవాణాలో అధిక భాగం 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' జలసంధి గుండానే జరుగుతుంటుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల ఈ మార్గంలో సరఫరా నిలిచి పోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో చమురు నౌకలను రప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

## ఓటర్ల తొలగింపును నిరసిస్తూ సీఎం మమత ధర్నా



కోల్‌కతా: ఓటరు జాబితా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)తో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం టీఎంసీ అధినేత్రి, పశ్?చమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సెంట్రల్ కోల్‌కతాలో ధర్నాకు పూనుకున్నారు. ఏప్రిల్‌లో జరగనున్న కీలకమైన ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా వివాదాన్ని టీఎంసీ ప్రచారంలో ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోనున్నట్లు ఆమె సంకేతాలిచ్చారు.

రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఎస్‌ప్లానెడ్ ప్రాంతంలోని మెట్రో చానల్ వద్ద మమత మధ్యాహ్నం 2.15 గంటలకు ధర్నా ప్రారంభించారు. బీజేపీ, ఈసీలు కలిసి బెంగాలీ ఓటర్ల పేర్లను తొలగించాలని కుట్ర పన్నాయన్నారు. ఈ కుట్రను తాను బయటపెడతానని ఆమె ప్రకటించారు. ఇటీవల ప్రకటించిన జాబితాలో బతికున్న వారిని కూడా చనిపోయిన వారి కిందకి చేర్చారని ఆరోపించారు. అలాంటి వారిని ధర్నా వేదికపైకి తీసుకొచ్చిన, ఈసీ పాల్పడిన అవకతవకలను బయటపెడతామన్నారు.

ఇదే అంశంపై మరికొన్ని వివరాలను బయట పెడతామన్నారు. బీజేపీ, ఈసీలోని ఆ పార్టీ ఏజెంట్లు బరి తెగించారని, వారికి ఏమాత్రం సిగ్గు లేదంటూ తిట్టిపోశారు. ఇటీవల ఈసీ వెల్లడించిన తుది ఓటరు జాబితాలో 63.66 లక్షల పేర్లను, అంటే మొత్తం ఓటర్లలో 8.3 శాతం మందిని తొలగించడం తెల్సిందే. మరో 60 లక్షల పేర్లను న్యాయపరమైన పరిశీలన కోసం ఉంచారు. త్వరలో న్యాయాధికారులు వీటిని పరిశీలించి, తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇవన్నీ ఎన్నికల సమీకరణాలను తీవ్రంగా ప్రభావితం చేయనుండగా మమత పోరాటానికి దిగారు. అయితే, ధర్నా ఎన్ని రోజులు కొనసాగనుందనే విషయాన్ని మమత వెల్లడించలేదు.

# ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ

- మార్చి 9 నుంచి గుంటూరులో ఎంపికలు
- తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు అవకాశం



గుంటూరు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మహిళా, పురుష అభ్యర్థులకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ ర్యాలీ మార్చి 9వ తేదీ నుండి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ పరిశీలించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అర్హత కలిగిన అభ్యర్థులకు ఇది మంచి అవకాశమని అధికారులు తెలిపారు. ఎలాంటి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అవసరం లేకుండా అర్హత కలిగిన వారు నేరుగా ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి హాజరై ఎంపిక ప్రక్రియలో పాల్గొనవచ్చని వివరించారు. వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించనున్నారు.

మార్చి 9, 10 తేదీల్లో మహిళా అభ్యర్థులకు, మార్చి 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పురుష అభ్యర్థులకు, మార్చి 15, 16 తేదీల్లో తెలంగాణకు చెందిన పురుష అభ్యర్థులకు రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలోనే ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

2005 జూలై 2 నుండి 2009 జనవరి 2 మధ్య జన్మించిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు ఈ ర్యాలీకి అర్హులని తెలిపారు. కనీస ఎత్తు 152 సెంటీమీటర్లు ఉండాలి. విద్యార్హతగా ఇంటర్మీడియట్ (10o2) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. లేదా మూడు సంవత్సరాల డిప్లొమా ఇంజనీరింగ్ లేదా రెండు సంవత్సరాల ఒకేషనల్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. మొత్తం మార్కుల్లో 50 శాతం, ఇంగ్లీషులో 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.

అభ్యర్థులు తమతో పాటు 10వ, 12వ తరగతి సర్టిఫికెట్లు (ఒరిజినల్ లేదా డిజిలాకర్ ధృవీకరణ), నివాస ధృవీకరణ పత్రం, ఎన్‌సీసీ సర్టిఫికెట్ (ఉంటే), ఆధార్ కార్డు, ఈమెయిల్ ఐడి, మొబైల్ నంబర్, ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటోలు 10, అలాగే ప్రతి సర్టిఫికెట్‌కు సంబంధించిన ఆరు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మహిళా అభ్యర్థులు మార్చి 9వ తేదీన, ఆంధ్రప్రదేశ్ పురుష అభ్యర్థులు మార్చి 12వ తేదీన, తెలంగాణ పురుష అభ్యర్థులు మార్చి 15వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో హాజరు కావాలని అధికారులు కోరారు.

అభ్యర్థులకు మొదట 1.6 కిలోమీటర్ల పరుగు, భౌతిక మరియు శారీరక పరీక్షలు నిర్వహిస్తారు. వాటిలో ఉత్తీర్ణులైన వారికి రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్ష ప్రశ్నాపత్రం ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉంటుందని, ప్రతి తప్పు జవాబుకు పావు మార్కు తగ్గింపు విధానం అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.

# జాంబవంతుడి శోభ.. అజ'రామ'రం



**రాజంపేట:** ఆంధ్రా అయోధ్యగా వెలుగొందుతున్న అన్నమయ్య జిల్లాలోని ఏకశిలానగరం (ఒంటిమిట్ట)లో 108 అడుగుల జాంబ వంతుడి విగ్రహం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. రామాలయం అత్యంత సమీపంలో ఉన్న ఒంటిమిట్ట చెరువులో ఏర్పాటు చేసేందుకు టీటీడీ తన మాస్టర్‌ప్లాన్‌లో తీసుకువచ్చింది.

పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి లో 600 జయంత్యుత్సవాల సందర్భంగా 108 అడుగుల అన్నమ య్య విగ్రహం రాజంపేటకే ల్యాండ్‌మార్క్‌గా మారింది. అదే తరహాలో ఏకశిలానగరంలోని చెరువులో జాంబవంతుడి విగ్రహం ఏర్పాటు చేస్తే.. అదే భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారనున్నది. ఇప్పటికే దాశరథి కల్యాణ మండపం సమీపంలో నామమాత్రంగా జాంబవుంతుడి విగ్రహం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

**చెరువులోనే ఎందుకు?**

పురాణ, ఇతిహాసాల చరిత్ర ఆధారంగా ఒంటమిట్ట వద్ద జాంబవంతుడి విగ్రహం ఏర్పాటుకు టీటీడీ సన్నాహాలు ప్రారంభించింది. రామాయణం, భాగవతం కథనాల ప్రకారం జాంబవంతుడు.. బ్రహ్మదేవుడి ఆవలింత నుంచి పుట్టిన యోధుడు భల్లూకరాజుగా గుర్తింపు ఉంది. రామాయణంలో కూడా శ్రీరాముడితో కలిసి లంక యుద్ధంలో పోరాడిన జాంబవంతుడు శక్తియుక్తులు చాటారు. హనుమంతుడి శక్తిని గుర్తు చేసి, సీతాదేవిని వెతకడానికి ప్రేరేపించిన మహాబలశాలి మాత్రమే కాకుండా, వివేకవంతుడని ప్రస్తావించారు.

శ్రీ కృష్ణుడికి శమంతకమణి ఇవ్వడంతోపాటు తన కుమార్తె జాంబవంతిని కూడా ఇచ్చి వివాహం చేశాడట. కృతయుగం నుంచి ద్వాపరయుగం వరకు జీవించినట్లు చరిత్ర చెబుతోంది. పురాణాల ప్రకారం ఈ ఏకశిల విగ్రహాలను జాంబవంతుడు ప్రతిష్ఠించారని ఒక కథనం. అందుకే ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడి కోవెలకు ల్యాడ్‌మార్క్‌గా జాంబవంతుడి 108 అడుగుల విగ్రహం నిలవనున్నదనే భక్తుల మనోగతం.

**50 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని...**

రాష్ట్ర ప్రభుత్వం శ్రీరామనవమిని అధికారిక పండుగగా నిర్వహించే ఏకశిలానగరం ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధిపై తిరుమల తిరుపతి దేవస్థానం దృష్టి కేంద్రీకృతం చేసింది. 50 ఏళ్లను లక్ష్యంగా చేసుకుని అభివృద్ధి దిశగా టీటీడీ అడుగులు వేస్తోంది. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆ దిశగా మాస్టర్‌ప్లాన్ తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**మ్యూజియం:** భక్తుల కోసం కల్యాణ కట్ట, పుష్కరిణి, నక్షత్రవనాలు, గార్డెనింగ్, పచ్చదనం, ఆధ్యాత్మిక చిహ్నాలు, శ్రీ కోదండరామస్వామి ప్రాశస్త్యం నవతరానికి అందించేలా మ్యూజియం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉద్యానవనాలు, సాంకేతికతను జోడించి డిజిటల్ స్క్రీన్స్, హనుమంతుడి సేవానిరతి, సాంస్కృతిక కళామందిరం,తోరణాలు ఏర్పాటు చేయనున్నారు.

**పెరుగుతున్న యాత్రికుల అంచనాతో..** పెరిగే యాత్రికుల సంఖ్యను అంచనా వేసి, ఆలయ పరిసరాలు ఎలా ఉండాలి, భక్తులకు సరిపడేలా సదుపాయాలు, వసతి రవాణా, చారిత్రక నేపథ్యం ఉట్టిపడేలా, ఆధ్యాత్మిక, మరింతగా భక్తులు వచ్చేలా ముందస్తు ప్రణాళిక ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు అందాయి. నిత్యఅన్నదాన పథకం అమలు చేయడానికి వీలుగా అన్నదానసత్రం, వసతుల కోసం రూ.4.35 కోట్లు ఇప్పటికే మంజూరు చేశారు.

**ఆధ్యాత్మిక క్షేత్రంగా..** ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లనున్నది. కడప-తిరుపతి మార్గంలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలవనున్నది. ఒంటిమిట్ట చెరువు జాతీయ రహదారి పక్కనే రామాలయం ఉంది. రహదారి మరో పక్క జిల్లాలోనే అతిపెద్ద చెరువు ఉంది. 2014లో రాష్ట్ర విభజనం అనంతరం శ్రీ కోదండరామాలయం ప్రభుత్వ అధికారిక రామాలయంగా మారింది. శ్రీరామనవమి ఉత్సవాలలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకురావడం సంప్రదాయంగా పాటిస్తున్నారు.

**ప్రణాళికలో..** మాడవీధులు, రథశాల, పుష్కరిణి, సంజీవరాయస్వామి ఆలయం, మాలఓబన్న స్థూపం, శృంగిశైలం, సత్రపాళెం, కొండ, రామలక్ష్మణ తీర్థాలు, కల్యాణ వేదిక ప్రాంతాల అభివృద్ధి, సుందరీకరణకు ప్రణాళిక రూపొందించారు. ఆగస్టు 23న ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అనిల్‌కుమార్ బృందం ఒంటిమిట్టను పరిశీలించిన సంగతి విదితమే.

**అభివృద్ధికి విశేష కృషి :** ఏకశిలానగరాభివృద్ధిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మార్క్ బాగా కనిపిస్తుందని రామభక్తుల మనోగతం. రాష్ట్ర విభజన తర్వాత ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం అధికారిక రామాలయంగా ప్రకటించారు. టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ తొలినాళ్లలో రూ.100 కోట్లతో మాస్టర్‌ప్లాన్‌తో రామాలయం అభివృద్ధికి టీటీడీ తరఫున అడుగులు వేశారు. ఆనాటి మాస్టర్‌ప్లాన్‌తో ఇప్పటి రామాలయం శోభ సాక్షాత్కరిస్తుంది.

మళ్లీ ఆయనే టీటీడీ ఈవోగా రావడంతో 50 ఏళ్లను ముందుగానే దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేసేలా పాలకమండలి సహకారంతో నిర్ణయాలు టీటీడీ తీసుకునేలా, అధికారులను సమాయత్తం చేశారు. ఇప్పుడు ఒంటిమిట్ట చెరువులో 108 అడుగుల జాంబవంతుడివిగ్రహం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవడానికి ఈవో కారకులయ్యారని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ట్రావెలింగ్ నుంచి హోస్టింగ్ వరకూ..

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారతీయ మహిళల ప్రయాణ తీరుతెన్నులు, ఆతిథ్య రంగంలో వారి ఎదుగుదలపై ప్రముఖ గ్లోబల్ ట్రావెల్ ప్లాట్‌ఫారమ్ 'ఏర్‌బీఎన్‌బీ' ఆసక్తికరమైన గణాంకాలను విడుదల చేసింది. దేశీయ పర్యాటక ఆర్థిక వ్యవస్థను మహిళలు ఏ విధంగా ప్రభావితం చేస్తున్నారో ఈ నివేదిక స్పష్టం వెల్లడించింది.**

భారతదేశంలో ఏర్‌బీఎన్‌బీ వేదికగా హోస్టింగ్ చేస్తున్న వారిలో దాదాపు 30 శాతం మంది మహిళలే ఉండటం గమనార్హం. పర్యాటకులు అత్యధికంగా ఇష్టపడే 'గెస్ట్ ఫేవరెట్' విభాగంలోని స్టేయింగ్ ఆప్షన్లలో 35 శాతం మహిళా హోస్ట్‌ల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. ఇది వారి నిర్వహణ దక్షతకు, అతిథులకు వారు అందిస్తున్న అద్భుతమైన అనుభూతులకు నిదర్శనం. డిజిటల్ విప్లవం పుణ్యమా అని ఇంటి వద్దే ఉంటూ ఆదాయాన్ని గడించే అవకాశాలను మహిళలు అందిపుచ్చుకుంటున్నారు. 2024 ఏడాదిలో భారతీయ మహిళా హోస్ట్‌లు ఏర్‌బీఎన్‌బీ ద్వారా సుమారు రూ.260 కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించారు. స్థానిక సంస్కృతిని, సంప్రదాయ వంటకాలను పర్యాటకులకు పరిచయం చేస్తూ, వారు తమ ఇళ్లను చిన్నపాటి వ్యాపార కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు.

భారతీయ మహిళలు ఇప్పుడు ప్రయాణాల విషయంలో మరింత ధైర్యంగా, స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. ఒక తోడుతో కలిసి ప్రయాణించడం ప్రస్తుతం మహిళల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ట్రెండ్. దీని తర్వాత చిన్న చిన్న బృందాలుగా వెళ్లడానికి మొగ్గు చూపుతున్నారు. దేశీయంగా ఉత్తర గోవా, బెంగళూరు, గురుగ్రామ్, దక్షిణ గోవా, పూతణె నగరాల కోసం పర్యాటకులు ఎక్కువగా ఆన్‌లైన్లో వెతుకుతున్నారు. అంతర్జాతీయంగా దుబాయ్, లండన్, బ్యాంకాక్, పారిస్, రోమ్ నగరాలు అగ్రస్థానంలో ఉన్నాయి.

కేవలం పర్యాటక ప్రాంతాలే కాకుండా మధుర, దక్షిణ కన్నడ వంటి



ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాలపై మహిళల్లో మరింతగా ఆసక్తి పెరుగుతోంది. అంతర్జాతీయంగా జార్జియాలోని 'కాజ్బెగి' వంటి మారుమూల పర్వత ప్రాంతాలను సందర్శించే వారి సంఖ్య పెరగడం విశేషం. ఒకప్పుడు కుటుంబ యాత్రల నిర్ణయాలు పురుషులకే పరిమితమయ్యేవి. కానీ ఇప్పుడు సీన్ మారింది. బడ్జెట్ కేటాయింపులు, గమ్యస్థానాల ఎంపిక, భద్రతా ప్రమాణాల పరిశీలన వంటి విషయాల్లో మహిళలే కీలక నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో రివ్యూలు చదవడం, మొబైల్ యాప్‌ల ద్వారా శోధించి మరీ వారు పర్యటనలను ప్లాన్ చేస్తున్నారు. మొత్తంగా చూస్తే, భారతీయ పర్యాటక రంగం ఇప్పుడు పురుషస్వామ్య ధోరణి నుంచి బయటపడి సమ్మిళిత వృద్ధి వైపు పయనిస్తోంది.

# భారత్‌కు ఇంధన సవాలు

అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో పెరుగుతున్న యుద్ధ వాతావరణం భారతదేశ ఇంధన భద్రతకు పెను సవాలుగా మారాయని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా పేర్కొన్నారు. ఇజ్రాయెల్-అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా కూడా పనిచేస్తున్న ఆయన భారత ఆర్థిక గమనం, రాష్ట్రాల పురోగతిపై తన విశ్లేషణను పంచుకున్నారు.

అంచనాలను మించి ఆర్థిక వృద్ధి : ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోందని పనగారియా స్పష్టం చేశారు. '2025-26తో ముగిసిన మూడేళ్ల కాలంలో భారత వాస్తవ జీడీపీ సగటున 7.3 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఉత్పాదక రంగం ఏకంగా 11.2 శాతం సగటు వృద్ధితో దూసుకుపోతోంది. ఇది పారిశ్రామికాభివృద్ధిలో ఒక సానుకూల సంకేతం' అని ఆయన విశ్లేషించారు.

అమెరికా వాణిజ్య విధానాల వల్ల ఎదురయ్యే సవాళ్లను భారత్ చాకచక్యంగా అవకాశాలుగా మలుచుకుందని ప్రశంసించారు. ఇటీవల కొన్ని దేశాలతో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వాణిజ్య పరిధి పెరుగుతుందన్నారు.

తక్షణమే దృష్టి సారించాల్సిన అంశాలు :

- దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాల్సిన ప్రధానాంశాలను పనగారియా సూచించారు.
- దిగుమతి సుంకాలు, నాణ్యత నియంత్రణ ఉత్తర్వులను హేతుబద్ధీకరించడం.
- 1956 నాటి యూజీసీ చట్టం స్థానంలో పార్లమెంటు పరిశీలనలో ఉన్న కొత్త చట్టాన్ని తీసుకురావడం.
- 2013 నాటి ఎల్ఏఆర్ఆర్ చట్టాన్ని సవరించి భూసేకరణ ప్రక్రియలో ఉన్న అడ్డంకులను తొలగించడం.

**రాష్ట్రాలకు సూచనలు :** 'విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కమ్) నష్టాల వల్ల రాష్ట్రాల ఖజానా ఖాళీ అవుతోంది. రాబోయే 5-7 ఏళ్లలో వీటిని క్రమ పద్ధతిలో ప్రైవేటీకరించాలి. కార్మిక సంస్కరణల్లో భాగంగా పారిశ్రామిక సంబంధాలు, వృత్తిపరమైన భద్రత వంటి అంశాల్లో సరళీకృత విధానాలను అవలంబించాలి. పట్టణ భూ విపణిని వ్యాపార అనుకూలంగా మార్చడంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వచ్చే వారికి అనువైన వాతావరణం కల్పించాలి. భారతదేశం తన యువ శక్తిని, విస్తారమైన నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటే ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారుతుంది' అని అరవింద్ పనగారియా ఆశాభావం వ్యక్తం చేశారు.

## మరో ఇరాన్ నౌకకు భారత్ ఆశ్రయం

న్యూఢిల్లీ: ఇరాన్ నావికా దళానికి చెందిన ఒక యుద్ధ నౌకకు భారత్ అత్యవసర ఆశ్రయం కల్పించిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఐఆర్ఐఎస్ లవాన్ నౌకలో సాంకేతిక సమస్య ఏర్పడటంతో మార్చి 4న దాన్ని కోచి నౌకాశ్రయంలోకి అనుమతిం చినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఈ నౌకలో 183 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

అయితే, ఇటీవల విశాఖ వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్?కు ఇరాన్‌కు చెందిన నౌక ఐరిస్ లవన్ వచ్చింది. అయితే తిరుగు ప్రయాణంలో నౌకలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో కొచ్చిలో దీన్ని నిలిపేందుకు అనుమతి ఇవ్వాలని ఇరాన్? ఫిబ్రవరి 28న భారత ప్రభుత్వాన్ని కోరినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. అందుకు మార్చి 1నే అనుమతి లభించిందని అధికారులు తెలిపారు. దీంతో ఐరిస్ లావన్ మార్చి 4న కొచ్చి ఓడరేవుకు చేరింది. మరోవైపు, ఇటీవల విశాఖపట్నంలో భారత నౌకాదళంతో సంయుక్త విన్యాసాల్లో పాల్గొని తిరుగుముఖం పట్టిన ఇరాన్ యుద్ధ నౌక ఓఆర్ఐఎస్ దేనాను బుధవారం శ్రీలంక సముద్ర జలాల సమీపంలో అమెరికా దాడి చేసి ముంచేయడం తెలిసిందే.

## మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- జనరల్ ఫిజీషియన్ కుంటిల్ల అమూల్య, గైనికాలజిస్ట్ బలగ రజిని
- మెడికవర్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత పరీక్షలు



మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జనరల్ ఫిజీషియన్ కుంటిల్ల అమూల్య, గైనికాలజిస్ట్ బలగ రజిని సూచించారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు గైనిక్, జనరల్ ఓపీని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబాన్ని నడిపించే మహిళలు తమ ఆరోగ్యాన్ని తరచూ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇంటికి మూల స్తంభమైన మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందన్నారు. ఏ చిన్న ఆరోగ్య వచ్చినా వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని హితవు పలికారు. ప్రసవ సమయంలో వచ్చే నొప్పులు భరించలేక చాలా మంది శస్త్రచికిత్సలకు మొగ్గు చూపు తున్నారని, అలాంటి చర్యల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రసవ వేదన భరిస్తే జీవితకాలం ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఇటీవల అధికంగా ప్రబలుతున్న గర్భాశయ క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష (పాప్ స్మియర్) ఉచితంగా చేశారు. పాప్ స్మియర్ అనేది గర్భాశయ ముఖద్వారం వద్ద క్యాన్సర్‌కు దారితీసే కణాల మార్పులు లేదా ముందస్తు క్యాన్సర్ కణాలను గుర్తించడానికి చేసే సులభమైన పరీక్ష అని తెలిపారు. ఇది 21-65 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో, తొలిదశలోనే గుర్తించడంలో సహాయపడుతుందని వివరించారు. సుమారు 100 మందికి పైగా మహిళలకు ఉచితంగా ఓపీ అందించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ సెంటర్ హెడ్ సాగరిక, జనరల్ సర్జన్ మనోజ్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్ , డీజిల్ ధరల షాక్ తప్పదా?

పశ్చిమాసియాలో ఉద్రికత్తల నేపథ్యంలో పెట్రోల్,డీజిల్ రేట్లు భారీగా పెరుగుతాయనే ఆందోళనలు విస్తృతంగా వ్యాపించాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతీకార దాడుల మధ్య ప్రపంచ చమురు సరఫరాకు అంతరాయంతో, అనేక దేశాలలో ఇంధన ధరల పెరుగుదలకు దారితీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గల్ఫ్ నుండి చమురు దిగుమతి చేసుకునే భారతదేశంపై ప్రభావం ఉంటుందని అంచనా. ఈ క్రమంలో ముందస్తు జాగ్రత్తగా పంజాబ్‌కు చెందిన ఒక వ్యక్తి డీజిల్‌ను నిల్వ చేసుకుంటున్న వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. ఎక్స్‌లో వైరల్ అవుతున్న ఒక వీడియో ప్రకారం పంజాబ్ కు చెందిన ఒక వ్యక్తి 1,000 లీటర్ల నీటి ట్యాంక్ లో డీజిల్ నింపుతున్నారు. ఇరాన్ వార్ కారణంగా ఇంధన ధరలు పెరుగు తాయని ఆశించి తానీ నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నాడు. దీనిపై నెటిజన్లు విభిన్నంగా స్పందించారు.ఒక వినియోగదారుడు, "బ్రో తన నీటి ట్యాంక్‌ను ప్రైవేట్ పెట్రోల్ పంపుగా మార్చాడు అని చమత్కరించగా", మీరు చెప్పింది పూర్తిగా నిజమే, భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగబోతున్నాయి.

# కాకతీయ అమరావతి


ఆదివారం మార్చి 8-3-2026














## లాం నవమి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు

గుంటూరు మార్చి 7 (కాకతీయ) కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గుంటూరు నగరంలోని స్థానిక 23వ డివిజన్‌లో అంగన్వాడీ--డ్వాక్రా సాధికార సంస్థ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లామ్ నవమి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి కేంద్ర మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడిన లామ్ నవమి, గుంటూరు పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు గతంలో ఎన్నడూ లేనంతగా చేపడుతున్న నాయకుడు పెమ్మసాని చంద్రశేఖర్ అని పేర్కొన్నారు. ఆయన ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కార దిశగా కృషి చేస్తున్నారని, అభివృద్ధి పథంలో గుంటూరు ప్రాంతాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ఆమె అన్నారు.కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గుంటూరు పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారని లామ్ నవమి తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని, గుంటూరు ప్రజల హృదయాల్లో రారాజుగా నిలుస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొని కేంద్ర మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో లక్ష్మీదుర్గను ఏ-2గా చేర్చిన సిట్ అధికారులు
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ కోర్టులో ఛార్జిషీట్
- కోర్టు ఆదేశాలతో లక్ష్మీ దుర్గ కోసం గాలిస్తున్న పోలీసులు

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గకు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు సిట్ అధికారులు ఈ కేసులో దర్యాప్తును లోతుగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గను ఈ కేసులో రెండవ నిందితురాలిగా (ఏ-2) చేర్చారు. ఈ మేరకు సిట్ అధికారులు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసులు సమర్పించిన ఛార్జిషీట్‌ను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. లక్ష్మీ దుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.



## హతుడు షేక్ ఇబ్రహీం కుటుంబానికి రూ.2లక్షల విరాళం అందజేసిన ఎమ్మెల్యే చదలవాడ.



**కాకతీయ నరసరావుపేట:** గత ప్రభుత్వ హయాంలో నరసరావుపేట పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయానికి సమీపంలో ఉన్న మసీదు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ వ్యవహారాలలో హత్యకు గురైన షేక్ ఇబ్రహీం కుటుంబానికి రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముస్లిం పెద్దల సమక్షంలో ఇబ్రహీం భార్య అయినటువంటి భాసిరున్ కు ఎమ్మెల్యే గారి క్యాంప్ ఆఫీస్ లో అందజేయడం జరిగింది.గతంలో కూడా రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయం మరియు రేషన్ షాప్ డీలర్ షిప్, మార్కెట్ యార్డ్ కాంప్లెక్స్ లో ఒక షాపు ను ఇచ్చి ఆర్థికంగా మానవీయ కోణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అండగా నిలవడం జరిగింది. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ మహబూబ్ సామాజిక సేవ కార్యకర్త మస్తాన్వలి పలువురు టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## లామ్ నవమి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు



**గుంటూరు:** కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గుంటూరు నగరంలోని స్థానిక 23వ డివిజన్‌లో అంగన్వాడీ--డ్వాక్రా సాధికార సంస్థ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లామ్ నవమి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి కేంద్ర మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడిన లామ్ నవమి, గుంటూరు పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు గతంలో ఎన్నడూ లేనంతగా చేపడుతున్న నాయకుడు పెమ్మసాని చంద్రశేఖర్ అని పేర్కొన్నారు. ఆయన ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కార దిశగా కృషి చేస్తున్నారని, అభివృద్ధి పథంలో గుంటూరు ప్రాంతాన్ని ముందుకు తీసుకెళు తున్నారని ఆమె అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గుంటూరు పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారని లామ్ నవమి తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని, గుంటూరు ప్రజల హృదయాల్లో రారాజుగా నిలుస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొని కేంద్ర మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పరిశ్రమల ప్రోత్సాహం ఎగుమతులపై కలెక్టర్ సమీక్ష...

- సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమలకు ఇచ్చే అనుమతులపై చర్చ.
- మార్చి నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పలు వ్యాపారస్తులతో "ర్యాంపు" ప్రోగ్రాం సక్సెస్ కు సూచనలు
- సమీక్షలో కీలక అంశాలపై చర్చించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతిక శుక్ల.



**కాకతీయ, కలెక్టరేట్ నరసరావుపేట:** పల్నాడు జిల్లా పరిశ్రమల ప్రోత్సాహ మరియు ఎగుమతుల కమిటీ సమావేశము శనివారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ శ్రీమతి కృతిక శుక్ల అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సంబంధిత శాఖ అధిపతులతో సమీక్ష నిర్వహించటంతో పాటుగా గత సమావేశం తర్వాత నుండి నేటి వరకు వివిధ ప్రభుత్వ శాఖలు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమలకు ఇచ్చే అనుమతులు పై చర్చించారు. అదేవిధంగా పరిశ్రమల స్థాపించి అర్హత కలిగిన ఎనిమిది యూనిట్లకు రావాల్సిన వివిధ రకాల రాయితిలకు సుమారుగా 81.78 లక్షల రూపాయలు మంజూరు విషయముపై పరిశ్రమల కేంద్రము జిల్లా పరిశ్రమల అధికారి వారిని అడిగి తెలుసుకున్నారు. అంతేగాక నవంబర్ 2025 నెల్లో విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సు ద్వారా పల్నాడు జిల్లాలో తమ యూనిట్లును ప్రారంభించదలచి వాటి అమలులో జరిగే జాప్యము ను నివారించే దానిలో భాగంగా వాటిపై విపులంగా చర్చించారు. జిల్లాలో ఇప్పటికి నిర్మాణము ప్రారంభించిన మరియు ప్రాథమిక దశలో ఉన్న వివిధ భారీ పరిశ్రమల అమలు విషయంపై జరుగుతున్న జాప్యము పై కారణాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రెవెన్యూ శాఖ వారి తగు ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. దీనితో పాటు వివిధ క్రేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై రివ్యూ నిర్వహించి తగు సూచనలు చేయడం జరిగింది. ఇందుకు సంబంధించి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాంప్రసాద్ ను నెలాఖరులోగా అన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లక్ష్యాలను చొరువ తీసుకొని నెలాఖరులోగా నూటికి నూరు శాతం గ్రౌండింగ్ అయ్యే విధముగా ఆదేశించారు. తదుపరి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతులు కల్పన సంస్థ (ఏపీఐఐసి) వారికి ఇప్పటికి కేటాయించిన భూముల, మరియు కేటాయించవలసిన భూముల గురించి అటు రెవెన్యూ సిబ్బందికి మరియు జోనల్ మేనేజర్ కి తగు సూచనలు చేశారు. జిల్లాలో మార్చి పదో తారీకు నుండి 12వ తారీకు వరకు నిర్వహించబోయె పీఎం విశ్వకర్మ ప్రదర్శన మరియు వ్యాపారమేళా గురించి అదే విధంగా ఈనెల 21 లేదా 28వ తేదీల్లో జిల్లా స్థాయి" ర్యాంపు" ప్రోగ్రాం మరియు రేపు అనగా తేది 08-03-2026 జరగబోయే "అంతర్జాతీయ మహిళా సదస్సు" సందర్భంగా "ఉద్యమ రిజిస్ట్రేషన్స్" కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు.

# మహిళలకు అవకాశం ఇస్తే ఆకాశమే హద్దు






- మహిళా సాధికారతకు ప్రకృతి వ్యవసాయం దిక్సూచి
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలు గుంటూరు క్రిషి భవన్‌లో ఘనంగా నిర్వహణ
- మహిళా రైతుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు: జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి

గుంటూరు, కాకతీయ మార్చి-7

మహిళలకు సరైన అవకాశాలు, ప్రోత్సాహం మరియు సమానత్వం కల్పిస్తే వారు ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించగలరని, వారి ప్రతిభ సమాజ అభివృద్ధికి బలమైన శక్తిగా మారుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి పద్మావతి అన్నారు. మహిళల సామర్థ్యాన్ని గుర్తించి వారికి అవకాశాలు కల్పించడం ద్వారా కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని క్రిషి భవన్‌లో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మహిళా కేడర్లతో కలిసి ముందస్తు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు, మహిళా కేడర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంలో మహిళల ప్రాధాన్యం

ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళలు వ్యవసాయ పనులతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను గ్రామస్థాయిలో విస్తరించడంలో మహిళా కేడర్లు రైతులకు మార్గదర్శకులుగా పనిచేస్తున్నారని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించడం, శిక్షణలు అందించడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం వంటి అంశాలలో మహిళలు ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారని వివరించారు.

### గివ్ టూ గెయిన్ సందేశం

ఈ సంవత్సరానికి అంతర్జాతీయ మహిళా గివ్ టు గెయిన్ దినోత్సవ థీమ్ అని పేర్కొంటూ మహిళలకు అవకాశాలు, సమానత్వం, స్వేచ్ఛ కల్పిస్తే కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని రాజకుమారి తెలిపారు. మహిళలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అలాగే ఈ సంవత్సరాన్ని మహిళా రైతు సంవత్సరంగా జరుపుకుంటూ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలలో మరింత మంది మహిళలను భాగస్వాములుగా చేయడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మహిళా రైతులకు ప్రత్యేక శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించ డం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

### మహిళల కృషి అభినందనీయం

జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలలో మహిళల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న మహిళా కేడర్లు రైతులకు అవగాహన కల్పించడంలో మరియు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు మరింత కృషి చేసి ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కోరారు.

### క్రీడలతో మహిళల్లో ఉత్సాహం

కార్యక్రమంలో భాగంగా మహిళా కేడర్లకు క్రీడా పోటీలు నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ క్రీడల ద్వారా మహిళల్లో ఐక్యత, ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలలో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు.

### లక్ష్యాల సాధనపై రివ్యూ

ఈ కార్యక్రమంలో ADPM సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ మహిళా కేడర్లు, NFAలు, FMTలు, ICRP లు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన రివ్యూ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల పురోగతిని సమీక్షించి నిర్ణయించిన లక్ష్యాలను త్వరితగతిన సాధించడానికి కృషి చేయాలని అధికారులు సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు మరింత అవగాహన కల్పిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడంలో మహిళా కేడర్లు ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం, పర్యావరణ పరిరక్షణ, రైతుల ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# స్పెల్ బీ పోటీలలో విజేతలకు ఘన సత్కారం

### విద్యార్థుల్లో ఇంగ్లీష్ పదజాల అభివృద్ధికి స్పార్క్ ఎడేక్స్ కృషి

విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు పెంపొందించి, పదజాల పరిజ్ఞానాన్ని విస్తరించేందుకు నిర్వహించిన స్పెల్ బీ పోటీలలో విజేతలకు స్పార్క్ ఎడేక్స్ సంస్థ ఘనంగా సత్కారం చేసింది. హైదరాబాద్‌కు చెందిన స్పార్క్ ఎడేక్స్ సంస్థ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని కార్యాలయంలో ఈ రోజు ఉదయం 11 గంటలకు అవార్డు ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెంబర్ వన్ న్యూస్ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ సాయి సుధాకర్ నాయుడు, ఆక్స్ఫర్డ్ విట్ కాలేజీ డైరెక్టర్ సాంబశివరావు, వివేకానంద స్కూల్ డైరెక్టర్ రామకృష్ణ మాస్టర్, హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమానికి స్పార్క్ ఎడేక్స్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ గారు సభాధ్యక్షులుగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

### స్పెల్ బీ పోటీల ప్రాముఖ్యతపై ప్రసంగాలు

ముఖ్య అతిథి సాయి సుధాకర్ నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషపై పట్టు పెంచేందుకు స్పెల్ బీ పోటీలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఇంగ్లీష్ పదజాలాన్ని నేర్చుకుంటే వారి వాక్చాతుర్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు ఆత్మవిశ్వాసం పెరుగుతాయని చెప్పారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో పోటీ భావన, క్రమశిక్షణ, కృషి, సాధన వంటి లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యారంగంలో నాణ్యత పెరగాలంటే పాఠశాలలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు.

### ప్రాక్టికల్ నాలెడ్జ్ పై ప్రశంసలు

సాయి సుధాకర్ నాయుడు మాట్లాడుతూ రామకృష్ణ మాస్టర్ రూపొందించిన మాక్ మీజ, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వంటి విద్యా వీడియోలు తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా ప్రాక్టికల్ అవగాహన కూడా అవసరం అని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న వ్యవస్థలపై అవగాహన కల్పించే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఇతర పాఠశాలలు కూడా ఇలాంటి కార్యక్రమాలను చేపడితే సమాజానికి సచేతనమైన, బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయగలుగుతామని ఆయన అభిప్రాయపడ్డారు.

### ఇంగ్లీష్ కమ్యూనికేషన్ కు స్పెల్ బీ దోహదం

ఆక్స్ఫర్డ్ విట్ కాలేజీ డైరెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ భాషకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. స్కూల్ స్థాయి నుంచే విద్యార్థుల్లో ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, పదజాల పరిజ్ఞానం, స్పెల్లింగ్ పై అవగాహన పెంపొందించేందుకు స్పెల్ బీ పోటీలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తి, పట్టుదల, సాధన పెంచి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు.




### విద్యార్థులకు విలువలపై సందేశం

వివేకానంద స్కూల్ డైరెక్టర్ రామకృష్ణ మాస్టర్ మాట్లాడుతూ, స్పెల్ బీ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఈ రోజుల్లో మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. జీవితంలో విజయం సాధించాలంటే ఓర్పు, సహనం, క్రమశిక్షణ, సమయస్ఫూర్తి వంటి విలువలు ఎంతో అవసరమని అన్నారు. అలాగే నిరంతరం సాధన చేస్తే విద్యార్థులు తమ లక్ష్యాలను సులభంగా సాధించగలరని తెలిపారు.

### విజేతలకు బహుమతులు

కార్యక్రమంలో స్పెల్ బీ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ వారికి ప్రోత్సాహం అందించడంతో పాటు వారి విజయాలను ఘనంగా అభినందించారు. అనంతరం ముఖ్య అతిథులకు మూమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు.

### వివేకానంద స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఈ పోటీలలో వివేకానంద స్కూల్ కు చెందిన 22 మంది విద్యార్థులు ఎంపిక కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని రామకృష్ణ మాస్టర్ తెలిపారు. విజేతలకు ప్రిన్సిపల్ సుప్రియ మేడమ్, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయంతో విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## మహంకాళి అమ్మ దర్శనం అదృష్టంగా భావిస్తున్న: కలెక్టర్ శ్రీమతి కృతిక శుక్ల



కాకతీయ నరసరావుపేట: నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయాల్ని పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతిక శుక్ల శనివారం సందర్శించారు. నరసరావుపేట పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు భోగి పర్తి విజయ్ కుమార్ గుప్తా ఆహ్వానం మేరకు అమ్మవారికి నైవేద్య సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. 51వ వార్షిక తిరుణాల వేడుకలు సందర్భంగా మూడు రోజుల పాటు తిరునాళ్ల వేడుకలు జరుగుతాయి. ఆలయానికి విచ్చేసిన కలెక్టర్ ను దేవాదాయ శాఖ అధికారులు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి కలెక్టర్ చేతుల మీదుగా పట్టు వస్త్రాలు పసుపు కుంకుమ గాజులు సమర్పించారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు అలానే అమ్మవారి ఒక ప్రత్యేక పూజలు లో ఉంచిన చీరను పసుపు కుంకుముగా కలెక్టర్కు ఈవో మాధవి దేవి అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన అభివృద్ధి పనులపై, తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ ఆలయ కమిటీ చైర్మన్ ఈవోలతో ఆరా తీశారు.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖతో సమన్వయ చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండ్లమూరి చంద్రశేఖర్ ఎమ్మార్వో వేణుగోపాల్ కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు కార్తికేయ శర్మ నందూరి కాళీ కృష్ణ కొత్తలంక సుధాకర్ శర్మ అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా - ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాము

### నకరికల్లు తెదేపా నాయకులు.



**కాకతీయ నకరికల్లు:** మండల కేంద్రమైన నకరికల్లులో ఎన్నాళ్ళుగానే ఎదురు చూస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణం కలగానే కాకుండా నిజమవుతుందని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక హుస్సేన్ హాస్పిటల్ నుండి రంగా బొమ్మ సెంటర్ వరకు రహదారిని సి.సి.రోడ్డు నాణ్యతతో నిర్మించే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.ఈ రహదారి గుండా శివాపురం తండా మరియు ఉదయనగర్ తండా వాసులు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు.అంతేకాక గ్రామంలోని పాతూరు నుండి మెయిన్ సెంటర్ కు ఈ దారినే వెళతారు.అయితే కొన్ని సంవత్సరాలుగా ఈ రహదారి దెబ్బతిని గుంటలు పడి నడవటానికి కూడా ఇబ్బందిగా ఉండేది. ఈ దారిలో నడవడానికి, ప్రయాణించటానికి ప్రజలు ఎన్నో అవస్థలు పడేవారు.అయితే ఇదంతా గతం ఇప్పుడు ఈ రహదారి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుండటంతో ఇటు నకరికల్లు గ్రామ ప్రజలకు అటు తండా వాసులకు ఎంతో ఆనందాన్నిస్తున్నదని వారు చెపుతున్నారు.ఈ రహదారి కోసం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ నెరవేర్చడం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పల్లెలు బాగుండాలి అని చేపట్టిన పల్లెపండుగ పథకం నుండి కోటి రూపాయల నిధులతో ఈ సి.సి.రోడుథ నిర్మాణం జరుగుతున్నదని నకరికల్లు తెదేపా నాయకులు తెలిపారు.ఈ నిధులు కేటాయింపుకు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగోతు శౌరయ్య,పార్టీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి,పార్టీ సీనియర్ నాయకులు సాగి శ్రీనివాసరావుల సహకారం మరువలేనిదని వారన్నారు.అయితే మొదటి విడతగా రంగా బొమ్మ సెంటర్ వరకు మాత్రమే నిధులు సరిపోతాయని మరళా తదుపరి వచ్చే నిధులతో మిగిలిన రోడ్డు కూడా కూటమి ప్రభుత్వంలోనే పూర్త చేస్తామని వారన్నారు.ఈ రోడ్డు నిర్మాణానికి గ్రామంలోని జనసేన,బి.జె.పి నాయకులు తమ వంతు సహాయ,సహకారాలు అందిస్తున్నారని వారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెదేపా నాయకులు తెలిపారు.వారు మాట్లాడుతూ గతంలో కూడా ఈ రోడ్డు నిర్మాణం తెదేపా ప్రభుత్వం హయాంలో నిర్మించిందని,అప్పటి పంచాయతీ రాజ్ శాఖా మాత్యులు స్వర్గీయ కోడెల శివప్రసాదరావు ఈ రహదారి నిర్మాణానికి నిధులను కేటాయింపజేసి 2001 లో ప్రారంభించారని వారు తెలిపారు.మరళా ఇప్పుడు కూటమి ప్రభుత్వం చొరవతోనే ఈ రహదారి నిర్మాణం జరగడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని వారు అన్నారు.

## అమరావతిలో క్రియేటివ్ సిటీ - గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్

ఏపీ రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. అమరావతి రానున్న కాలంలో ప్రపంచం దృష్టిని ఆకట్టుకునే మహా నగరం అవుతుందని ఆయన చెప్పారు. ఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్ 2026 సదస్సుకు చంద్రబాబు హాజరయ్యారు. 2016 నుంచి నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక సదస్సులో తొలిసారిగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి రైసినా డైలాగ్ నిర్వాహకులు ఆహ్వానం పలికారు. ఆ విధంగా బాబు అరుదైన గౌరవం అందుకున్నారు. ఇక ఈ కార్యక్రమానికి 110 దేశాల నుంచి 2700 మందికి పైగా ప్రతినిధులు మేధావులు నిపుణులు వ్యూహకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు ఏపీ గురించి, దేశం గురించి ప్రపంచం గురించి భవిష్యత్తులో జరిగే పరిణామాల గురించి సోదాహరణంగా వివరించడం గమనార్హం.

**అమరావతి ఈజ్ గ్రేట్ :** ఇక ఏపీ రాజధాని అమరావతి ఈజ్ గ్రేట్ రూపుదిద్దుకుంటోందని చంద్రబాబు చెప్పడం విశేషం. తొమ్మిది అంశాలతో కూడిన నగరాలను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అలాగే క్రియేటివ్ సిటీని కూడా అమరావతిలో నెలకొల్పుతున్నామని చెప్పారు. ఇక ప్రముఖ ఐటీ కంపెనీలను భారతీయులే లీడ్ చేస్తున్నారని బాబు గుర్తు చేశారు. అందుకే అమరావతిలో గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ ను సైతం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సైబరాబాద్ తో పాటు అమరావతిని బ్లూ గ్రీన్ సిటీగా నిర్మించే అవకాశం తనకు లభించింది అని బాబు ఎప్పారు. టెక్నాలజీని, ఇన్ ఫ్రాను మిళితం చేసి కాలుష్య రహిత నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని అన్నారు.

**నాలెడ్జి ఎకానమీ గురించి :** తాను ఉమ్మడి ఏపీకి సీఎం గా ఉన్నపుడు ఐటీ విప్లవం గురించి మాట్లాడితే అంతా విమర్శించారని బాబు అన్నారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ నాలెడ్జి ఎకానమీకి కేంద్రంగా మారిందని ఆయన ఉదహరించారు. అలాగే ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనేది గేమ్ చేంజర్ గా మారబోతోందని బాబు జోస్యం చెప్పారు ఏఐ, క్వాంటం కంప్యూటర్లను ఎలా వినియోగించుకుంటామన్న అంశం ఆధారంగానే భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని విశ్లేషించారు. ఇక మూడు దశాబ్దాల క్రితం అందిపుచ్చుకున్న ఐటీ విప్లవం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు తెలుగు రాష్ట్రాల నుంచి సమర్థులైన నిపుణులను ఎంతో మందిని అందించిందని బాబు చెపపరు.

**భారత్ ది నాయకత్వం :** ఇదిలా ఉంటే భారతదేశం ఈ రోజున శరవేగంగా అభివృద్ధి వైపు సాంకేతికత వైపు సాగుతోంది అని చంద్రబాబు చెప్పారు. నాలెడ్జి ఎకానమీలో లీడింగ్ భాగస్వామిగా భారత్ ఉందని ఆయన చెప్పారు. ఏకంగా 60 శాతం జీసీసీలు భారత్ లోనే ఏర్పాటు అయ్యాయని ఆయన గుర్తు చేశారు. డిజిటల్ కరెన్సీ సంస్కరణల ద్వారా యూపీఐ పేమెంట్ వ్యవస్థ కూడాదేశంలో కీలకంగా మారిందని అన్నారు గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని అలాగే, క్వాంటం కంప్యూటింగ్ ను అందిపుచ్చుకునేలా అమరావతిని క్వాంటం వ్యాలీగా మారుస్తున్నామని బాబు చెప్పుకొచ్చారు. త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను కూడా తయారు చేసి ప్రపంచానికి అందిస్తామని బాబు ధీమా వ్యక్తం చేయడం విశేషం.

**డ్రోన్ అంబులెన్స్ కూడా :** ఇక డ్రోన్ అంబులెన్స్ కూడా త్వరలోనే రియాలిటీగా మారబోతోందని బాబు ధీమాగా చెప్పారు. ప్రైవేటు శాటిలైట్లను కూడా తయారు చేసి లాంచ్ చేసేలా ఓ స్పేస్ సిటీని డ్రోన్ల కోసం డ్రోన్ సిటీని ఏపీలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎలక్ట్రానిక్స్, ఏరో స్పేస్ సిటీని ఏర్పాటు చేసి పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని ఆయన అంటున్నారు. ప్రివెంటివ్ హెల్త్ అనేది రియాలిటీ, క్యూరేటివ్ విధానంపైనా అంతా దృష్టి సారించాల్సి ఉందని సమావేశంలో బాబు సూచించారు. అలాగే లి మేధావులు, నిపుణులు, వ్యూహకర్తలు ఇచ్చిన ఆలోచనల్ని అమలు చేసేందుకు భారత్ తో పాటు ఏపీసన్నద్ధంగా ఉంటుందని బాబు స్పష్టం చేయడం విశేషం.

కాకతీయ పల్నాడు
7
08 ఆదివారం మార్చి 2026

# జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం



**కాకతీయ వినుకొండ** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశానుసారము, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి పర్యవేక్షణలో మండల న్యాయ సేవాధికార సంస్థ, వినుకొండ వారు ఈ నెల 14 వ తేదీన రెండవ శనివారం నాడు వినుకొండ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు నందు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వినుకొండ లోక్ అదాలత్ చైర్మన్ మరియు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు న్యాయమూర్తి శ్రీమతి ఆర్.ఆశీర్వాదం పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు అన్ని రకాల సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు వివాద కేసులు, కుటుంబ తగాదా కేసులు, మనోవర్తి వివాద కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ముందస్తు రాజీ చేసుకొదలచిన కేసులు మరియు ప్రీ లిటిగేషన్ కేసులు అనగా టెలిఫోన్ బిల్లులు, కరెంట్ బిల్లులు, వాటర్ బిల్లులు మొదలగు కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినుకొండ న్యాయస్థానం పరిధిలో ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొన వలసినదిగా న్యాయమూర్తి కోరారు.

## గీతాంజలి స్కూల్ నందు ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**కాకతీయ వినుకొండ** పట్టణంలోని గీతాంజలి స్కూల్ నందు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్. కె. జి మరియు యు. కె. జి చిన్నారులు తమ తల్లుల సహకారంతో చేసిన పలు ప్రదర్శనలు చూపరులను విశేషంగా అలరించాయి. చిన్నారులు కొందరు వారి ఫ్యామిలీ ట్రీ లను తయారు చేయగా, కొందరు వివిధ రకాల నమూనాలను మరియు కొంతమంది ఫాన్సీ డ్రస్ లలో కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి తేళ్ళ కృష్ణవేణి మాట్లాడుతూ సృష్టిలో మహిళల యొక్క పాత్ర అనిర్వచనీయమని, వారు ఎంతో గొప్పగా తమ విధులను ఇంటా బయట నిర్వహిస్తూ తమ కుటుంబాలను ఉన్నతంగా నిర్మించుకుంటారు అట్టి మహిళల గౌరవార్థం ఈ మహిళా దినోత్సవ వేడుకలు సందర్భంగా చిన్నారులచే వారి తల్లుల సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. అలాగే తమ పాఠశాలలో చదువుచున్న విద్యార్థుల యొక్క తల్లులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో కరస్పాండంట్ వై లక్ష్మణ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అయ్యంకి వేంకట రమణయ్య చిత్ర పటానికి నివాళి




**చిలకలూరిపేట/కాకతీయ మార్చి-7:** పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ(గార్డ్స్) మరియు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వేంకట రమణయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు బి. అజయ్ బాబు పాల్గొని మాట్లాడారు.. గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి చేసిన సేవలను ఆయన వివరించారు. వీరు పద్మశ్రీ బిరుదు పొందారన్నారు..వీరిని ఆదర్శంగా తీసుకుని పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్సీ కే.యస్.లక్ష్మణ్ రావు రైనా రాజ్యంగా పీఠిక పుస్తకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది దాసరి చిట్టిబాబు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్. దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ అధికారి డీ.వీర్రాజు, సిబంది సలోమి, గార్డ్స్ సభ్యులు నల్లమల దానయ్య, జెర్రిపోతుల బుల్లిబాబు, న్యాయవాది ఇనగంటి శివ నాగరాజు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## చక్రధర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం



**మాచర్ల కాకతీయ మార్చి 7:** మాచర్ల పట్టణంలో స్థానిక చక్రధర్ కాలేజీలో విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో ఉన్నత ఆశయాలతో మంచి ఉద్యోగాలు సాధించి మంచి అభివృద్ధి చెందాలని వక్తలు సాయి మార్కొండ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ప్రిన్సిపాల్ కే సాయినాథ్ కొండారెడ్డి డైరెక్టర్ ఎం మహేశ్వరరెడ్డిలు కోరారు కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్ ఎఫ్ ఎస్ రాణి ,ఎం లక్ష్మీ ప్రసన్న, జయరాజ్యలక్ష్మి లు సందేశాలను ఇచ్చారు కార్యక్రమంలో విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు వివిధ కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు

## మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన : ప్రభుత్వ చీఫ్ విప్ జీవి.



**కాకతీయ వినుకొండ** అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం తోపాటు రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారు అక్కడ దేవతలు కొలువై ఉంటారని అన్నారు. మహిళల అభ్యున్నతికి, సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తు పాలన సాగిస్తుందన్నారు. సృష్టికి మూలం, జగతికి ఆధారం, వాళ్ళు అలుపెరగని శ్రమ తత్వంతో పని చేస్తున్న నారీ శక్తికి ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్టీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి: గిరిజన సమాఖ్య డిమాండ్

### ఎస్టీలను అన్ని విధాలుగా బోలోపేతం చేసిన తర్వాతే.... రిజర్వేషన్లను ఆమోదింప చేసుకోవాలి: బి.శ్రీను నాయక్



**చిలకలూరిపేట/కాకతీయ మార్చి-8:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అందులో భాగస్వాములు అయినటువంటి ప్రజాప్రతినిధులు పార్లమెంట్, అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో బిసీ సామాజిక వర్గీయులను ఎస్టీ జాబితాలో కలపాలని ప్రతిపాదన తెరపైకి తీసుకొస్తున్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా శాతం, రిజర్వేషన్ పరంగా, ఆర్థికపరంగా, బిసీ సామాజిక వర్గీయులు బలపడియున్నారు. సుమారుగా ఏడు శాతం రిజర్వేషన్ ఉన్న ఎస్టీల్లో కలపాలని ప్రతిపాదన తీసుకురావడం పట్ల వ్యతిరేకిస్తున్నామని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జరిగిన అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు మరోసారి బిసి జాబితాలో ఎస్టీల్ని కలపాలని మాట్లాడారు,ఇది రాజ్యాంగబద్ధమైన ఎస్టీలకు ఉన్న రిజర్వేషన్లు హరించే విధంగా ఉందని దుయ్యబట్టారు. ఎస్టీలకు చెందిన ఏడుగురు ప్రజాప్రతినిధులు ఎస్టీల ఓట్ల చేత గెలుపొంది ఎస్టీల గురించి మాట్లాడకపోవడం చాలా బాధాకరమన్నారు. నైతికంగా వారి పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీల గురించి మాట్లాడ లేనప్పుడు ఆ పదవులో ఉన్న ఒకటే లేకున్నా ఒకటే అన్నారు. ఆర్థికంగా, రాజకీయ సామాజికంగా ఎస్టీలు వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఎస్టీలను బలోపేతం చేసిన తర్వాతే రిజర్వేషన్ల అంశం గురించి మాట్లాడాలని హెచ్చరించారు. కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా కూటమిలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధుల చేత మాట్లాడిస్తున్నారని, ఆ విధంగా చేయడం సమంజసం కాదన్నారు. ఇటువంటి ఆలోచనలు పునరావతం కాకుండా విజయవాడలో రాజకీయ, ఎస్టీ సంఘాల నాయకులను సమయత్వం చేసి రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు.

# కిడ్నీ బాధితుడికి అండగా నిలిచిన మాజీమంత్రి ప్రత్తిపాటి



**చిలకలూరిపేట/కాకతీయ మార్చి-7:** పట్టణంలోని 6 వార్డు (ఎన్టీఆర్ కాలనీ)కి చెందిన కిడ్నీ బాధితుడు గుంటూరు సాయి అనారోగ్య సమస్యను అతని తల్లి, ఇతర కుటుంబసభ్యులు తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే ప్రభుత్వాన్ని సంప్రదించి, సీఎంవో కార్యాలయ సిబ్బందితో మాట్లాడటం జరిగిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బాధితుడి ఆరోగ్య సంరక్షణకోసం, నాణ్యమైన వైద్యసేవల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.9 లక్షల ఎల్.వో.సీని ప్రత్తిపాటి శనివారం సాయి తల్లి శ్రీమతి గుంటూరు రమాదేవికి అందించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ, చిన్న వయసులోనే సాయి రెండు కిడ్నీలు దెబ్బతిని, మంచానికే పరిమితం కావడం బాధాకరమన్నారు. బాధితుడికి తండ్రి లేరని, తల్లి రెక్కల కష్టమే ఆ కుటుంబానికి ఆధారమని, ఈ పరిస్థితుల్లో వారికి అండగా నిలుస్తామని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. అలానే పురుషోత్తమపట్నం కు చెందిన కాటేరు లక్ష్మీ కు 2లక్షల రూపాయల ఎల్.వో.సి.నీ అందజేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బత్తినేని శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పసుమర్రు,ఆటోనగర్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట/కాకతీయ మార్చి-7:** మండలంలోని పసుమర్రు ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం, వేసవిలో ఎదురయ్యే నీటిఎద్దడి దృష్ట్యా ఇప్పుడే గ్రామంలోని చెరువును నీటితో నింపాలని, బొప్పూడి లిఫ్ట్ నుంచి నీటిని తరలించేలా చూడాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు సూచించారు. శనివారం ఆయన తన నివాసంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పసుమర్రు గ్రామస్తులు ప్రత్తిపాటిని కలిసి గ్రామాభివృద్ధి, ఇతర సమస్యలు తెలియచేస్తూ వినతిపత్రం అందించారు. వారి వినతిని పరిశీలించిన ప్రత్తిపాటి.. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా గ్రామంలోని చెరువును వెంటనే నీటితో నింపాలని పంచాయతీ, ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. సీఎస్సార్ నిధులతో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతామని ప్రత్తిపాటి గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

**ఆటోనగర్ సమస్యల్ని రోజుల వ్యవధిలో పరిష్కరించండి.**

ఆటోనగర్ కార్మికులకు స్థానికంగా కేటాయించిన ప్లాట్లలో కొలతలు తేడాలున్నాయని, హద్దులు సరిగా లేనందున సమస్యలు వస్తున్నాయని, రెండో ఫేజ్ లో రోడ్లు , కాలువలు నిర్మించాల్సి ఉందని, నీటి అవసరాలకోసం బోర్లు వేయించాలని, ఆటోనగర్ ప్రవేశంలో ప్రత్యేక స్వాగతద్వారం (ఆర్చీ) నిర్మించాలని స్థానిక కార్మికులు ప్రత్తిపాటిని కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలియచేస్తూ వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన ప్రత్తిపాటి ప్లాట్ల హద్దుల సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని మండల సర్వేయర్ ప్రసాద్ కు సూచించారు, ఆటోనగర్ లో బోర్లు వేయాలని ఆసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల్ని కోరాకు. ప్రత్తిపాటి విజ్ఞప్తిపై వారు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే బోర్లు వేస్తామని చెప్పారు. ఆర్చీ నిర్మాణం.. రోడ్లు, కాలువల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి, స్థానిక మున్సిపాలిటీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావులకు సూచించారు. ఆటోనగర్ కార్మికులు చెప్పిన సమస్యలన్నీ రోజుల వ్యవధిలోనే పరిష్కారం కావాలన్నారు. గతేడాది తలెత్తిన తాగునీటి సమస్యలు ఈ ఏడాది పునరావృతం కాకూడదు. పట్టణ ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించిన ప్రత్తిపాటి.. చిన్నచిన్న సమస్యలను యంత్రాంగం అశ్రద్ధ చేయడం తగదని, మంచినీరు, రోడ్లు, పారిశుధ్య నిర్వహణా లోపాలు వంటి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టంచేశారు. మున్సిపల్ సిబ్బంది పట్టణ ప్రజల తాగునీటి సమస్యపై వెంటనే దృష్టి సారించాలని, గతేడాది తలెత్తిన నీటిసరఫరాలో ఏర్పడిన లోపాలు మరలా ఈ ఏడాది ఎక్కడా పునరావృతం కాకూడదని ప్రత్తిపాటి ఆదేశించారు.

నాదెండ్ల మండలం సంకురాత్రి పాడు గ్రామంలో సీసీరోడ్లు, ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, శ్మశానికి వెళ్లే దారిలో వాగుపైన రూ. 22 లక్షలతో నిర్మించే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ప్రత్తిపాటికి వినతిపత్రం అందించారు. గ్రామస్తులు చెప్పిన అభివృద్ధి అంశాలపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు.

# బిపి ఆయాసం అదుపులో లేని వ్యక్తి కి హైబ్రిడ్ పద్ధతిలో బైపాస్ సర్జరీ విజయవంతంగా నిర్వహించిన శ్రీదత్త హాస్పిటల్ వైద్యులు..



**కాకతీయ,నరసరావుపేట:** వైద్యరంగంలో అత్యంత క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలకు నరసరావుపేట శ్రీ దత్త హాస్పిటల్ వేదికగా మారింది. బిపి ఆయాసం అదుపులో లేని ఓ వ్యక్తికి హైబ్రిడ్ పద్ధతిలో బైపాస్ సర్జరీని విజయవంతంగా నిర్వహించి రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన సంఘటన శ్రీ దత్త హాస్పిటల్ లో జరిగింది. వివరాల్లోకి వెళితే.... వినుకొండ ప్రాంతానికి చెందిన జి నాసరయ్య వ్యక్తి గుండెలో నొప్పి, ఆయాసం బిపి రికార్డు కానంత ప్రాణాపాయ స్థితిలో శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో డాక్టర్ గార్లపాటి కృష్ణ కాంత్ ని సంప్రదించారు. ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన డాక్టర్ కృష్ణ కాంత్ గుండె పనితీరు దెబ్బతిని ఉండటం ఊపిరితిత్తులలో అధిక మొత్తంలో నీరు చేరడం గుర్తించారు. వినుకొండ లోనే తమ హాస్పిటల్ నందు వారం రోజులు ఐసీయూలో వెంటిలేటర్ పై ప్రత్యేక హార్ట్ ఫెయిల్యూర్ ట్రీట్మెంట్ ఇచ్చిన తర్వాత యాంజియోగ్రామ్ పరీక్ష చేయగా మూడు రక్తనాళాలతోపాటు ఎడమవైపు ప్రధాన రక్తనాళం (ఎల్ఎంసిఏ) 90 శాతం పూడిక ఉన్నట్లుగా గుర్తించారు. అత్యంత క్లిష్టతరమైన పూడికలు కావడంతో సర్జన్ ను సంప్రదించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించినప్పటికీ బిపి మెరుగుపడని కారణం చేత కార్డియాక్ సర్జన్ ఆపరేషన్ చేయడానికి నిరాకరించారు. అందువలన ప్రత్యేకమైన హైబ్రిడ్ పద్ధతిలో భాగంగా ఎల్ ఎం సి ఏ లో 90 శాతం పూడికను బెలూన్ యాంజియో ప్లాస్టీ ద్వారా క్లీన్ చేసి ఇతర రక్తనాళాల్లో ఉన్నటువంటి కాల్షియం పూడికలను పాక్షికంగా క్లీన్ చేయడం జరిగింది ఈ చికిత్స అనంతరం రోగి యొక్క బిపి క్రమేపి మెరుగుపడగా హై రిస్క్ బైపాస్ సర్జరీ మార్చి 1వ తేదీన విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఇలాంటి ప్రత్యేక హైబ్రిడ్ చికిత్స విధానం బహుశా పల్నాడు ప్రాంతంలో ఇదే మొదటి సర్జరీ అని డాక్టర్ గార్లపాటి కృష్ణ కాంత్ వెల్లడించారు.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి తమ రోగికి జబ్బు పూర్తిగా నయం చేసి తిరిగి మామూలు మనిషిగా ఇంటికి పంపిస్తున్నందుకు రోగి బంధువులు డాక్టర్ కృష్ణ కాంత్ కి మరియు బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. డా.కృష్ణ కాంత్ మాట్లాడుతూ తనతో పాటు ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ కపలవాయి జ్ఞానేశ్వరి, డాక్టర్ ప్రకాష్ లతో పాటు గుండె వైద్య నిపుణులు, డా. మహేశ్వరరావు – ఊపిరి తిత్తుల వైద్య నిపుణులు, డా. అశోక్ రెడ్డి– మెదడు మరియు నరముల వైద్య నిపుణులు , డా. రవితేజ, డా. విజయ్, డా. నాగలక్ష్మి లతో కూడిన ఎమర్జెన్సీ వైద్య బృందం మరియు కాత్ లాబ్ టెక్నీషియన్స్ సాగర్, అశోక్, చందు, ఓటి టెక్నీషియన్ నారాయణ సహకారంతో పేషెంట్ కు విజయవంతంగా వైద్యం అందించగలిగామని, ముగ్గురు కార్డియాలజీ వైద్య నిపుణుల నిరంతర పర్యవేక్షణ తోనే ఇది సాధ్యమైందని వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్పందనకు వందనం



**మాచర్ల కాకతీయ మార్చి 7:** అధిక డబ్బులు వసూలు చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి అని ప్రయాణికులు ప్రజా సంఘాల నాయకులు డి. ఎం. వీరాస్వామి కి శుక్రవారం నాడు వినతి పత్రం అందించారు.వెంటనే స్పందించి కాంట్రాక్టర్ పిలిచి మొదటి తప్పుగా భావించి 2000 రూపాయలు జరిమానా, వార్నింగ్ ఇచ్చారు ఈ విషయమై ప్రయాణికులు, ప్రజా సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మునుముందు రోజుల్లో ఇటువంటి ఫిర్యాదులు ఏమైనా వస్తే కాంట్రాక్ట్ పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రద్దు చేపిస్తానని ఏపీఎస్ఆర్టీసీ మాచర్ల బస్టాండ్ నందు మరుగుదొడ్లు నడుపుతున్న కాంట్రాక్టు సిబ్బందినీ హెచ్చరించారు.

ప్రయాణికుల వద్ద నుండి అదనపు డబ్బులు వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకోవట విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆర్టీసీ డిఎం వీరస్వామి విలేకరుల సమావేశంలో తెలియజేశారు ఈ సందర్భంగా మరుగుదొడ్లకు సంబంధించి పలు సమస్యలను మాచర్ల ఆర్టీసీ డిఎం వీరస్వామి క్షుణ్ణంగా పరిశీలించి. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండటం లేదని, మరుగుదొడ్లు శుభ్రత లేదని గ్రహించారు. ఇదిలా ఉండగా మరుగుదొడ్ల ఉపయోగించుకునే ప్రయాణికులకు ప్రభుత్వపరంగా ఐదు రూపాయలు చెల్లించవలసి ఉంటుందని దీనికి అదనంగా సిబ్బంది 15 రూపాయలు కలిపి మొత్తం 20 రూపాయలు తీసుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మరుగుదొడ్లు ఉన్న రూమ్స్ వద్ద బోర్డ్స్ ఏర్పాటు చేసి రేట్లు వివరాలు పెట్టవలసి ఉన్న అవి కూడా ఏర్పాటు చేయలేదని, దీనివల్ల ప్రయాణికుల వద్ద నుండి మరుగుదొడ్లు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సిబ్బంది ఇష్టం వచ్చినట్లు డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇదేమని అడిగితే మేము ఇంతే మీరు ఎవరికి చెప్పుకుంటారు చెప్పుకోమని ప్రయాణికులను బెదిరిస్తున్నారని, ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని ఇలాంటివి మును ముందు రోజుల్లో పునరావృతం కాకుండా చూడాలని అవసరమైతే వారి లీజును రద్దు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన అన్నారు.

## లాడ్జిలపై మెరుపు దాడి చేసిన..సిఐ ప్రభాకర్




**కాకతీయ వినుకొండ** పట్టణంలోని నిన్న రాత్రి 11 గంటల ప్రాంతంలో పట్టణంలోని అన్ని లాడ్జిలు పైన పట్టణ సిఐ బి ప్రభాకర్ మరియు ఎస్సై పుల్లారావు సిబ్బంది అందరూ లాడ్జీలను తనిఖీ చేయడం జరిగింది ఒక లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక స్త్రీని మరియు ఇద్దరు పురుషులను అరెస్ట్ చేయడం జరిగింది మరియు పట్టణంలోని లాడ్జి ఓనర్లకు ముఖ్య గమనిక లాడ్జిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరక్కుండా చూడవలసిందిగా కోరడమైనది లేనిచో వారిపైన చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేయడం జరిగింది

## యడ్లపాడు స్పిన్నింగ్ మిల్లుల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు



**చిలకలూరిపేట/కాకతీయ మార్చి-7:** జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు శనివారం భారీ స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ముఖ్యంగా యడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని 12 స్పిన్నింగ్ మిల్లులపై పోలీసులు ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్ కోసం ఇద్దరు డీఎస్పీల నేతృత్వంలో పోలీసులు 12 ప్రత్యేక బృందాలుగా విడిపోయి మిల్లుల్లోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం, మిల్లుల్లో పనిచేసే కార్మికులకు డ్రగ్స్ మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై పోలీసులు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. యువత మరియు కార్మికులు వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ, కార్మికులందరితో మత్తు పదార్థాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. అనుమానిత వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డా.చదలవాడ దంపతులు...




**కాకతీయ నరసరావుపేట:** మంత్రాలయ శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు,ఆయన సతీమణి సుధ రాజేశ్వరితో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠాధికారులు ఎమ్మెల్యే డా.చదలవాడ దంపతులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి,స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే డా. చదలవాడ రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు తీసుకుని ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మఠ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# సెయింట్ ఆన్స్‌లో ఘనంగా "గ్రాడ్యుయేషన్ డే" సెర్మని



**మాచర్ల కాకతీయ మార్చి 07:** స్థానిక సాగర్ రోడ్డు సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపాల్ సిస్టర్ తుమ్మ సుజాత ఆధ్వర్యంలో శనివారం "గ్రాడ్యుయేషన్ డే" ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ అల్లి సురేష్, ఫాదర్ బాలశౌరి, సిస్టర్లు ఇన్నమ్మ, అనిత, సిల్వియా, శ్వేత హాజరై జ్యోతి ప్రజ్వాలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యనందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేయటం సంతోషకరమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ చాలా ముఖ్యమని, పిల్లలు మనోధైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఆయన సూచించినారు. సిస్టర్ సుజాత మాట్లాడుతూ తల్లితండ్రులు మా పై ఎంతో నమ్మకముతో మా స్కూల్ లో చేర్పించిన పిల్లలను మేము అదే రీతిలో వారికి మంచి విద్యాబుద్ధులు నేర్పించి, ఉత్తమ ఫలితాలు సాధించటంతోపాటు, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరేలా తీర్చిదిద్దనన్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఈటి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దళపతి విజయ్‌కి భార్య నుంచి మరో షాక్!

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్‌కి దెబ్బమీద దెబ్బ తగులుతోంది. సినిమాలకు గుడ్ బై చెప్పేసి రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న ఆయనపై ముప్పేట దాడి జరుగుతోంది. ఆయన నటించిన చివరి సినిమా -జన నాయగన్- జనవరి 9న రిలీజ్ కావాల్సింది. ఈ సినిమాతో రాజకీయాల్లో సంచలనం సృష్టించాలని ప్లాన్ చేసుకున్న విజయ్‌కి తీవ్ర నిరాశే ఎదురైంది. సెన్సార్ అభ్యంతరాలు చెప్పడం, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడానికి షరతులు విధించడంతో సినిమా రిలీజ్ అర్థాంతరంగా నిలిచిపోయింది. ఇదే సమయంలో విజయ్ టీవీకే పార్టీ ప్రచారంలో భాగంగా కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాట జరగడం, అందులో పిల్లలు, పెద్దలు, మహిళలు, యువకులు దాదాపుగా 40 మందికి పైగా మృతి చెందడంతో విజయ్ పొలిటికల్ ఎంట్రీ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు కావడం, భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరగడంతో సీబీఐ రంగంలోకి దిగి విచారణ చేపట్టడంతో విజయ్‌కి కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. పార్టీ జెండాపై కూడా వివాదం చెలరేగడంతో ఈ అంశం కోర్టు దాకా వెళ్లింది. హైకోర్టు తీర్పు ఇచ్చే వరకు విజయ్ పార్టీ జెండాకు ఎలాంటి ఇబ్బంది లేదు కానీ అనుకూలంగా తీర్పు రాకపోతే మాత్రం పార్టీ జెండా మార్చుకోక తప్పని పరిస్థితి. ఇదే సమయంలో విజయ్‌పై తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి తెరతీసి విజయ్‌ని ఇరుకున పెట్టాయి. త్రిష ఇంటి నుంచి విజయ్ బయటికి వస్తే బాగుంటుందని బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఇదే సమయంలో విజయ్‌పై మరో బాంబు పడింది. ఆయన భార్య సంగీత విజయ్ నుంచి విడాకులు కోరుతూ చెంగల్‌పట్టు జిల్లా ఫ్యామిలీ కోర్టుని ఆశ్రయించడం సంచలనంగా మారింది. ఒక నటితో విజయ్ వివాహేతర సంబంధమే విడాకులకు కారణమంటూ విడాకుల పిటీషన్‌లో సంగీత పేర్కొనడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. 27 ఏళ్ల వైవాహిక బంధానికి సంగీత



ముగింపు పలకడంతో కోలీవుడ్ తో పాటు దక్షిణాది అంతా షాక్‌కు గురవుతోంది. ఇంత వరకు దీనిపై విజయ్ ఎలాంటి కామెంట్ చేయకపోవడం, రీసెంట్‌గా జరిగిన ఓ వివాహ వేడుకలో త్రిషతో కలిసి పాల్గొనడంతో విడాకుల వివాదం మరింత ముదిరే అవకాశం ఉందని కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో విజయ్ వైఫ్ సంగీత తాజాగా మరో బాంబ్ పేల్చి షాక్ ఇచ్చింది. చెంగల్‌పట్టు జిల్లా ఫ్యామిలీ కోర్టులో విడాకులు కోరుతూ పిటీషన్ దాఖలు చేసి షాక్ ఇచ్చిన సంగీత తాజాగా మరో పిటీషన్ ఫైల్ చేయడం చర్చనీయాంశంగా మారింది. విడాకులు కేసు పూర్తయ్యే వరకు చెన్నై నీలంకరైలో ఉన్న ఇంట్లోనే తను ఉండేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అంతే కాకుండా ఆ ఇంట్లో తనకూ హక్కు ఉందని పిటీషన్‌లో పేర్కొని విజయ్‌కి షాక్ ఇచ్చారు. ఇప్పుడు విజయ్ పరిస్థితి ఏంటీ? దీనిపై ఇప్పటికైనా స్పందిస్తాడా? అని అంతా ఎదురు చూస్తున్నారు.

# రెండు వారాలు బాలయ్య కు నిద్రలేని రాత్రుల్లే!



నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మరో సినిమా ప్రారంభమైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైనట్లు తెలిసింది. ఎలాంటి హడావుడి లేకుండా సింపుల్ గా షూటింగ్ మొదలు పెట్టేసారు. ప్రస్తుతం హైదరాబాద్ లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన సెట్ లో నైట్ షెడ్యూల్ జరుగుతోందని తెలిసింది. ఇందులో బాలకృష్ణ పాల్గొంటున్నారు. ఆయన సహా ప్రధాన పాత్ర ధారులపై యాక్షన్ సన్నివేశాల తో పాటు , టాకీ పార్ట్ కూడా చిత్రీకరిస్తున్నారు. దాదాపు రెండు వారాల పాటు ఇదే సెట్ లో రాత్రి సమయంలోనే షూటింగ్ చేస్తారని తెలిసింది. అంటే ఈ 14 రోజులు బాలయ్యకు జాగారం తప్పదని తెలుస్తోంది. కీలక సన్నివేశాలు కావడంతోనే బాలయ్య నైట్ షెడ్యూల్ కు హాజరవుతున్నారు. సాధారణంగా స్టార్ హీరోలపై నైట్ షెడ్యూల్స్ అన్నవి చాలా రేర్గా ఉంటాయి. కొంత మంది హీరోలైతే నైట్ షెడ్యూల్స్ కు అంగీకరించారు. ఇలాంటి సమయంలో దర్శకులు అడ్జస్ అయి పనిచేయాల్సి ఉంటుంది. కానీ బాలయ్య ఆ టైపు కాదు. ఈయన పూర్తిగా దర్శకుల హీరో. సెట్ లో దర్శకుడు ఏది చెబితే అది చేసుకుంటూ వెళ్లిపోవడం బాలయ్య ప్రత్యేకత. ఓ దర్శకుడిగా అతడికి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇస్తారు. సూచనలు, సలహాలు, మధ్యలో వేలు పెట్టడం వంటి పనులు చేయరు. నైట్ షెడ్యూల్స్ బాలయ్యకు కొత్తేం కాదు. ఆయన నట ప్రస్థానంలో ఇలాంటి షెడ్యూల్స్ ఎన్నో చూసారు. బాబి తెరకెక్కించిన -డాకు మహారాజ్- చిత్రీకరణ సమయంలో కూడా బాలయ్య ఎన్నో రాత్రులు నిద్రలేకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ముఖ్యంగా క్లైమాక్స్ యాక్షన్ ఎపిసోడ్స్ , జైలుకు సంబంధించిన సన్నివేశాలను రాత్రి సమయాల్లోనే చిత్రీకరించారు. ఆ సమయంలో ఆయన ఎంత మాత్రం అసౌకర్యానికి గురి కాలేదు. ఎంచక్కా షూటింగ్ పూర్తి చేసి వచ్చారు. సినిమా కోసం రాత్రి పూట షూటింగ్ ఉన్నప్పుడు ఏ మాత్రం అలసట లేకుండా పాల్గొంటారు. బాలకృష్ణ సాధారణంగా ఉదయాన్నే నిద్రలేచి పనులు ప్రారంభించే వ్యక్తి. రాత్రి సమయాన్ని అనవసరంగా వృద్దా చేయరు. ఉంటే సినిమా సెట్స్ లో లేదా? ఇంట్లోనే ఉంటారు. ఇటీవలే బాలయ్య నటించిన -అఖండ 2- రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. భారీ అంచనాల మధ్య పాన్ ఇండియాలో ఆ సినిమా రిలీజ్ అయినా అంచనాలు అందుకోలేదు. దీంతో బాలయ్య లో సక్సెస్ దాహం పెరిగిపోతుంది. తదుపరి చిత్రాన్నివీలైనంత వేగంగా పూర్తిచేసి రిలీజ్ చేయాలనే కసి కనిపిస్తోంది. ఈ వేడిలో బాలయ్య నైట్ ఏంటి? 24 గంటలు షూట్ లో పాల్గొన్న ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

# ఉస్తాద్ భగత్ సింగ్.. అసలు సౌండ్ మొదలైంది



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా వస్తోందంటే ఆ హడావుడే వేరుగా ఉంటుంది. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పవన్ ఫ్యాన్స్ అంతా భారీ ప్రాజెక్టుల కోసం వెయిట్ చేస్తున్నారు. అయితే అందరినీ సర్ప్రైజ్ చేస్తూ 'ఉస్తాద్ భగత్ సింగ్' స్పీడ్ పెంచింది. 'గబ్బర్ సింగ్' లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత హరీష్ శంకర్, పవన్ కళ్యాణ్ కాంబినేషన్లో వస్తున్న ఈ ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు గట్టిగానే ఉన్నాయి. లేటెస్ట్ గా ఈ సినిమా నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం 'ఉస్తాద్ భగత్ సింగ్' పనులు శరవేగంగా జరుగుతున్నాయి. లేటెస్ట్ సమాచారం ప్రకారం, పవన్ కళ్యాణ్ ఈ సినిమా కోసం డబ్బింగ్ చెప్పడం ప్రారంభించారు. డబ్బింగ్ స్టూడియోలో దర్శకుడు హరీష్ శంకర్, మ్యూజిక్ డైరెక్టర్ థమన్‌తో కలిసి పవన్ ఉన్న ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. పవర్ ఫుల్ డైలాగ్స్ తో ఈసారి బాక్సాఫీస్ వద్ద సౌండ్ మామూలుగా ఉండదని ఈ ఫోటో చూస్తుంటేనే అర్థమవుతోంది. డైరెక్టర్ హరీష్ శంకర్ ఈ చిత్రాన్ని పూర్తి కమర్షియల్ హంగులతో పక్కా మాస్ ఎంటర్టైనర్‌గా తీర్చిదిద్దుతున్నారు. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా, పవన్ మార్క్ మేనరిజమ్స్ పదునైన మాటలు ఈ సినిమాలో హైలైట్ కానున్నాయి. డబ్బింగ్ పనులు మొదలయ్యాయంటే సినిమా ఆల్మోస్ట్ షూటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్‌కు రెడీగా ఉన్నట్లే. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఫుల్ స్వింగ్‌లో ఉన్నాయని చిత్ర బృందం చెబుతోంది. మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఈ సినిమాకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పాటలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, సినిమాలోని ఇంటెన్స్ సీన్లకు థమన్ తన మ్యూజిక్ తో తోడైతే థియేటర్లు దద్దరిల్లడం ఖాయం. మైత్రీ మూవీ మేకర్స్ ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డబ్బింగ్ పూర్తయ్యాక ప్రమోషన్ల డోస్ మరింత పెంచాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా, ఇతర కీలక పాత్రల్లో ప్రముఖ నటీనటులు కనిపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఈ సినిమా కోసం తీసుకున్న రెమ్యునరేషన్, ఆయన వర్కింగ్ స్టైల్ గురించి ఇప్పటికే రకరకాల వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఏదేమైనా పవన్ మళ్ళీ పోలీస్ డ్రెస్ వేసి స్క్రీన్ మీద కనిపిస్తే వచ్చే కిక్కే వేరు. దేవి శ్రీ ప్రసాద్ థమన్ వంటి హేమాహేమీలు ఈ ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తుండటం విశేషం. ఇక 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 19న ఉగాది పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. లాంగ్ వీకెండ్ అడ్వాంటేజ్‌తో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ అందుకునే అవకాశం ఉంది. పవన్ కళ్యాణ్ తన పొలిటికల్ బిజీలో కూడా సినిమాల కోసం టైమ్ కేటాయించి డబ్బింగ్ పూర్తి చేస్తుండటంతో ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీగా ఉన్నారు. మరి ఉగాది రేసులో పవర్ స్టార్ ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తారో చూడాలి.

# మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్.. 'స్పెషల్' విన్నర్స్ వీరే..!

తెలంగాణ ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా 'గద్దర్ చలనచిత్ర అవార్డుల'ను ఘనంగా ప్రకటించింది. దాదాపు 40 విభాగాల్లో ఈ పురస్కారాలను అందజేయనున్నారు. సినిమా రంగంలోని వివిధ శాఖల్లో విశేష కృషి చేసిన కళాకారులను గుర్తించి ఈ అవార్డులను అందజేయనున్నారు. కేవలం రాష్ట్రస్థాయి అవార్డులే కాకుండా, అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి పురస్కారాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. 2025 సంవత్సరానికి గానూ గౌరవప్రదమైన 'ఎన్టీఆర్ నేషనల్ అవార్డు' మెగాస్టార్ చిరంజీవిని వరించింది. తెలుగు సినిమా రంగానికి చిరంజీవి చేసిన సేవకుగాను ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. అలాగే ప్రముఖ నిర్మాత అశ్వినీదత్‌కు 'నాగిరెడ్డి చక్రపాణి పురస్కారం' దక్కింది. లోకనాయకుడు కమల్ హాసన్ కు 'పైడి జయరాజ్ అవార్డు'ను ప్రకటించగా, అలనాటి సహజ నటి జయసుధకు 'అక్కినేని నాగేశ్వర రావు ఫిల్మ్ అవార్డు' దక్కింది. ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ 'సినారె పురస్కారం' అందుకోనున్నారు. మరికొన్ని కీలక విభాగాల్లో.. పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తికి 'కాంతారావు అవార్డు', దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుకు 'బి.ఎన్.రెడ్డి అవార్డు', ప్రసాద్ ల్యాబ్స్ అధినేత రమేష్ ప్రసాద్‌కు 'రఘుపతి వెంకయ్య అవార్డు' లభించాయి. ఉగాది పర్వదినం సందర్భంగా మార్చి 19న ఈ అవార్డుల ప్రధానోత్సవం వైభవంగా జరగనుంది. ఈ అవార్డుల ప్రకటనతో అటు మెగా అభిమానులతో పాటు సినీ వర్గాల్లోనూ హర్షం వ్యక్తమవుతోంది.



# కాజల్ రేంజ్ కు ఇది అవసరమా?

హీరోయిన్లు సాధారణంగా షాపింగ్ మాల్స్ ఓపెనింగ్స్ తోపాటు లోకల్ బిజినెస్ ల ఇనాగరేషన్స్ లో పాల్గొనడం కామన్. చాలా మంది హీరోయిన్లు ఆ ట్రెండ్ ను ఫాలో అవుతూ వస్తున్నారు. కానీ ఇప్పుడు అలా పాల్గొన్న టాలీవుడ్ చందమామ, బ్యూటీ కాజల్ అగర్వాల్ చేసిన ఓ రీల్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. దీంతో అనేక మంది నెటిజన్లు, సినీ ప్రియులు, అభిమానులు రెస్పాండ్ అవుతున్నారు. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో ఒకప్పుడు అత్యధిక క్రేజ్ ఉన్న హీరోయిన్లలో కాజల్ అగర్వాల్ కూడా ఒకరు. అనేక స్టార్ హీరోల సరసన నటించి వరుస హిట్స్ అందుకున్న ఆమెకు ఇప్పటికీ ఆడియన్స్ లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే ఇటీవల సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్న కాజల్ అగర్వాల్, పలు ఈవెంట్లు, బ్రాండ్ ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటూ అభిమానులను అలరిస్తున్నారు. తాజాగా జరిగిన ఒక మండి రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి కాజల్ అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ ఉప్పల్ బాలు కూడా పాల్గొన్నాడు. దీంతో అతడు.. కాజల్ తో మాట్లాడి.. ఆ తర్వాత ఒక రీల్ చేశాడు. ఆ వీడియోలో ఉప్పల్ బాలు ఉత్సాహంగా మాట్లాడుతూ కాజల్ తో సరదాగా రీల్ చేయగా, ఆమె కూడా అతని స్టెప్స్ కు రెస్పాండ్ అయింది. ఆ రీల్ ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. ఫుల్ వైరల్ గా మారింది. దీంతో అభిమానులు, నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. కొందరు కాజల్ అగర్వాల్ ను పబ్లిక్ ఈవెంట్లలో చూసి ఆనందం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం విమర్శలు చేస్తున్నారు.

# మాచర్లలో రోడ్ల విస్తరణ పేరిట చిరు వ్యాపారుల ఉపాధిపై కొడవలి చేతి వృత్తిదారులైన పేదల జీవనం అస్తవ్యస్తం





**కాకతీయ మాచర్ల మార్చి 7**

పట్టణంలో చేపడుతున్న రోడ్ల విస్తరణ పనులు అభివృద్ధి పేరుతో ముందుకు సాగుతున్నప్పటికీ, అదే సమయంలో వందలాది మంది చిరు వ్యాపారులు, చేతి వృత్తిదారుల జీవితాలను అంధకారంలోకి నెట్టుతున్నాయి. రోడ్ల ఇరుప్రక్కల చిన్న చిన్న దుకాణాలు, బండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు ఒక్కసారిగా ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొంది.

తరతరాలుగా టీ బండ్లు, కూరగాయల వ్యాపారం, పండ్ల అమ్మకం, చెప్పులు కుట్టడం, ఇనుప పనులు, కుట్టుమిషన్ వంటి చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు ఇప్పుడు రోడ్డున పడే స్థితికి చేరుకున్నారు. ముందస్తు సమాచారం లేకుండా, ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా షాపులు తొలగించడంతో వారి కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

రోజువారీ సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఈ చిరు వ్యాపారులకు ఉపాధి నిలిచిపోవడం అంటే ఆకలి చావులకు దారి తీసే పరిస్థితి. పిల్లల చదువులు, అద్దె ఇళ్లు, అప్పులు – అన్నీ ఒకేసారి భారంగా మారాయి. నిఅభివృద్ధి కావాలి, కానీ మా బతుకులు బలికావాలా?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

పాలకులు, అధికారులు అభివృద్ధితో పాటు మానవీయ కోణాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. తొలగింపులకు ముందు పునరావాసం, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు, వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే అభివృద్ధి పేరుతో పేదల జీవితాలు ధ్వంసమవుతాయని ఆవేదన వ్యక్తమవుతోంది.

### రోడ్ల విస్తరణ అభివృద్ధి పేరు చెప్పి వీధి విక్రయదారుల జీవనోపాధి ప్రమాదంలో

చట్టాలు ఉన్నా అమలు ఎక్కడ? రోజువారీ సంపాదనపై ఆధారపడే వేలాది కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకం.. దేశవ్యాప్తంగా నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ రహదారులు, పట్టణ ప్రధాన రోడ్లువిస్తరించబడుతున్నాయి అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ పనులు నగరాలకు కొత్త రూపు ఇస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి వెనుక మరో వాస్తవం కూడా దాగి ఉంది. రోడ్ల పక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ రోజువారీ సంపాదనతో జీవించే వేలాది వీధి విక్రయదారుల జీవితం ఒక్కసారిగా సంక్షోభంలో పడుతోంది. ఒక చాయ్ దుకాణం, ఒక పండ్ల బండి, ఒక కూరగాయల తాటు, చిన్నపాటి అల్పాహార స్టాల్... ఇవి కేవలం వ్యాపారాలు మాత్రమే కావు. ఇవి అనేక కుటుంబాల జీవనాధారం. ఉదయం నుండి సాయంత్రం వరకు కష్టపడి సంపాదించిన కొద్దిపాటి డబ్బుతోనే వారి కుటుంబాలు జీవనం సాగిస్తాయి. అయితే రోడ్ల విస్తరణ పనులు ప్రారంభమైనప్పుడు మొదటగా ప్రభావం పడేది ఈ చిన్న వ్యాపారులపైనే.

### అభివృద్ధి ప్రాజెక్టులు ఉపాధి కోల్పోతున్న చిన్న వ్యాపారులు

జాతీయ రహదారుల విస్తరణ లేదా పట్టణాల్లో ప్రధాన రోడ్ల విస్తరణ జరిగే సమయంలో రోడ్డు పక్కన ఉన్న వీధి విక్రయదారులను తొలగించే పరిస్థితి ఏర్పడుతుంది. చాలా సందర్భాల్లో పనులు పూర్తయ్యే వరకు ఆ ప్రాంతంలో వ్యాపారం చేయడానికి అవకాశం ఉండదు. కొన్ని చోట్ల ఈ పనులు ఆరు నెలలు, కొన్ని చోట్ల ఒక సంవత్సరం వరకు కూడా సాగుతాయి.

రోజువారీ సంపాదనపై ఆధారపడే ఈ వ్యాపారులకు ఆ సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోతే వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడతాయి. పిల్లల చదువు, ఇంటి అద్దె, వైద్య ఖర్చులు వంటి అవసరాలు తీర్చడం కూడా కష్టమవుతుంది.

### వీధి విక్రయదారుల హక్కుల కోసం ప్రత్యేక చట్టం

ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల (జీవనోపాధి రక్షణ మరియు వీధి విక్రయాల నియంత్రణ) చట్టం,2014 అనే చట్టాన్ని అమలు చేసింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశం వీధి విక్రయదారుల జీవనోపాధిని రక్షించడం మరియు వారి వ్యాపారాన్ని నియంత్రిత విధానంలో కొనసాగించేందుకు సహాయం చేయడం. ఈ చట్టం ప్రకారం ప్రతి నగరంలో లేదా పట్టణంలో పట్టణ వెండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ ద్వారా నగరంలో ఉన్న అన్ని వీధి విక్రయదారులపై సర్వే నిర్వహించాలి. ఆ తరువాత గుర్తింపు పొందిన వారికి వ్యాపారం చేసే హక్కును గుర్తిస్తూ నిసర్టిఫికేట్ ఆఫ్ వెండింగ్" ఇవ్వాలి.

### చట్టం చెప్పే ముఖ్యమైన మార్గదర్శకాలు

రోడ్లు విస్తరించడం లేదా పబ్లిక్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి సందర్భాల్లో వీధి విక్రయదారులపై చర్యలు తీసుకునే ముందు ప్రభుత్వం మరియు మున్సిపాలిటీలు కొన్ని ముఖ్యమైన విధానాలను పాటించాల్సి ఉంటుంది.

### ముందుగా వీధి విక్రయదారులపై పూర్తి సర్వే నిర్వహించాలి

- గుర్తింపు పొందిన వారికి సర్టిఫికేట్ ఇవ్వాలి
- నగరంలో వెండింగ్ జోన్లు గుర్తించాలి
- కనీసం 30 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వాలి
- ప్రత్యామ్నాయ వ్యాపార స్థలం కల్పించాలి
- పట్టణ వెండింగ్ కమిటీ సిఫార్సులు తీసుకోవాలి

ఈ చర్యలు పూర్తయ్యాక మాత్రమే వీధి విక్రయదారులను అక్కడి నుంచి తొలగించవచ్చు.

### సుప్రీంకోర్టు కూడా గుర్తించిన జీవనోపాధి హక్కు

వీధి విక్రయదారుల హక్కుల విషయంలో భారత సుప్రీంకోర్టు పలు కీలక తీర్పులు ఇచ్చింది. ఓల్గా టెల్లిస్ వం బాంబే మున్సిపల్ కార్పొరేషన్ (1985) కేసులో సుప్రీంకోర్టు ఒక ముఖ్యమైన సూత్రాన్ని ప్రకటించింది. జీవనోపాధి హక్కు కూడా జీవించే హక్కులో భాగమని పేర్కొంది. ఈ హక్కుభారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఎ ద్వారారక్షించబడుతుందని కోర్టు స్పష్టం చేసింది. అదే విధంగా సోదన్ సింగ్ వం న్యూ ఢిల్లీ మున్సిపల్ కమిటీ (1989) కేసులో వీధి విక్రయదారులకు వ్యాపారం చేసే హక్కు ఉందని పేర్కొంది. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(జి). కింద రక్షణ పొందుతుందని చెప్పింది. ఇంకా గైందా రామ్ వం మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (2010)మరియు మహారాష్ట్ర ఏక్తా హాకర్స్ యూనియన్ వం మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ ముంబై (2013) కేసుల్లో విక్రేతలు పై సర్వే చేయకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బలవంతంగా తొలగించరాదని కోర్టు ఆదేశించింది.

### అభివృద్ధి మానవీయ దృష్టికోణం అవసరం

అభివృద్ధి అనేది సమాజానికి అవసరమే. రోడ్లు విస్తరించాలి, ట్రాఫిక్ సమస్యలు తగ్గాలి, నగరాలు ఆధునికంగా మారాలి. కానీ అదే సమయంలో ఈ అభివృద్ధి వల్ల ఎవరి జీవనోపాధి ప్రమాదంలో పడకూడదు. రోడ్ల పక్కన బండి పెట్టి వ్యాపారం చేసే వ్యక్తి కూడా ఈ సమాజంలో ఒక భాగమే. అతని కుటుంబం కూడా ఈ దేశ ఆర్థిక వ్యవస్థలో భాగమే. అతని జీవితం కూడా అంతే విలువైనదే.

### తాత్కాలిక ఏర్పాట్లు అవసరం

రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో మున్సిపాలిటీలు మరియు సంబంధిత సంస్థలు కొన్ని చర్యలు తీసుకోవడం అవసరం.

- తాత్కాలిక వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయడం
- చిన్న మార్కెట్ స్థలాలు కల్పించడం
- షెల్టర్లు లేదా స్టాల్స్ ఏర్పాటు చేయడం
- ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించడం

ఈ చర్యలు తీసుకుంటే వేలాది కుటుంబాలు ఆర్థికంగా కాపాడబడతాయి.


### ఒక చిన్న వ్యాపారి కథ వేలాది కుటుంబాల వాస్తవం

ఉదయం ఐదు గంటలకు లేచి మార్కెట్ కు వెళ్లి కూరగాయలు తెచ్చే ఒక చిన్న వ్యాపారి. మధ్యాహ్నం వరకు ఎండలో నిలబడి వాటిని అమ్మే ప్రయత్నం చేస్తాడు. రోజంతా కష్టపడి సంపాదించిన రెండు మూడు వందల రూపాయలతో ఇంటికి తిరిగి వస్తాడు. అదే డబ్బుతో పిల్లల చదువు, ఇంటి అద్దె, కుటుంబ ఖర్చులు అన్నీ నిర్వహించాలి. ఒక రోజు రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయని చెప్పి అతన్ని అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెబితే... అతని జీవితం ఒక్కసారిగా అంధకారంలో పడిపోతుంది.

### అభివృద్ధి అంటే అందరికీ ప్రయోజనం కలిగించాలి

నగరాల అభివృద్ధి అనేది కేవలం రోడ్లు, భవనాలు, వంతెనలతో మాత్రమే కాదు. సమాజంలోని ప్రతి వ్యక్తి జీవనోపాధిని కాపాడుతూ జరిగితేనే అది నిజమైన అభివృద్ధి అవుతుంది. చట్టాలు ఉన్నప్పటికీ వాటిని కచ్చితంగా అమలు చేయడం అత్యంత అవసరం. రోడ్లు విస్తరించడమే కాదు, ఆ రోడ్ల పక్కన జీవించే చిన్న వ్యాపారుల భవిష్యత్తు కూడా రక్షించబడాలి. అభివృద్ధి పేరు చెప్పి వారి జీవనోపాధి కోల్పోతే అది కేవలం ఒక ప్రాజెక్ట్ సమస్య కాదు. అది సమాజం మొత్తం ఎదుర్కోవాల్సిన మానవీయ సమస్య. వీధి విక్రయదారుల జీవితాలు కూడా విలువైనవే. వారి కన్నీళ్లు కూడా ఈ అభివృద్ధి కథలో భాగమే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చిరు వ్యాపారులు, చేతి వృత్తిదారుల భద్రతకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అంటున్నారు.

# వెంకటేష్ మూవీ కోసం హీరోయిన్ ఫిక్స్.. అనిల్ రావిపూడి సెలక్షన్ ఎవరంటే..?



స్టార్ హీరో విక్టరీ వెంకటేష్ మరియు సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో 5వ సినిమాకు రంగం సిద్ధమైంది. 'ఫ్2', 'ఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి చిత్రాల తర్వాత వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు వెంకటేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ప్రస్తుతం అనిల్ రావిపూడి స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉండగా, ఈ సినిమాలో నందమూరి కళ్యాణ్ రామ్ ఒక కీలక పాత్రలో నటించబోతుండటం విశేషం. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన హీరోయిన్‌గా 'మహానటి' ఫేం కీర్తి సురేష్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమె ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు సమాచారం. ఇక కళ్యాణ్ రామ్ జోడీగా నటించే హీరోయిన్ కోసం అన్వేషణ సాగుతోంది. ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌కు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నాడు. షైన్ స్క్రీన్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం వెంకీ నటిస్తున్న సినిమా పూర్తికాగానే, జూన్ నుంచి ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది. సంక్రాంతి సెంటిమెంట్‌ను ఫాలో అవుతూ, ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అనిల్ రావిపూడి మార్కు కామెడీకి తోడు, వెంకటేష్ -- కళ్యాణ్ రామ్ కాంబినేషన్ ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తోంది.

# 'ఆదర్శ కుటుంబం' కోసం కలిసొచ్చే రూట్‌లోకి త్రివిక్రమ్..?





స్టార్ హీర విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా ప్రస్తుతం సైలెంట్ గా షూటింగ్ జరుపుకుంటోంది. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఎక్కడా బ్రేకులు లేకుండా పక్కా ప్లానింగ్‌తో పూర్తి చేస్తున్నారు. అక్టోబర్ 2న విడుదలే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వేసవి నుంచే ప్రమోషనల్ అప్డేట్స్ మొదలుపెట్టాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. టైటిల్ సాఫ్ట్‌గా ఉన్నప్పటికీ, ఇందులో వింటేజ్ త్రివిక్రమ్ మార్క్ ఫన్‌తో పాటు సాలిడ్ యాక్షన్ కూడా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ సినిమా కథా గమనం గురించి వినిపిస్తున్న ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇంటర్వెల్ వరకు 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' తరహాలో ఎంటర్‌టైనింగ్‌గా సాగి, ఒక్కసారిగా 'అతడు' లెవల్ యాక్షన్ మోడ్‌లోకి మారుతుందట. టైటిల్ కింద ఉన్న ాఖ 47 క్యాప్షన్‌కు తగ్గట్టుగానే సెకండ్ హాఫ్ ఉండబోతోందని తెలుస్తోంది. 'గుంటూరు కారం' ఫలితాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈసారి 'అల వైకుంఠపురములో' ప్లస్ 'అతడు' మిక్సింగ్‌కు వెంకీ టైమింగ్‌ను జోడించి ఒక పర్ఫెక్ట్ అవుట్‌పుట్‌ను త్రివిక్రమ్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. త్రివిక్రమ్ కెరీర్‌కు కూడా ఈ సినిమా విజయం అత్యంత కీలకం. దీని తర్వాత ఆయన చేయబోయే భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ బజ్ పెరగాలంటే 'ఆదర్శ కుటుంబం' బ్లాక్ బస్టర్ అవ్వాల్సిందే. మే నెలలో ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆ తదుపరి ప్రాజెక్ట్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఓటీటీలోకి వచ్చేస్తున్న 'నవాబ్స్ కేఫ్'.. స్ట్రీమింగ్ ఎందులో, ఎప్పుడు అంటే..?




టాలీవుడ్‌లో ఇటీవల రిలీజ్ అయిన యూత్‌ఫుల్ డ్రామా 'నవాబ్స్ కేఫ్' రిలీజ్‌కు ముందు మంచి బజ్ క్రియేట్ చేసింది. శివ కందుకూరి, తేజు అశ్విని, రాజీవ్ కనకాల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఫిబ్రవరిలో థియేటర్లలో విడుదలై యావరేజ్ చిత్రంగా నిలిచింది. ఇక ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్‌కు రెడీ అయ్యింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్'లో మార్చి 12వ తేదీ నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు ప్రమోద్ హర్ష ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. పాతబస్తీలోని ఒక పురాతన కేఫ్‌ను దేవాలయంగా భావించే తండ్రి.. ఆ కేఫ్‌ను అమ్మేసి అమెరికా వెళ్లి సెటిల్ అవ్వాలనుకునే కొడుకు మధ్య సాగే ఘర్షణే ఈ సినిమా కథ. ఇక ఈ సినిమాలో రాజీవ్ కనకాల నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మరి ఈ 'నవాబ్స్ కేఫ్' ఓటీటీలో ఎలాంటి రిజల్ట్‌ను అందుకుంటుందో చూడాలి.

# టాప్ స్టోరి: సవాళ్ల ఎదురైనా హుందాతనంలో తగ్గరు



సినిమా పరిశ్రమలో గ్లామర్ ఎంత ఉంటుందో తెర వెనుక అంతకు మించిన సవాళ్లు కూడా ఎదురవుతాయి. ముఖ్యంగా ఇంటర్వ్యూలలో లేదా బహిరంగ వేదికలపై స్టార్ హీరోలు ఒక్కోసారి సరదాగానో లేక కావాలనో చేసే వ్యాఖ్యలు కథానాయికలకు ఇబ్బంది కలిగిస్తుంటాయి. అయితే అలాంటి క్లిష్ట సమయాల్లో కూడా ఏమాత్రం తొణకకుండా, అపారమైన ఆత్మవిశ్వాసంతో ఎదురుదాడి చేయకుండానే హుందాగా సమాధానాలిచ్చిన కొందరు నటీమణులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. ముఖ్యంగా కత్రినా కైఫ్ గురించి చెప్పుకోవాలి. రీసెంట్‌గా వైరల్ అవుతున్న వీడియోల్లో ముగ్గురు ఖాన్‌లు (సల్మాన్, షారుఖ్, అమీర్) తనను ఆటపట్టిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేసినా ఏమాత్రం సహనం కోల్పోలేదు. తనపై వచ్చే సెటైర్లను చాలా స్మార్ట్‌గా, వివేకంతో కూడిన సమాధానాలతో తిప్పికొడుతూ తనేంటో నిరూపించుకున్నారు. ఎదుటివారు తక్కువ చేసి మాట్లాడాలని చూసినా.. తన నవ్వుతోనే ఎదుటివారిని చిత్తు చేసే నేర్పు కత్రినా సొంతం. ఇక సీనియర్ నటి -రేవతి- స్టైలే వేరు. ఆమె ఎప్పుడూ తన మేధస్సుతో, ఆత్మవిశ్వాసంతో కూడిన సమాధానాలతో ఎదుటివారికి గౌరవం తగ్గకుండానే చురకలు వేస్తారు. ఎవరైనా తన నటనను లేదా వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా మాట్లాడితే.. ఆమె గొంతు పెంచకుండానే తన తార్కిక సమాధానాలతో నోరు మూయిస్తారు. తన హుందాతనాన్ని ఎప్పుడూ పణంగా పెట్టకుండా సమాజం.. సినిమా విషయంలో తనకున్న అవగాహనతో రేవతి ఇచ్చే జవాబులు ఇప్పటికీ స్ఫూర్తిదాయకం. సీనియర్ నటి రాధిక శరత్ కుమార్ కూడా ఇదే కోవలోకి వస్తారు. సుదీర్ఘ కెరీర్‌లో ఈ నటి ఎంతోమంది స్టార్ హీరోలతో కలిసి పనిచేశారు. ఇంటర్వ్యూలలో హీరోలు ఆమెను డామినేట్ చేయాలని చూసినా, తనదైన బాడీ లాంగ్వేజ్‌తో .. కాన్ఫిడెన్స్‌తో ఆ పరిస్థితులను చక్కదిద్దుతారు. ఎదుటివారికి చిన్నచూపు చూసే అవకాశం ఇవ్వకుండా, తన అనుభవాన్ని , ప్రతిభను ఆయుధంగా మలచుకుని సమాధానాలు ఇవ్వడం రాధిక ప్రత్యేకత. నేటి తరం నటీమణులలో వరలక్ష్మి శరత్ కుమార్ తన బోల్డ్ , స్ట్రెట్ ఫార్వర్డ్ స్వభావానికి పెట్టింది పేరు. తనపై వచ్చే బాడీ షేమింగ్ కామెంట్లు లేదా సినీ బ్యాక్‌గ్రౌండ్ గురించిన విమర్శలకు ఆమె సూటిగా, ఆత్మవిశ్వాసంతో సమాధానాలిస్తారు. ఎవరైనా తనను చిన్నచూపు చూడాలని ప్రయత్నిస్తే.. ఏమాత్రం భయం లేకుండా పాయింట్ టు పాయింట్ మాట్లాడుతూ.. తన హుందాతనాన్ని కాపాడుకుంటారు. వరూ మాటల్లో ఉండే స్పష్టత తోటి నటీమణులకు ఎంతో ధైర్యాన్నిస్తుంది. అనుష్క శెట్టి కూడా ఇలాంటి సందర్భాల్లో ఎంతో నిబ్బరంగా వ్యవహరిస్తారు. స్టార్ హీరోలు సరదాగా చేసే కొన్ని కామెంట్లను హుందాగా తీసుకుంటూనే.. తన గౌరవానికి భంగం కలగకుండా సంభాషణను మలుపు తిప్పడంలో స్వీటీ సిద్ధహస్తురాలు. ఈ ఐదుగురు నటీమణులు నిరూపించింది ఒక్కటే.. ఎదుటివారు మనల్ని ఎలా చూస్తున్నారనేది ముఖ్యం కాదు.. మనల్ని మనం ఎంత గౌరవించుకుంటున్నాం.. ఆత్మవిశ్వాసంతో ఎలా సమాధానమిస్తున్నాం అనేదే ముఖ్యం.

Printed, Published & Owned by **Mandalapu Benarji Naddh** and Printed at Raghava Printers, N.T.R. journalist Colony, Near Dakshnya, J.K.C. College Road,GUNTUR,and Published at N.T.R. journalist Colony, Near Dakshnya, J.K.C. College Road,GUNTUR, Editor.: Mandalapu Benarji Naddh

కాకతీయ
కడప
5
8 ఆదివారం
మార్చి
2026

## ఘనంగా,అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నందలూరు (కాకతీయ) మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం పెనగలూరు హైస్కూల్లో ఎస్టియు రాష్ట్ర కార్యదర్శి అల్లం అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లం మహేశ్వర నాయుడు అధ్యక్షతన ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించినారు, ఈ సందర్భంగా అల్లం అశోక్ మాట్లాడుతూ అతి తక్కువ వేతనం తీసుకుని,అంకితభావంతో సమర్థవంతంగా పాఠశాలలో ఆయాలుగా విధులను నిర్వహిస్తున్న విజయమ్మ, సునీతమ్మలను పట్టు శాలువాతో సత్కరించి స్వీట్ బాక్సులుఅందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో హై స్కూలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కలలు కనండి సాధనతో సాకారం చేసుకోండి

## - లయన్ డాక్టర్ విజయకుమార్





**రాజంపేట (కాకతీయ) మార్చి 7:**
కలలు కనండి సాధన తో సా కారం చేసుకోండిఅని లయన్ డాక్టర్ విజయ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ హై స్కూల్ లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న లయన్ డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు సాధనతో మంచి మార్కులు సాధించుకొని ఉన్నత స్థితి కి చేరుకోవచ్చని మేమంతా అలా వచ్చిన వాళ్ళమే అని అన్నారు.దాతలు అతి కారి కృష్ణ.. వేంగిపురం వాసు. వెంకటసుబ్బయ్య ల సహకారం తో రాజంపేట లోని అన్ని పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష మెటీరియల్ అందించామని అన్నారు.. ఈ కార్యక్రమం లో రాజంపేట పట్టణ లయన్స్ క్లబ్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మినారాయణ, సెక్రెటరీ సింగంశెట్టి కృష్ణ కుమార్, కోశాధికారి సుబ్బనరసింహ. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు .డాక్టర్ బాలరాజు, దంత వైద్యులు డాక్టర్ దగ్గుపాటి నవీన్, మాజీ అధ్యక్షులు గీతాంజలి అధినేత రమణ,షేక్ అబ్దుల్లా,పేర ము వెంకటసుబ్బయ్య, సంగరాజు నరసింహ రాజు , రాజశేఖర్ నాయక్ .హెడ్ మాస్టర్ శివరామి రెడ్డి తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొని స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని విద్యార్థినీ విద్యార్థులకు అందించారు.





# విద్యతోనే మెరుగైన సమాజం

## రాజు హై స్కూల్ సీఈఓ గుంటిమడుగు రఘురామరాజు

రాజంపేట కాకతీయ మార్చి 7 :



విద్యతోనే మెరుగైన సమాజం సాధ్యం కాగలదని రాజు హై స్కూల్ సీఈఓ గుంటిమడుగు రఘురామరాజు, హెచ్ఎం మోహన్ రెడ్డి, సెంట్రల్ సిఈఓ అనిత, అకడమిక్ ఇంచార్జ్ హబీబ్ తెలిపారు. రాజంపేట పట్టణంలోని రాజు హై స్కూల్ మెయిన్ బ్రాంచ్ లో శనివారం కాన్వికేషన్ డే ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటిమడుగు రఘురామరాజు, మోహన్ రెడ్డి, అనిత, హబీబ్ మాట్లాడుతూ రాజు విద్యా సంస్థల్లో ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించుకుంటూ వస్తామని, అందువల్ల తమ విద్యా సంస్థల్లో ప్రాథమిక విద్య నుంచి చదివే విద్యార్థులు పై తరగతులకు వచ్చాక ఎలాంటి పోటీ పరీక్షల్లో అయినా ప్రతిభ చూపుతూ ర్యాంకులు ర్యాంకులు సాధిస్తారని తెలిపారు. తలిదండ్రులు కూడా తమ పిల్లలకు ప్రాథమిక విద్య నుంచే మెరుగైన వైద్య అందించాలని తెలిపారు. అప్పుడే పిల్లలు తల్లిదండ్రుల కలను సాకారం చేయగలరని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, నాగమణి, నాగజ్యోతి, రాజేశ్వరి, అపర్ణ, ఫర్హానా, సోనీ పాల్గొన్నారు.

# రెండో రోజు మోకాళ్ళ పైన మున్సిపల్ కార్మికులు నిరసన



రాజంపేట (కాకతీయ) మార్చి 7: రాజంపేట మున్సిపల్ ఆఫీస్ వద్ద రెండో రోజు మున్సిపల్ కార్మికులు మోకాళ్ళ పైన నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మా పైన జాలి లేదా మేము ఎస్సీ ఎస్టీ బీసీ కులాలకు చెందిన వారు నిరుపేదలం మాపైన దయచూపి మా కనీస వేతనం జీతాలు పెంచాలని మేం కోరుతున్నాం అని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయని మురికి కాలువలు శుభ్రం చేయడము దుమ్ము ఎండాకాలం వేడి ఎక్కువ కావడం వల్ల ఆరోగ్యాలు క్షీణించే పరిస్థితిలు ఉన్నాయి కాబట్టి ప్రభుత్వం మెడికల్ సంబంధించినటువంటి భీమాను మా కల్పించి 5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించాలని ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసి మమ్మల్ని కాపాడాలని కోరుచున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ పీవీ రమణ,మున్సిపల్ కార్మికులు మధుబాబు, సురేషు, కళ్యాణ్, కోదండన్, రవిశంకర్, ప్రసాదు, రమణ పాల్గొన్నారు.

## శ్రీ కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేగంగా అభివృద్ధి పనులు

**నందలూరు (కాకతీయ) మార్చి 7:**
ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 26న ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు, అవసరమైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు టిటిడి చర్యలు చేపట్టింది. టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం. రవిచంద్ర సూచనల మేరకు టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని టిటిడి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మసకబారిన వాహనాలకు పాలిషింగ్ చేయడం, అభిషేకం పీఠం, తాండ్లు తదితర వస్తువులకు బ్రాస్ లైనింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గజ వాహనానికి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ఈసారి వేసవి తీవ్రత అధికంగా ఉండనున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయం చుట్టుపక్కల వీధుల్లో కూల్ పెయింటింగ్ వేయాలని సూచించారు. అలాగే భక్తులకు తాగునీటి సౌకర్యం మెరుగుపరచేందుకు ఆర్.ఓ. వాటర్ ప్లాంట్లు మరియు కూలర్ల నిర్వహణ పనులు చేపట్టాలని తెలిపారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో ఉన్న వాష్‌రూమ్స్ , టాయిలెట్స్‌లో అవసరమైన ట్యాపులు, తలుపులు, కమోడ్లకు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే యాగశాలను అందంగా, శాస్త్రీయంగా ఉండే విధంగా అభివృద్ధి చేయాలని కోరారు. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందే అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని టిటిడి జేఈవో అధికారులను ఆదేశించారు.

## నేడు నందలూరు లో ఉచిత మెగా వైద్య శిబిరం

**నందలూరు (కాకతీయ) మార్చి 7:**
నేడు నందలూరు మండలంలోని,శ్రీనివాస హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస రావు ఆధ్వర్యంలోమండల కేంద్రమైన నందలూరు లోని డాక్టర్ పి.వి.నరసింహారావు హాస్పిటల్ లో ఆదివారం శ్రీ శ్రీనివాస హాస్పిటల్ ఆధ్వర్యంలో "ఉచిత మెగా వైద్య శిబిరం" నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ చైర్మన్, ప్రముఖ కిడ్నీ వ్యాధుల నిపుణులు డాక్టర్ బైన శ్రీనివాస రావు ఒక ప్రకటనలోతెలిపారు.మెగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ శిబిరంలోబిపి,షుగర్,ఈసీజీ వైద్య పరీక్షలు ఉచితంగా,చేస్తామన్నారు.గుండె,కిడ్నీ, ఆర్థోపెడిక్,దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ఉచితంగా ఓ.పి. చూడబడుతుందన్నారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా ఇస్తామన్నారు.తనతో పాటు ప్రముఖ గుండె వ్యాధుల నిపుణురాలు డాక్టర్ అంపాబత్తిని గౌరి శిబిరానికి విచ్చేసే వారిని ఉచితంగా పరీక్షించి తగు వైద్య,సలహాలు,సూచనలు అందిస్తారన్నారు. సామాజిక సేవా దృక్పథంతో జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలను తాము నిర్వహిస్తున్నట్లు వివరించారు. సామాన్య,మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత సర్జరీలు చేస్తామని తెలిపారు.ఈ అవకాశాన్ని నందలూరు పరిసరప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మనవి చేశారు, తమ పేర్లునమోదు చేసుకొనుట కొరకు కొరకు 9505046850 అనే నెంబర్ ను సంప్రదించాలని కోరారు

## నేడు లక్ష్మీ నృసింహ స్వామి వార్షిక తిరునాళ్లు

**సంతమాగులూరు(కాకతీయ):**



ఏల్చూరు గ్రామంలోని కొండపై స్వయంభువుగా వేంచేసియున్న శ్రీ రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీ నృసింహ స్వామి, కొండ దిగువన కొలువైన శ్రీ బాలాంజనేయ స్వామి వార్ల వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించన్నారు. ఆలయ అర్చకులు డాక్టర్ వినుకొండ శ్రీనివాసమూర్తి, నరసింహాచార్యులు, సత్యబాబు, డాక్టర్ సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో దేవతామూర్తులకు విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు జరపనున్నట్లు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా కోలాటం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, స్వామివారి దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.



## మేలు జాతి లేగ దూడల ప్రదర్శన

**గురజాల (కాకతీయ)మార్చి07:**




గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వర గ్రామంలో మేలు జాతి లేగ దూడల ప్రదర్శన శనివారం పోలు నాసర్ రెడ్డి, యెనుముల అంజిరెడ్డి, యెనుముల నారాయణరెడ్డి ,గ్రామ రైతులు ప్రారంభించారు. ఈ ప్రదర్శనకు 40 మంది రైతులకు సంబంధించిన 55 దూడలను తీసుకొని వచ్చినారు. వీటిలో మొదటి బహుమతిగా షేక్ జానీ బాషా కు సంబంధించిన దూడకు, రెండవ బహుమతి యెనుముల నారాయణరెడ్డి, దూడకు ,మూడో బహుమతి తాడికొండ రామయ్యకు, నాలుగో బహుమతి యెనుముల వెంకటరెడ్డిలు గెలుచుకున్నారు. ఈ ప్రదర్శన పశు సంవర్ధక శాఖ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. సహాయ సంచాలకులు గురజాల పశువైద్యశాల డాక్టర్ బి .సరోజా దేవి మాట్లాడుతూ కృత్రిమ గర్భాధారణ, లింగ నిర్ధారణ ,వీర్యం యొక్క ప్రయోజనాలను వివరించారు. దూడల సంరక్షణ, ఏడాదికి ఒక దూడ గురించి వివరించారు. పశుగ్రాసాల సాగు దూడలు యాజమాన్యం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లారెడ్డి తుమ్రుకోట,డాక్టర్ దీపక్, మంచి కళ్ళు, రెంటచింతల ,గురజాల మండల పశువైద్యాధికారులు, పశువైద్య సిబ్బంది, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.


## ఆరోగ్య పోషణబి ప్రకృతి వ్యవసాయం

### -జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి

**బెల్లంకొండ(కాకతీయ):**
పల్నాడు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తృతంగా అమలు అవుతోందని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి తెలిపారు. శనివారం బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామంలో ఆరోగ్య పోషణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ పంటలు, విలువ జోడింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2016లో ఐదు మండలాల్లోని 50 గ్రామాల్లో 1,000 ఎకరాల్లో ప్రకృతి



వ్యవసాయం ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం దశలవారీగా విస్తరిస్తూ ప్రస్తుతం జిల్లాలో 132 గ్రామాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుతోందని పేర్కొన్నారు. 2026--27 సంవత్సరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సహజ వ్యవసాయ జాతీయ మిషన్ కింద జిల్లాలోని 190 క్లస్టర్లలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టనున్నట్లు వివరించారు. జిల్లాలో 21,500 మంది రైతుల పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 25 ప్రకృతి వనరుల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, రాబోయే ఆరు నెలల్లో మరో 100 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి భూసారం మెరుగుపడటంతో పాటు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని, పంటల ఉత్పాదకత అధికమవుతుందని తెలిపారు. పంటలకు చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ అందజేసి, పండించిన ఉత్పత్తులకు మార్కెట్ ధరల కంటే సుమారు 15 శాతం అదనపు విలువ లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ప్రేమరాజు, జిల్లా సిబ్బంది నందకుమార్, సైదయ్య, మేరీ, అప్పలరాజు, సౌజన్య, పవన్ కుమార్, అంజలి, అనంతలక్ష్మి, వీరమ్మతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## మేలు జాతి లేగ దూడల ప్రదర్శన

**గురజాల (కాకతీయ)మార్చి07:**
గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వర గ్రామంలో మేలు జాతి లేగ దూడల ప్రదర్శన శనివారం పోలు నాసర్ రెడ్డి, యెనుముల అంజిరెడ్డి, యెనుముల నారాయణరెడ్డి ,గ్రామ రైతులు ప్రారంభించారు. ఈ ప్రదర్శనకు 40 మంది రైతులకు సంబంధించిన 55 దూడలను తీసుకొని వచ్చినారు. వీటిలో మొదటి బహుమతిగా షేక్ జానీ బాషా కు సంబంధించిన దూడకు, రెండవ బహుమతి యెనుముల నారాయణరెడ్డి, దూడకు ,మూడో బహుమతి తాడికొండ రామయ్యకు, నాలుగో బహుమతి యెనుముల వెంకటరెడ్డిలు గెలుచుకున్నారు. ఈ ప్రదర్శన పశు సంవర్ధక శాఖ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. సహాయ సంచాలకులు గురజాల పశువైద్యశాల డాక్టర్ బి .సరోజా దేవి మాట్లాడుతూ కృత్రిమ గర్భాధారణ, లింగ నిర్ధారణ ,వీర్యం యొక్క ప్రయోజనాలను వివరించారు. దూడల సంరక్షణ, ఏడాదికి ఒక దూడ గురించి వివరించారు. పశుగ్రాసాల సాగు దూడలు యాజమాన్యం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లారెడ్డి తుమ్రుకోట,డాక్టర్ దీపక్, మంచి కళ్ళు, రెంటచింతల ,గురజాల మండల పశువైద్యాధికారులు, పశువైద్య సిబ్బంది, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - ఉచిత వైద్య శిబిరాలు ప్రారంభం

## సుజాతనగర్ పీహెచ్‌సీలో వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్

**కొత్తగూడెం(కాకతీయ)మార్చి 07:**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్ వైద్యులు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు ఈ వైద్య శిబిరాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రక్తపరీక్షలు, కీళ్ల సమస్యలకు సంబంధించిన పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు వంటి ఆరోగ్య పరీక్షలను ప్రజలు చేయించుకొని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు.అవసరమైతే రోగులను కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసి అక్కడ అందుబాటులో ఉన్న అన్ని ప్రధాన పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్కానింగ్, ఎక్స్-రే వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నందున అవసరమైన వారికి అక్కడ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ..ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలను దశల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు సుజాతనగర్, జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిరోజు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చొప్పున ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాలలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, డెంటల్, ఆప్తమాలజీ








వంటి ఆరు విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శిబిరాలకు వచ్చే రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేయడంతో పాటు అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పై స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ ఉచిత వైద్య శిబిరాలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు ఈ సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, తాసిల్దార్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ రమేష్, ఎంపీడీవో భారతి సంబంధిత శాఖల అధికారులు వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త కొత్తమాసు తులసీదాస్ సతీమణి కన్నుమూత

**తెనాలి (కాకతీయ) మార్చి 07:**



తెనాలి పట్టణంలో ప్రముఖ బంగారం వ్యాపారి , మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దివంగత కొత్తమాసు తులసీదాస్ సతీమణి కొత్తమాసు శివలీల75 శుక్రవారం కన్నుమూశారు. వారి స్వగ్రామం జంపని. వ్యాపారం నిమిత్తం తెనాలి వచ్చి, అనేక ఆటు పోట్లను తట్టుకుని, బంగారం వ్యాపారంలో, రాష్ట్రంలోనే పతాక స్థాయికి చేరుకున్నారు. దయా గుణం కలిగిన కొత్తమాసు తులసీదాస్ పేదలకు అనేక రకాలుగా తన వంతు సహాయం అందించేవారు. విద్యార్థులను ప్రోత్సహించి, పేద విద్యార్థులకు సహాయ సహకారాల ద్వారా, ఉన్నత చదువులకు బాట వేసిన విద్యాదాతగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మంచితనాన్ని గుర్తించిన తెనాలి పట్టణ



ప్రజానీకం, ఆయనకు తెనాలి మున్సిపల్ చైర్మన్ గా అవకాశం కల్పించారు. పాత్రికేయులను ప్రత్యేక అభిమానంతో స్వాగతించేవారు. జర్నలిస్టులకు కాలనీ నిర్మించుకునేందుకు, దాతృత్వంతో ఆయన చేసిన సహాయం, మర్చిపోలేనిది. మున్సిపల్ చైర్మన్ గా ఆయన తెనాలి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించారు. ఆయన సతీమణి శివలీల ఆయనకు నిరంతరం వెన్నుదన్నుగా ఉండి ఆధ్యాత్మికంలోనూ,దాన గుణం లోనూ, సాటి లేని మేటి మహిళగా ఉండేవారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు.

## రోగుల సేవలపై ఎమ్మెల్యే జారే ఫోకస్...

### - దమ్మపేట పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

**దమ్మపేట(కాకతీయ)మార్చి 07 :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రి పనితీరును సమీక్షించారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నేరుగా ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే అక్కడి పరిస్థితులు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది హాజరు పట్టికలను, రికార్డులను ఎమ్మెల్యే క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, వైద్య సదుపాయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.అనంతరం ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ మణిదీప్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో వివరించాలని ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, ఇతర అవసరాలపై పూర్తి వివరాలతో ఒక నివేదికను అందజేయాలని సూచించారు.దీనికి స్పందించిన డాక్టర్ మణిదీప్ ఆసుపత్రికి అవసరమైన సదుపాయాల జాబితాతో కూడిన నివేదికను త్వరలో సిద్ధం చేసి ఎమ్మెల్యేకు అందజేస్తామని తెలిపారు.దమ్మపేట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీతో ఆసుపత్రి సిబ్బందిలో చురుకుదనం నెలకొంది.

### బాధితులకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మేచ్చా నాగేశ్వరరావు

## ఆర్థిక సహాయం అందజేత

అశ్వరావుపేట(కాకతీయ)మార్చి 07: అశ్వరావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అశ్వరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించడంతో పాటు స్థానిక నాయకులతో సమావేశమై రాజకీయ పరిస్థితులపై చర్చించారు. మొదటగా ఆయన గుమ్మడివల్లి గ్రామానికి చేరుకుని నాజర్ ఆహ్వానం మేరకు వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులతో ఆత్మీయంగా మాట్లాడి కొంతసేపు గడిపారు. గ్రామంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకలాపాలపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో పార్టీని బలోపేతం చేసేందుకు ఎలా ముందుకు సాగాలన్న దానిపై పలు సూచనలు చేశారు.అనంతరం కోయరంగాపురం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు కారం మల్లయ్య ఇల్లు అగ్నికి ఆహుతి కావడంతో సంఘటన స్థలాన్ని సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరు అయ్యేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. తరువాత నారాయణపురం గ్రామానికి వెళ్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కాటూరి నాగయ్య మేనకోడలు, బోడపాటి వెంకటమ్మ కుమార్తె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అలాగే బీఆర్ఎస్ నాయకుడు జక్కుల రాంబాబు తల్లి జక్కుల నాగమణి మరణించడంతో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కోయరంగాపురం గ్రామ సర్పంచ్ సోడెం చిన్ని గంగమ్మ, ఉప సర్పంచ్







మడివి లక్ష్మణ్, వార్డు సభ్యులు సెట్టిపల్లి కృష్ణారెడ్డి, ముత్తమ్మ, నాయకులు చందా లక్ష్మీనర్సయ్య, మిండ దుర్గారావు, మాజీ సర్పంచ్ చిచ్చోడు సీతారాములు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుర్సం వెంకటేశ్వరరావు, షేక్ అమీర్, పుట్ట సత్యం, చిమడబోయిన వెంకటేశ్వరరావు, సాయిల సత్యనారాయణ, శ్రీను, ముత్యాల రావు, హుస్సేన్, పోలిన నాగేశ్వరరావు, శంకర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## బాలికల విద్యకు పెద్ద అడుగు

### - హాస్టల్ నిర్మాణానికి స్థల పరిశీలన

**సత్తుపల్లి(కాకతీయ)మార్చి 07 :**



సత్తుపల్లి పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల మరియు ఉర్దూ పాఠశాల వద్ద బాలికల హాస్టల్ నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పరిశీలించారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చొరవతో మంజూరైన హాస్టల్ నిర్మాణం కోసం స్థానిక తహసీల్దార్‌తో కలిసి స్థల పరిస్థితులను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా బాలికల విద్యాభివృద్ధికి హాస్టల్ అవసరం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని



తెలిపారు. హాస్టల్ నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, సత్తుపల్లి మున్సిపల్ ఉపాధ్యక్షురాలు బొంతు సుమలత వేణు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు మరియు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు. హాస్టల్ నిర్మాణంతో సత్తుపల్లి ప్రాంతంలోని బాలికలకు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు వారి విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రకృతి వ్యవసాయం 10 సంవత్సరాల సెలబ్రేషన్

## - టిడిపి సీనియర్ నాయకులు వెన్న సీతారాం రెడ్డి





బెల్లంకొండ (కాకతీయ): పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలంలో, ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.ముఖ్యంగా ఆరోగ్యం,పోషణ సంబంధించిన అంశంలో, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన తొమ్మిది రకాల పంటల ఉత్పత్తులనుపేరుతో, గర్భిణి స్త్రీలు, బాలింతలకు డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది.

ప్రకృతి వ్యవసాయంలో10 సంవత్సరాలుగా పనిచేస్తున్న స్టాఫ్ తో వారి యొక్క అనుభవాలను, రైతులకు జరిగిన మార్పుల గురించి ఇంటర్వ్యూ చేయడం జరిగింది. ఈ సమావేశానికి గ్రామ పెద్దలు సీతారాం రెడ్డి , సెర్ప్ డిపిఎం, ఏపీఎం ఉష , పవన్ కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబందీ పాల్గొన్నారు.

# ఆయుష్ మెగవైద్యశిబిరం

## - డాక్టర్ ఎం శేఖర్ రాజు(ఆర్‌డిడి)

## - డాక్టర్ ఆర్ శ్రీనివాస్

రాజుపాలెం(కాకతీయ): పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం,దేవరంపాడు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నందు ఆరోగ్యమేల మేగ ఆయుష్ వైద్య శిబిరం శ్రీ డాక్టర్ ఎం శేఖర్ రాజు ఆర్ డి డి గారి ఆదేశానుసారం క్యాంపు నిర్వహించబడినది. డాక్టర్లు ఆర్ శ్రీనివాస్, . పద్మావతి. డాక్టర్ సుధాకర్ వైద్యాధికారి గార్ల ఆధ్వర్యములో దేవస్థానానికి వచ్చినటువంటి భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సరిపడే దీర్ఘకాలిక వ్యాధులకు తరుణ వ్యాధులకు ఆయుష్ మందులను







సుమారుగా 629 మంది ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది.రక్త చాప ము, మధుమేహం వ్యాధులను జీవనశైలి మార్పులతో ఆహారంలో పీచు పదార్థాలు చిరుధాన్యాలు మరియు ఔషధ మొక్కలతో ప్రదర్శించి వాటి ద్వారా కరపత్రాల ద్వారా పట్టణ సీఐ, పోలీసు అధికారులు ద్వారా పోస్టరు ఆవిష్కరించడం జరిగింది. ఆయుష్ జీవనశైలి విడుదల చేయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ సురేష్ ఈ ఓ, దేవాలయం చైర్మన్ వెంకటేశ్వర్ పోలీస్ అధికారులు జెడ్ పి టి సి, ఏం పి టి సి, ఎం పి పి ,ఈ ఓ పాల్గొన్నారు. డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ పద్మావతి సిబ్బంది లక్ష్మీనారాయణ, వెంకట రామయ్య, యోగ టీచర్ల వెంకటరమణ,రమేష్ కోటేశ్వరమ్మ ,భూక్య హనుమంతరావు నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

**కనిగిరి ( కాకతీయ) మార్చి 7 :** కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, బాలికలందరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా ఉపాధ్యాయులు పి అనిత, బట్టు శైలజరాణి, కె అనురాధ తదితరులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి అనేక ఇబ్బందులు ఉంటాయని వాటిని అధిగమించినప్పుడు మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు.



## యువ సముద్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

**కనిగిరి ( కాకతీయ) మార్చి 6 :** కనిగిరి నియోజకవర్గం పరిధిలోని పామూరులో యువ సముద్రం ఆధ్వర్యంలో పామూరు పోలీస్ స్టేషన్ సమీపంలో మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత మల్లికార్జున రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రతి శనివారం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 11 శనివారాలు అన్నదానాన్ని నిరుపేదలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చాలన్నదే మా ప్రధాన లక్ష్యం అని, భవిష్యత్తులో కేవలం అన్నదానమే కాకుండా నిరుపేదలకు మెరుగైన వైద్యం మరియు విజను అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అన్నారు.






## దేశంలోనే అత్యుత్తమ యూనిట్‌గా 'శ్రీహరికోట సిఐఎస్ఎఫ్'

### - హోంమంత్రి అమిత్ షా సమక్షంలో అవార్డు ప్రదానం!

**సూళ్లూరుపేట (కాకతీయ) మార్చి 7 :** భారతదేశపు ప్రతిష్టాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రం 'సతీష్ ధావన్ స్పేస్ సెంటర్' భద్రతను పర్యవేక్షిస్తున్న సిఐఎస్ఎఫ్ యూనిట్ జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. 2025 సంవత్సరానికి గాను 'ఉత్తమ యూనిట్ ట్రోఫీ'ని గెలుచుకుని శ్రీహరికోట కీర్తిని దశదిశలా చాటింది.అవార్డు ప్రదానం ఒడిశాలోని ముండాలి వద్ద మార్చి 6, 2026న జరిగిన సిఐఎస్ఎఫ్ స్థాపనా దినోత్సవ వేడుకల్లో (జనూ-2026) ఈ అవార్డును ప్రదానం చేశారు. కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా సమక్షంలో, సిఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ శ్రీ ప్రవీర్ రంజన్ ఐపీస్ చేతుల మీదుగా శ్రీహరికోట యూనిట్ సీనియర్ కమాండెంట్ శ్రీ సంజీత్ కుమార్ ఈ ప్రతిష్టాత్మక ట్రోఫీని అందుకున్నారు.
విజయానికి కారణమైన అంశాలు: పది కంటే ఎక్కువ కఠినమైన ప్రమాణాలలో రాణించినందుకు ఈ గుర్తింపు లభించింది. ముఖ్యంగా అత్యున్నత స్థాయి యాక్సెస్ కంట్రోల్ తనిఖీలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం. క్విక్ రెస్పాన్స్ టీమ్ మరియు మాక్ డ్రిల్స్ నిర్వహణ. అత్యవసర సమయాల్లో ఆకస్మిక ప్రణాళికల అమలు. అప్రమత్తమైన భద్రత సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ గారి సమర్థవంతమైన నాయకత్వంలో, షార్ వద్ద జరిగిన వివిధ రాకెట్ ప్రయోగాల సమయంలో 10,000 మందికి పైగా సందర్శకులకు మరియు వివిఐపి లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భద్రత కల్పించడంలో ఈ బృందం విజయం సాధించింది. దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు, విమానాశ్రయాలు, మెట్రో నెట్వర్క్ లతో పాటు కీలకమైన మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించే ఈ దళంలో శ్రీహరికోట యూనిట్ 'బెస్ట్'గా నిలవడం విశేషం.



## మహిళా ఉపాధ్యాయులకు చిరు సత్కారం

**సంతమాగులూరు(కాకతీయ):**



సంతమాగులూరు మండలంలోని కొమ్మలపాడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ)లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం లో భాగంగా మహిళా ఉపాధ్యాయినిలకు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు వేమవరపు కోటేశ్వరరావు, గార్ల దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు మరియు బాలికల పురోగతి సాధించడానికి మనమందరం మన మద్దతును అందించాలని పేర్కొన్నారులింగ సమానత్వానికి గణనీయమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి, అయినప్పటికీ అంకితమైన వనరులు మరియు మద్దతుతో, సానుకూల పురోగతి సాధించవచ్చని అన్నారు.గివ్ టు గెయిన్ అనేది అన్యోన్యత మరియు మద్దతు యొక్క శక్తిని నొక్కి చెబుతుంది. ప్రజలు, సంస్థలు మరియు సంఘాలు ఉదారంగా ఇచ్చినప్పుడు, మహిళలకు అవకాశాలు మరియు మద్దతు పెరుగుతాయి. ఇవ్వడం అనేది తీసివేత కాదు, అది ఉద్దేశపూర్వక గుణకారం. మహిళలు అభివృద్ధి చెందినప్పుడు, మనమందరం పురోగమిస్తామని తెలిపారు.అనంతరం ఉపాధ్యాయినీలను శాలువాతో సత్కరించి, గిఫ్ట్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ పుల్లారావు, ఉపాధ్యాయులు మసనం శ్రీనివాసరావు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంగారం గొలుసు కోసం ప్రాణం తీశారు

### నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు

- -ఆత్మహత్య కాదు.. పక్కా ప్లాన్‌తో హత్య
- -కిడ్నాప్ చేసి, చితకబాది.. పైపులతో కొట్టి.. చున్నీతో ఊపిరి తీసి
- -49 గ్రాముల బంగారం.. ఒక వ్యక్తి ప్రాణం తీసిన వైనం
- -రైలు పట్టాలపై మృతదేహం.. మిస్టరీని ఛేదించిన పోలీసులు
- -హుస్సేన్ మృతి కేసులో ఏడుగురు హిజ్రాల అరెస్ట్



**నాయుడుపేట (కాకతీయ) మార్చి 7** నాయుడుపేటలో ఇటీవల రైలు పట్టాలపై విగత జీవిగా కనిపించిన హుస్సేన్ మరణం వెనుక ఉన్న అసలు మిస్టరీని పోలీసులు ఛేదించారు. అది ఆత్మహత్య కాదు, పక్కా పథకం ప్రకారం జరిగిన హత్య అని పోలీసులు ధృవీకరించారు. ఈ కేసులో ఏడుగురు హిజ్రాలను అరెస్ట్ చేసినట్లు



నాయుడుపేట డిఎస్పీ చెంచు బాబు శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు .నాయుడుపేట ముస్లిం వీధికి చెందిన ఉస్మాన్ అనే వ్యక్తి, భాను అనే హిజ్రాతో గత 13 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నాడు .కొంతకాలం క్రితం భాను తన 49 గ్రాముల బంగారు గొలుసును ఉస్మాన్ వద్ద తాకట్టు పెట్టి డబ్బు తీసుకుంది. అయితే, ఆ బంగారాన్ని ఉస్మాన్ అన్న అయిన హుస్సేన్ విడిపించుకుని అమ్మివేసినట్లు తెలియడంతో భాను తీవ్ర ఆగ్రహానికి లోనైంది
బంగారం విషయంలో జరిగిన గొడవతో, భాను తన తోటి హిజ్రాలతో కలిసి హుస్సేన్‌ను కిడ్నాప్ చేసింది. తమ నివాసానికి తీసుకెళ్లి, అతడిని చున్నీతో కట్టేసి ప్లాస్టిక్ పైపులతో విచక్షణారహితంగా కొట్టి దారుణంగా హత్య చేశారు . ఈ హత్య తమపైకి రాకుండా ఉండేందుకు, అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని స్కూటీపై తీసుకెళ్లి పండ్లూరు సమీపంలోని రైలు పట్టాలపై పడవేశారు.పోలీసులు ఈ కేసులో ప్రధాన నిందితురాలు రాయపు భానుతో పాటు భావన, సదా, అశ్విని, గంగ, మైన, భవాని అనే ఏడుగురిని అరెస్ట్ చేశారు.వారి నుంచి హత్యకు ఉపయోగించిన చున్నీ, ప్లాస్టిక్ పైపు మరియు మృతదేహాన్ని తరలించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.నిందితులను కోర్టులో హాజరపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో పట్టణంలో హిజ్రాల ఆగడాలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వీటిని అస్సలు తినకూడదని కొన్ని ఆహార పదార్థాలు..!


ప్రస్తుత రోజుల్లో చాలామందిలో ఎసిడిటి కామన్ ప్రాబ్లెమ్ అయిపోయింది. గుండెలో మంట, అమాశయంలో నొప్పి, ఆహారం అరగనట్లు అనిపించడం, త్రేన్పులు, ఆకలి తగ్గటం, వికారం, వాంతులు నోట్లో నీళ్లూరుతున్నట్లు ఉండటం ఈ లక్షణాల్లో చాలాభాగం మహిళలను వేధిస్తుంటాయి. అనేక సందర్భాల్లో తలనొప్పి, నెలసరి నొప్పి వంటివి వాటికి మందులు వేసుకున్నప్పుడు పై లక్షణాలు మూకుమ్మడిగా వేధిస్తాయి. ఈ లక్షణాల సమూహానికి వైద్య పరిభాషలో గ్యాస్ట్రైటిస్ అని పేరు. అయితే దీన్ని అందరూ సాధారణంగా ఎసిడిటి అంటుంటారు. ఆయుర్వేదంలో ఆమ్లపిత్తం అని పేరు.
ఆరోగ్యకరమైన లైఫ్ స్టయిల్, చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆహారం తీఉకోవడంలో అవకతవకలు, మానసికమైన ఆందోళనలు, ఇవన్నీ కూడా యాసిడ్ రిప్లైకు కారణం అవుతాయి.
నిద్రాహారాలు లేకుండా చేసే ఈ సమస్య మీద సరైన అవగాహన కలిగి ఉంటే దీనిని సునాయాసంగా ఎదుర్కోవచ్చు.



ఎసిడిటి ఉన్నప్పుడు ఆహారం తినాల్సిన విధానం : ఆహారాన్ని కొద్దిమొత్తాల్లో నిదానంగా నమిలి తినాలి. హడావిడిగా మింగకూడదు. అలాగని గంటల తరబడి తింటూ కూర్చోకూడదు. గబగబా మింగితే ఆమాశయంలోని యాసిడ్ అన్న నాళికలోకి ఒంగి మంటగా అనిపిస్తుంది. గంటల తరబడి తింటూ
ఉంటే ఆహారం సగం జీర్ణం, సగం కాకుండా అజీర్ణం కలుగుతుంది. ఎసిడిటి ఉన్న వారు ప్రతి మూడు గంటలకు ఏదో ఒక ఆహార పదార్థాన్ని తింటూ
ఉండటం మంచిది.
ఎప్పుడు నిద్ర పోవాలి? :
ఆహారం తిన్న కొంచెం సేపు కూర్చోవాలి. ఆ తరువాత వంద



అడుగులు అటూ ఇటూ నడవాలి. ఆహారం తీసుకున్న వెంటనే నిద్రకు ఉపక్రమించకూడదు. నిద్రకూ, ఆహారానికి మధ్య కనీసం రెండు గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. ఆమాశయంలోనికి ప్రవేశించిన ఆహారం చిన్న ప్రేవులోనికి వెళ్లడానికి అరగంట నుంచీ రెండు గంటల వరకు పడుతుంది. ఈ లోపు పడుకుంటే అన్నం మెతుకులు గొంతులోకి వచ్చే అవకాశం ఉంది.ఎసిడిటికి అసలు కారణం తీసుకొనే ఆహారం. రాత్రిళ్ళో నిద్ర, సరైన టైమ్‌కు నిద్రపోకపోవడం కూడా ఎసిడిటికి కారణం అవుతుంది. రాత్రి సమయంలో మీ నిద్రను పాడు చేసే



కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయి. ఆశ్చర్యం కదా..? కొన్ని పదార్థాలను రాత్రిల్లో తినడం వల్ల ఎసిడిటి, ఛాతీలో మంట, కడుపులో వికారం వంటి సమస్యలు ఏర్పడుతాయి. అంతేకాదు తెల్లవారి నిద్రలేవగానే పుల్లని త్రేన్పులు, వాంతి, నోట్లో చేదుగా అనిపించడం, నోట్లో నీళ్ళు ఊరడం వంటి లక్షణాలు



కనబడుతాయి. ఇదంతా రాత్రి సమయంలో తీసుకొనే కొన్ని ఆహారాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ అపహారాలే ఎసిడిటికి దారిస్తుంది. కాబట్టి హార్ట్ బర్న్ సమస్య నుండి బయటపడాలంటే ఎసిడిటికి కారణం అయ్యే కొన్ని ప్రాబ్లమ్యాటిక్ ఆహారాలను ప్రతి సమయంలో అవాయిడ్ చేయడమే ఉత్తమం. మరి అవేంటో ఒకసారి చూద్దాం..

## నాయుడుపేటలో పోలీసుల 'మెగా' కార్డన్ సెర్చ్

### - గంజాయి అడ్డాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా!

**నాయుడుపేట (కాకతీయ) మార్చి 7:** నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో పోలీసులు భారీ ఎత్తున 'కార్డన్ సెర్చ్' నిర్వహించి కలకలం రేపారు. గంజాయి విక్రయాలకు అడ్డాగా పేరుపడ్డ ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా తుడిచిపెట్టేందుకు డీఎస్పీ చెంచుబాబు నాయకత్వంలో పోలీసులు శనివారం మెరుపు దాడులు చేపట్టారు. కాలనీలోని ప్రతి సందు గొందును నిశితంగా



పరిశీలించేందుకు పోలీసులు తొలిసారిగా డ్రోన్ కెమెరాలను ఉపయోగించారు. ఆకాశం నుండి అనుమానాస్పద కదలికలను పర్యవేక్షిస్తూ, అకస్మికంగా ఇంటింటి తనిఖీలు చేపట్టారు.ఈ ఆపరేషన్‌లో సీఐలు వెంకటేశ్వర్, సంఘమేశ్వరరావులతో పాటు ఎస్ఐలు శ్రీకాంత్, ఆదిలక్ష్మి, బ్రహ్మనాయుడు, జీవీ చౌదరి, అజయ్‌కుమార్‌లు బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. కాలనీలోని ప్రతి ఇంట్లోనూ, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. సరైన పత్రాలు =జ లేని వాహనాలను తనిఖీ చేసి, అక్రమంగా నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ.. అంతీకాలనీకి గంజాయి విక్రయ కేంద్రమనే చెడ్డ పేరు ఉంది. దానిని తుడిచిపెట్టడమే మా లక్ష్యం. గంజాయి అమ్మేవారిపై ఇప్పటికే పూర్తి నిఘా పెట్టాం, సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు చెప్పాలి'' అని కాలనీవాసులకు సూచించారు.

## సౌమ్యనాథుని దర్శించుకున్న గుంటకల్ డివిజన్ రైల్వే సీనియర్ డివిజనల్ హెల్త్ అండ్ హౌస్ కీపింగ్ మేనేజర్



**నందలూరు (కాకతీయ) మార్చి 7 :** కడప జిల్లా రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలంలోని చారిత్రాత్మిక శ్రీ సౌమ్యనాథ ఆలయాన్ని గుంటకల్ డివిజనల్ రైల్వే సీనియర్ డివిజన్ రైల్వే హౌసింగ్ కీపింగ్ మేనేజర్ కుమార్ సెక్షన్ హెల్త్ ఇన్స్పెక్టర్ నాగరాజు శనివారం నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా నందలూరు రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి,వారికి ఘన స్వాగతం పలికారు అనంతరం స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించితీర్థప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఉపాధ్యక్షులు మండల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

8
8 ఆదివారం
మార్చి
2026
కాకతీయ
అనంతపురం - శ్రీ సత్యసాయి

# వాహనాలను తనిఖీ చేసిన సీఐ శ్రీనివాసులు

**యాడికి(కాకతీయ) మార్చి 07 :**
యాడికి మండల కేంద్రంలోని వేములపాడు రోడ్డులో శనివారం వ సీఐ శ్రీనివాసులు, ఏఎస్సై వెంకటేష్ లు వాహనాల తనిఖీ చేశారు..ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వవద్దని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదకరమని, అలాంటి చర్యలు ప్రాణాంతక ఫలితా లకు దారి తీస్తాయని హెచ్చరించారు. సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డు పై నడిపిస్తే సీజ్ చేస్తామని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని,వాహనాలకు ఉన్న పెండింగ్ చలాన కట్టలని అన్నారు. ఈ కార్యక్ర మంలో సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన చెక్కు పంపిణీ

**అమడగూరు(కాకతీయ)మార్చి 7 :**
మండల పరిధిలోని చిన్నగానిపల్లి గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన వెంకటలక్ష్మమ్మ ఇటీవల మరణించారు.ఆమె ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో నమోదు చేసుకున్న నేపథ్యంలో,ఆ పథకం ద్వారా లభించిన రూ.2 లక్షల బీమా చెక్కును ఆమె కుమార్తె యశోద కు అందజేశారు.అమడగూరు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్‌కు చెందిన బ్యాంకు కరస్పాండెంట్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ చెక్కును బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సిఎఫ్ఎల్ కౌన్సిలర్ వేమనారాయణ మాట్లాడుతూ,గతంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో వెంకటలక్ష్మమ్మ ఈ బీమా పథకంలో నమోదు చేసుకున్నారని తెలిపారు.అందువల్ల ఆమె మరణించిన తర్వాత కుటుంబ సభ్యులకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిందని వివరించారు.అదేవిధంగా ప్రతి ఖాతాదారుడు సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లించి ఈ బీమా పథకంలో పేరు నమోదు చేసుకుంటే,అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు కుటుంబానికి ఆర్థిక భద్రత కలుగుతుందని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు కరస్పాండెంట్ వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.




# అమరాపురం మండల కాపునాడు అధ్యక్షుడిగా విద్యాసాగర్

**అమరాపురం(కాకతీయ):**
అమరాపురం మండల కాపునాడు మండల అధ్యక్షుడిగా నడలుడం గ్రామానికి చెందిన బలిజ గోవిందప్ప కుమారుడు జి విద్యాసాగర్ ను ఎంపిక చేసినట్లు సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఇటికింటి మహేష్ మరియు రాయలసీమ కాపు నాడు అధ్యక్షుడు పూల పాండురంగ లు ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కాపునాడు అధ్యక్షుడిగా ఎంపికైన జి విద్యాసాగర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బలిజ కులస్తులు అత్యధిక సీట్లలో విజయం సాధించడానికి బలిజ సోదరుల సహాయ సహకారాలతో తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. బలిజల ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. అదేవిధంగా నిరుపేద కాపు బలిజ విద్యార్థుల ఉన్నత చదువులు చదువుకోడానికి కాపునాడు సంఘం తరపున సహాయ సహకారాలను అందించడానికి కృషి చేస్తానన్నారు. రాజకీయంగా ఆర్థికంగా బలిజల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. మండల కాపునాడు అధ్యక్షుడిగా తన ఎంపికకు సహకరించిన కుల బాంధవులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మండల కాపునాడు అధ్యక్షుడుజి విద్యాసాగర్ తెలిపారు.



# ఆర్డిటీని కాపాడండి -నిరుపేదల జీవితాలలో వెలుగు నింపండి







**పెనుకొండ (కాకతీయ)మార్చి 7 :**
శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గశీ మండల కేంద్రము నందు బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పెనుకొండ తహశీల్దార్ కార్యాలయం నుండి వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ సర్కిల్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదనంతరం పట్టణంలోని దర్గా సర్కిల్,యస్ కే డి సర్కిల్, తెలుగుతల్లి సర్కిల్,యన్ టి ఆర్ సర్కిల్, మీదగా పెనుకొండ పట్టణంలోని కేంద్ర ప్రభుత్వశీ ఆధ్వర్యములో నిర్వహించే తపాలా శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నీ చేపట్టడం జరిగినది. అనంతరం బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యములో పెనుకొండ పట్టణంలోని తపాలా శాఖ కార్యాలయంను ముట్టడి చేయడం జరిగినది. ఈ కార్యక్రమశీలో శివరామకృష్ణ మాట్లాడుతూ ఆర్ డి టి. ఎఫ్ సి ఆర్ ఏ ను వెంటనే రెన్యువల్ చేయాలని,లేని పక్షములో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద మరియు వాటి కార్యాలయాల ముట్టడి తీవ్ర ఒత్తిడి తీసుకు వస్తాము అని,అలాగే బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆర్డిటి సేవలు చాలా ఉపయోగకరము అని, నిరుపేదల కడుపు పొట్టొద్దండి అంటూ ఆర్ డి టి. సేవలకు ఆటంకం కలిగించడం చాలా దారుణం అని అనేక వేలాది కుటుంబాలకు ఆసరాగా నిలిచిన ఆర్డిటి సంస్థ కుల మతాలకు అతీతంగా నిరుపేద వర్గాలకు నిశ్వక్షపాతంగా సేవలందిస్తూ విద్యా, వైద్యం, గ్రామీణ అభివృద్ధి, క్రీడలు, ఇలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు అనేక సంవత్సరాల నుంచి ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్డిటి సమస్తను అడ్డుకోవడం బాధాకరం కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలను దృష్టిలో ఉంచుకొని ఆర్డీటీ సంస్థకు వెంటనే ఎఫ్ సి ఆర్ ఏ.రెన్యువల్ చేయాలని తెలియజేయడం జరిగినది. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఎంపీ ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసంఘం వ్యవస్థాపకులు దాసగానిపల్లి కుళ్ళయప్ప,జై భీమ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్టు రామాంజనేయులు,రాయలసీమ కో ఆర్డినేటర్ చల్లాపల్లి ఈశ్వర్,గౌరవ అధ్యక్షులు యంగ్ ఇండియా వెంకటేశులు,రంగేపల్లి కదిరప్ప,నరసింహులు, గోవిందప్ప,బైబిల్ మిషన్ చర్చ్ పాస్టర్ సుధాకర్,తరిమెల సూర్యనారాయణ, జనసేన నాగరాజు, కదిరప్ప, కోనాపురం మారుతి, కొల్లప్ప ఆంద్రూస్, పవన్ కుమార్, భవాని ప్రసాద్, బాలాజీ, మహేష్, నాగలూరు శివ, సిసింద్రీ, రాజశేఖర్, బహుజన చైతన్య వేదిక సభ్యులు పెనుకొండ ఎస్సీ కాలనీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి దురాక్రమణ

## - అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

**తిరుపతి (కాకతీయ)మార్చి 7 :**
మండలంలోని ఊట్లపల్లి పంచాయతీ పరిదిలోని పాపిరెడ్డిపల్లి లో గల వడ్డిపాళెం వద్ద వెంకటగిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిని దురాక్రమణ చేసి ప్లాటు మూడు ల క్షల రూపాల చొప్పున అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. గ్రామంలో ఎంతో మంది నివాస స్థలాలు లేని వారు 0డగా వెంకటగిరి పట్టణానికి చెందిన వ్యక్తి ఆక్రమించి అమ్ముకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపద్యంలో గ్రామానికి చెందిన అదికార పార్టీకి చెందిన ఓ నేత అండదండలుతో ఆక్రమణ దారులు గత రెండు రోజులుగా ఆక్రమణ భూమిని చదును చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు కొందరు రెవెన్యూ అదికారులకు పిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ విజయలక్ష్మి విఆర్ఓ మోహన్ ను పంపి అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. ఆక్రమణలను అడ్డుకుని గ్రామంలో నివాస స్థలాలు లేని వారికి నివాస స్థలాలు ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# రాయలచెరువులో మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన


**యాడికి(కాకతీయ) మార్చి 07 :**



యాడికి మండల పరిధిలోని రాయలచెరువు రైతు సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి ఉమాదేవి రైతులకు మైక్రో ఇరిగేషన్ పద్ధతులు, మొబైల్ ద్వారా నీటి పారుదల వ్యవస్థను నియంత్రించే ఆటోమేషన్ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ కోదండ రామ్ స్వామికి పూజలు



**అమడగూరు (కాకతీయ)మార్చి 7 :**
మండల పరిధిలోని ఏ కొత్తపల్లి బొబ్బిలి కోట గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి దేవాలయంలో మరియుఅభయ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం నాడు కొత్త పల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు కుటుంబ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు ఆలయ పూజారులు గురు దత్త స్వామివారికి నూతన వస్త్రాలు ధరించి వివిధ పూలమాల లు ధరించి పాలు పెరుగు తేనె నెయ్యి తో అభిషేకాలు చేశారు అనంతరం విచ్చేసిన భక్తాదులకు పంచామృతం తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమం లో ఏ కొత్త పల్లి గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# 16న పొట్టి శ్రీరాముల గ్రహావిష్కరణ

## - 58 అడుగుల ఎత్తులో అమరజీవి కాంస్య విగ్రహం

## - సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరణ



తుళ్లూరు/అమరావతి : అమరజీవి పొట్టి శ్రీరాముల ప్రాణ త్యాగ ఫలితం భావితరాలకు తెలియజేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. పొట్టి శ్రీరాముల 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరులో ఏర్పాటు చేస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో ఏర్పాటు చేస్తున్న ఆయన విగ్రహ పనులను శనివారం మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతిలో 6.8 ఎకరాల్లో స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ పేరుతో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్మృతి వనంలో ఆయన కాంస్య విగ్రహాన్ని అమరజీవి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తోందన్నారు. అమరజీవి 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఎత్తైన ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆశయాలను, త్యాగాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే స్మృతి వనం లక్ష్యమన్నారు. ఈ నెల 16న అమరజీవి 125వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహావిష్కరణను చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు తరలిరానున్నారన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి



అమ్మవారి ఆత్మార్పణ చేసిన రోజును రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. వాసవీ మాత పేరుతో ఆమె జన్మించిన పెనుగొండ గ్రామాన్ని వాసవీ పెనుగొండగా మార్చామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు ఆమె, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా పొట్టి శ్రీరాముల విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్ 2026 సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు










Printed, Published & Owned by Mandalapu Benarji Naddh and Printed at Raghava Printers, D.No. 28-6-390/1, MIG-90, A.P. Housing Bord Colony, Near Masque, ANANTAPUR, A.P and Published at D.No. 28-6-390/1, MIG-90, A.P. Housing Bord Colony, Near Masque, ANANTAPUR, A.P , Editor.: Mandalapu Benarji Naddh